




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక








Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
Navabhoomi daily fallows..

హైదరాబాద్ | 13 శుక్రవారం | జూన్, 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 269

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur


# ఘోర ప్రమాదం

- అహ్మదాబాద్‌లో ఘోర విమాన ప్రమాదం
- ఎయిర్ ఇండియా విమాన దుర్ఘటన విషాదాంతం..!
- లండన్‌కు వెళ్లేందుకు పూర్తిస్థాయి ఇంధనం నింపుకుని వెళ్తున్న ఈ విమానం కుప్పకూలడంతో చెలరేగిన మంటలు
- మాడి మసైపోయిన విమానంలోని ప్రయాణికులు
- మాజీ సీఎం, పైలట్ల సహా 242 మందీ మృతి..!
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన భారత ప్రధాని మోదీ
- హుటాహుటిన సంఘటనా స్థలానికి అమిత్‌షా

2



మాజీ సీఎం విజయ్

**అహ్మదాబాద్- నవభూమిబ్యూరో**

అహ్మదాబాద్ ఎయిర్ పోర్టు నుంచి టేకాఫ్ అయిన ఎయిర్ ఇండియా బోయింగ్ ఏఐ171 విమానం మధ్యాహ్నం 1.30 గంటలకుకేవలం ఐదు నిమిషాల వ్యవధిలోనే అనూహ్యంగా కుప్పకూలిన ఘటనలో మొత్తం 242 మందీ చనిపోయారు. లండన్‌కు వెళ్లేందుకు పూర్తిస్థాయి ఇంధనం నింపుకుని వెళ్తున్న ఈ విమానం కుప్పకూలడంతో భారీ ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ మంటల్లో పడి ప్రయాణిస్తున్న వారంతా చనిపోయారు. ఈ ఘటనలో ఎవరూ ప్రాణాలతో మిగిలే అవకాశం లేదని తేలిపోయింది.

ప్రమాదం జరిగిన సమయంలో ఎయిర్ ఇండియా విమానంలో 230 మంది ప్రయాణికులు, 10 మంది ఎయిరిండియా సిబ్బంది, మరో ఇద్దరు పైలట్లు ఉన్నారు. వీరంతా విమానం కుప్పకూలగానే మంటల్లో చిక్కుకుపోయి అక్కడికక్కడే అగ్నికి ఆహుతి అయిపోయారు. వీరిలో కొన ఊపిరితో ఉన్న కొందరిని ఆస్పత్రులకు తరలించినా డాక్టర్లు వారిని కాపాడలేకపోయినట్లు తెలుస్తోంది. వీరిలో గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ కూడా ఉన్నారు. విమాన ప్రమాదంలో మొత్తం 242 మందీ చనిపోయినట్లు అహ్మదాబాద్ పోలీసు కమిషనర్ జ్ఞానేంద్ర సింగ్ ప్రకటించారు. ఈ ఘటనలో మృతదేహాల్ని పోస్టుమార్టం నిర్వహించి వారి కుటుంబాలకు అప్పగించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఇవాళ ఎయిర్ ఇండియా విమానంలో ప్రయాణించిన వారిలో 169 మంది భారతీయులతో పాటు 53 మంది బ్రిటిష్ పౌరులు, ఏడుగురు పోర్చుగీసు పౌరులు, ఒక కెనడా పౌరుడు ఉన్నారు. వీరితో పాటు విమానంలో సేవలు అందించే 10 మంది సిబ్బంది, పైలట్, కోపైలట్ కూడా ప్రాణాలు కోల్పోయారు. వీరితో పాటు విమానం కుప్పకూలిన హాస్టల్ లో ఉన్న మెడికోలు 50 నుంచి 60 మంది గాయాల పాలయ్యారని అధికారులు ప్రకటించారు. వీరిని వివిధ ఆస్పత్రుల్లో చేర్చి చికిత్స అందిస్తున్నారు. వీరిలోనూ కొందరు చనిపోయినట్లు తెలుస్తోంది. మరికొందరు పరిస్థితి విషమంగా ఉంది.

**విమాన ప్రమాద ఘటనపై మోదీ కీలక ఆదేశాలు.. ఘటనా స్థలికి అమిత్ షా!**

పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడుతో మాట్లాడి అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాద ఘటనను సమీక్షించిన ప్రధాని. అవసరమైన సహాయాన్ని వెంటనే అందించాలని, పరిస్థితిపై క్రమం తప్పకుండా సమాచారం అందించాలని ప్రధానమంత్రి మంత్రిని ఆదేశించారు. అహ్మదాబాద్‌లో విమానం కూలిన నేపథ్యంలో పౌరవిమాన యాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు అక్కడ సహాయక కార్యక్రమాలలో పాల్గొనడానికి వెళ్లారు. ఈ ఘటనపై డీజీసీఏ, ఎయిరిండియా,

## పిడుగులు పడి 8మంది మృతి

- ఆదిలాబాద్ జిల్లాలో తీవ్ర విషాదం..
- మృతులంతా వ్యవసాయ కూలీలే
- మరో నాలుగు రోజులు వర్షాలే
- అప్రమత్తంగా ఉండాలన్న అధికారులు

2



**ఆదిలాబాద్-నవభూమిబ్యూరో**

తెలంగాణలో వానలు బీభత్సం సృష్టిస్తున్నాయి. హైదరాబాద్‌లో కుండపోత వర్షం కురవగా, ఆదిలాబాద్ జిల్లాలో పిడుగులు పడి 8 మంది మృతి చెందారు. మృతులంతా వ్యవసాయ పనులు చేసుకునే కూలీలే. హైదరాబాద్ లోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రానున్న నాలుగు రోజులు భారీ వర్షాలు

## తెలంగాణలో 5 రోజులు వర్షాలు

- ఎల్లో అలెర్ట్ జారీ

2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

తెలంగాణలో రాగల ఐదురోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ పేర్కొంది. గురువారం జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని చెప్పింది.

తెలంగాణలో రాగల ఐదురోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ పేర్కొంది. గురువారం జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం,

## ఒక్కడు మృత్యుంజయుడు

**అహ్మదాబాద్-నవభూమి:** విమాన ప్రమాదంలో బతికిన 38 ఏళ్ల రమేశ్ విశ్వకుమార్ అహ్మదాబాద్‌లో మిరాకిల్ జరిగింది. విమానం కూలే

2



## నటి కల్పిక గణేశ్‌పై కేసు

- గత నెల 29న ప్రిజం పబ్‌కు వెళ్లిన కల్పిక
- కేక్ విషయంలో సిబ్బందితో వాగ్వాదం
- దురుసుగా ప్రవర్తిస్తూ సిబ్బందిపై ప్లేట్లు విసిరేసిన నటి
- సిబ్బంది బాడీ షేమింగ్ చేసి,బూతు తిట్టినట్లు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన పబ్ యాజమాన్యం

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

నటి కల్పిక గణేశ్‌పై కేసు నమోదైంది హైదరాబాద్ నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ప్రిజం పబ్ (సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించిన కారణంగా గచ్చిబౌలి పోలీసులు నటిపై కేసు నమోదు చేశారు. నటి కల్పిక గత నెల 29న ప్రిజం పబ్‌కు వెళ్లింది. అక్కడ కేక్ విషయంలో కల్పిక గణేశ్‌కు, పబ్ సిబ్బందికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఆ





# మీ పరిధిలో ఏం జరుగుతుందో తెలియదా?



**హైదరాబాద్-నవభూమి:** పలువురు జిల్లా రిజిస్ట్రార్లు వారి పరిధిలోని కార్యాలయాల్లో రోజువారీ కార్యకలాపాలు, లావాదేవీలపై వివరాలు చెప్పలేకపోవడంతో రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ జ్యోతి బుద్ధప్రకాశ్ మండిపడ్డారు. 'మీ పరిధిలో ఏం జరుగుతుందో కూడా తెలియకుండానే పని చేస్తున్నారా' అని ప్రశ్నించారు. భూముల మార్కెట్ విలువ పెంపుపై జిల్లా రిజిస్ట్రార్లు, ఇతర అధికారులతో ఐజీ కొన్ని రోజులుగా సమావేశమై అభిప్రాయ సేకరణ చేస్తున్నారు. కొంతమంది జిల్లా రిజిస్ట్రార్లు కనీస అవగాహన లేకుండానే పనిచేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఓ రిజిస్ట్రార్‌ను 'మీ జిల్లాలో ఎన్ని మునిసిపాలిటీలున్నాయి? ఎన్ని గ్రామాలు మీ పరిధిలోకి వస్తాయి? ఏ ప్రాంతంలో ఎక్కువ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి? ఎక్కువగా స్థలాలు రిజిస్ట్రేషన్ జరిగే ప్రాంతం ఏమిట'నే వివరాలు అడగ్గా ఆయన తెలుసుకుని చెబుతానని సమాధానం ఇచ్చారు. 'మీ జిల్లాకు సంబంధించిన సమాచారం కూడా తెలుసుకోకుండానే పనిచేస్తున్నారా' అని ఐజీ ఆ అధికారిని నిలదీశారు. జీహెచ్ఎంసీలో ఓ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని ప్రాంతాల వివరాలు చెప్పాలని అడగ్గా సంబంధిత అధికారి నీళ్లు నమలడంతో ఐజీ నివ్వెరపోయారు. 'పైరవీలు చేసుకుని ఉద్యోగాలు తెచ్చుకోవడం కాదు.. పనిచేయడం కూడా నేర్చుకోవాల'ని ఐజీ ఉద్యోగులను హెచ్చరించడం రిజిస్ట్రేషన్ శాఖలో చర్చనీయాంశంగా మారింది.

## నవ వార్త



# చట్టానికి ఎవరూ అతీతులు కారు..



**హైదరాబాద్-నవభూమి:** చట్టానికి ఎవరూ అతీతులు కారని, ప్రజా సొమ్మును ఇష్టారీతిన ఖర్చు చేయడం వల్లే కమిషన్ ఎదుట మాజీ సీఎం కేసీఆర్ విచారణకు హాజరయ్యారని ఎమెల్సీ ప్రొఫెసర్ కోదండరాంఅన్నారు. ఆయన హయాంలో రూ.లక్ష కోట్లు వెచ్చించి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారని, ఈ నేపథ్యంలో కేసీఆర్ విచారణకు హాజరైనందుకు కొందరు రాద్ధాంతం చేయడం సరికాదన్నారు. నాంపల్లిలోని టీజేఎస్ రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ జనసమితి గ్రేటర్ హైదరాబాద్ ప్లీనరీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కోదండరాం పార్టీ జెండా ఎగురవేశారు. ప్రొఫెసర్ జయంశంకర్, అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ తప్పు చేస్తే చట్టం ముందు ఎవరైనా నిలబడి సమాధానం చెప్పాల్సిందేనన్నారు. కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం కూలిపోయి, అప్పులు మాత్రం మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు. కమిషన్ ఎదుట కేసీఆర్ నిజాలు చెబితే బాగుంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను వింటుందని, కేసీఆర్ పాలనలో అలాంటి అవకాశమే లేదన్నారు. రానున్న కాలంలో తెలంగాణ జనసమితిని మరింత బలోపేతం చేయాలని సూచించారు.

నగర అధ్యక్షుడు ఎం.నర్సయ్య అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రొఫెసర్ హరగోపాల్, తెలంగాణ జనసమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బైరి రమేశ్, పల్లె వినయ్, నగర ప్రధాన కార్యదర్శి రాంచందర్, కార్మిక విభాగం అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, మహిళా విభాగం అధ్యక్షురాలు లక్ష్మి, కార్యదర్శి పుష్పలతగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సన్నబియ్యం ఎఫెక్ట్.. రేషన్ షాపుల్లో నో స్టాక్



**హైదరాబాద్-నవభూమి:**రేషన్ దుకాణాల వద్ద నోస్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. 3 నెలల కోటాను ఒకేసారి ఇస్తుండడంతో వారం, పది రోజులుగా రద్దీగా, క్యూ లైన్లతో ఉన్న రేషన్‌షాపులు కొన్నిచోట్ల స్టాక్ లేకపోవడంతో ఖాళీగా ఉండగా, మరికొన్ని చోట్ల డీలర్లు మూసి ఉంచారు. హైదరాబాద్ జిల్లాతో పాటు మేడ్చల్, రంగారెడ్డి(%వీవసఎష్ట్రుశ్రీ, ఘఅస్త్రు =వసఎఎ%) జిల్లాల పరిధిలో నగర శివారు ప్రాంతాల్లోనూ పలు చోట్ల రేషన్ షాపుల్లో స్టాక్ లేకపోవడంతో మూసి ఉంచారని స్థానికులు వాపోతున్నారు. పోర్టబిలిటీ ఉండడంతో ఇతర ప్రాంతాల్లో ఉన్న రేషన్ షాపులకు వెళ్లినా అక్కడ సైతం స్టాక్ లేదని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. స్టాక్ ఉన్నప్పుడు రద్దీగా ఉందని తిరిగొచ్చి, రెండు రోజుల తర్వాత వెళ్తే స్టాక్ లేదని చెబుతున్నారని వాపోతున్నారు.

**సన్న బియ్యానికి పెరిగిన డిమాండ్**

ప్రభుత్వం గత ఏప్రిల్ నెల నుంచే సన్న బియ్యం పంపిణీ చేస్తుండడంతో లబ్ధిదారులందరూ షాపులకు క్యూ కట్టారు. దీనికి తోడు జూన్ నెలలోనే ఒకేసారి 3 నెలల బియ్యం ఇస్తుండడంతో సరుకులు తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. వందల సంఖ్యలో ఉన్న రేషన్ షాపులకు సరిపడా స్టాక్ చేరవేయాలంటే 2-3 రోజుల సమయం పడుతుందని, అప్పటి వరకు కొన్ని షాపుల్లో నో స్టాక్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారని పౌరసరఫరాల శాఖ అధికారి ఒకరు తెలిపారు.

కాగా, ప్రతి నెలా రేషన్ బియ్యం పంపిణీ 15వ తేదీ వరకు ఉండగా, జూన్ నెలలో మాత్రం 30వ తేదీ వరకు ఇవ్వాలని పౌర సరఫరాల శాఖ నిర్ణయించింది. గోదాంల నుంచి రేషన్ షాపులకు బియ్యాన్ని చేరవేయాలంటే కొంత సమయం పడుతుందని పేర్కొంది. రేషన్ డీలర్లు, ఆయా సర్కిల్ ఏఎస్ఓలు ఇచ్చే సమాచారం మేరకు వెంటనే స్టాక్‌ను పంపించే ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు తెలిపారు.

# బల్దియా గొప్పలు.. తప్పవా తిప్పలు..



**హైదరాబాద్-నవభూమి:** బల్దియా గొప్పలు ప్రజలకు తిప్పలుగా మారుతున్నాయి. క్షేత్రస్థాయిలో సాధ్యాసాధ్యాలు పరిశీలించకుండా ప్రచార ఆర్భాటం, పని చేస్తున్నామనే భావన ప్రజల్లో కల్పించేందుకు చేపట్టిన చర్యలు మొదటికే మోసం తెచ్చాయి. సంస్థ బాధ్యతలను ఇతర విభాగాలకు బదలాయించిన పరిస్థితికి తీసుకువచ్చాయి. వర్షాకాల అత్యవసర/తక్షణ మరమ్మతు బృందాల ఏర్పాటుకు సంబంధించి 'ప్రత్యేక' వాహనాలు ఏర్పాటు చేయాలన్నది సంస్థలోని కీలక అధికారి నిర్ణయంగా తెలుస్తోంది. ట్రాక్టర్లు, టాటా ఏస్ వాహనాల వినియోగం సబబు కాదని పేర్కొన్న ఆయన టీజీఎస్‌పీడీసీఎల్, అగ్నిమాపక శాఖ, హైడ్రా తరహాలో ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేయాలని సూచించినట్టు సమాచారం.కొత్తగా వినియోగించనున్న వాహనాలపై హైడ్రా లోగో, కాల్ సెంటర్ నంబర్ తదితర వివరాలుండేలా చూడాలని సూచించారు. తద్వారా ఆయా పనులు జీహెచ్ఎంసీ(చేస్తుందన్న అభిప్రాయం ప్రజలకు కలుగుతుందని భావించారు. గతంలో వినియోగించిన వాహనాల వల్ల సంస్థకు పనిచేస్తుందన్న పేరు రాకపోగా, క్షేత్రస్థాయిలో వరద నీటి నిర్వహణ సరిగా జరగలేదన్న అభిప్రాయం సదరు అధికారి వ్యక్తం చేసినట్టు సమాచారం.అధికారుల కక్కుర్తి..డివిజన్‌కు ఒకటి చొప్పున ఏర్పాటు చేసే బృందాలతో పాటు స్థానిక అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) వెళ్లేలా వాహనం ఉండాలని ఉన్నతాధికారి సూచించినట్టు తెలిసింది. డ్రైవర్‌తోపాటు ఏఈఈ కూర్చుంటారని, వెనుక వైపు పరికరాలు, కార్మికులు ఉండేందుకు సౌకర్యవంతంగా ఉండే వాహనం పరిశీలించాలని చెప్పారు. దీనిని రవాణా విభాగంలోని కొందరు అధికారులు సొమ్ము చేసుకునే ప్రయత్నం చేశారు. ఓ కంపెనీ వాహనాలు మాత్రమే వినియోగించేలా టెండర్ నిబంధనలు రూపొందించారు. ఆ వివరాలను ముందే తమకు సన్నిహితంగా ఉండే కాంట్రాక్టు సంస్థలకు చెప్పి ముందస్తు ఒప్పందం చేసుకునేలా ప్రోత్సహించారు.ఇప్పుడు అదే జీహెచ్ఎంసీకి ఇబ్బందికరంగా మారింది. టెండర్లలో గోల్‌మాల్‌తో సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. హైడ్రాకు బాధ్యతలు అప్పగించిన నేపథ్యంలో టెండర్ ప్రక్రియ పూర్తయి అత్యవసర/తక్షణ మరమ్మతు బృందాలు అందుబాటులోకి రావడానికి మరో రెండు వారాలు పట్టే అవకాశముంది. అదృష్టవశాత్తు ప్రస్తుతంవర్షాలు కురవడం లేదు. ఒకవేళ వరణుడు గట్టిగా పలకరిస్తే, వరద నీటి నిర్వహణ చర్యలు చేపట్టక మహానగర అస్తవ్యస్తం కావడం ఖాయం. మొత్తంగా బల్దియా ప్రచార ఆర్భాటం.. మహానగర పౌరులకు ఇబ్బందికరంగా మారే ప్రమాదముంది.

# ఆ ఉద్యోగుల కోసం తెలంగాణ ప్రభుత్వం కీలక ఒప్పందం



**హైదరాబాద్-నవభూమి:**విద్యుత్ శాఖ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం భారీ శుభవార్త చెప్పింది. ఏకంగా వారికి కోటి రూపాయలు లబ్ధి చేకూర్చేలా నిర్ణయం తీసుకుంది. ఇంతకు ఆ నిర్ణయం ఏంటంటే.. విద్యుత్ శాఖ ఉద్యోగులకు కోటి రూపాయల వరకు ప్రమాద బీమా చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఈమేరకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియతో రేవంత్ సర్కార్ ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దీనిపై ప్రకటన చేశారు. ఆవివరాలు..తమ ప్రభుత్వం విద్యుత్ శాఖ ఉద్యోగులకు కోటి రూపాయల ప్రమాద బీమా ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఇందుకోసం ఎస్బీఐతో ఒప్పందం కుదుర్చుకున్నామని వెల్లడించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఉద్యోగుల్లో ధైర్యం, నమ్మకాన్ని పెంచుతుందన్నారు భట్టి విక్రమార్క. అంతకాక రాష్ట్ర అభివృద్ధిలో విద్యుత్ శాఖ ప్రాధాన్యత అధికంగా ఉండాలని కోరుకుంటున్నాను అన్నారు. ఈ శాఖలో పని చేసే ప్రతి ఉద్యోగికి కీలక బాధ్యత ఉందన్నారు భట్టి.రాష్ట్రానికి కావాల్సిన కరెంట్‌ని ఉత్పత్తిని చేయడంలో లైన్‌మెన్ నుంచి విద్యుత్ శాఖ మంత్రి వరకు బాధ్యత వహిస్తారని.. అందుకే వీరంతా కలిసికట్టుగా పని చేయాలని భట్టి పిలుపునిచ్చారు.విధి నిర్వహణలో భాగంగా విద్యుత్ శాఖ ఉద్యోగులు ప్రాణాలకు తెగించి మరి పని చేస్తుంటారని తెలిపారు. కానీ వారి కుటుంబ సభ్యులు మాత్రం విద్యుత్ ఉద్యోగుల విషయంలో ఎంతో భయపడుతుంటారని అన్నారు. అందుకే తమ ప్రభుత్వం విద్యుత్ ఉద్యోగుల కుటుంబాలకు ధైర్యం, నమ్మకం కలిగించేందుకు సిబ్బందికి రూ.కోటి ప్రమాద బీమ కల్పించేందుకు ముందుకు వచ్చిందని తెలిపారు.భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం న్యూ ఎనర్జీ పాలసీ తీసుకొచ్చిందన్నారు. మరో నాలుగేళ్లలో అనగా..2029-30 వరకు.. రాష్ట్రంలో 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా విద్యుత్ శాఖ పనిచేస్తోందని భట్టి తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్‌కు తగినట్లుగా ఉత్పత్తి పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.ఇక గత నెలలో అనగా మే చివరి వారంలో తెలంగాణ ప్రభుత్వం విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన విద్యుత్ శాఖ ఉద్యోగి కుటుంబ సభ్యులకు ప్రమాద బీమా మొత్తం కోటి రూపాయలను అందించిన సంగతి తెలిసిందే. ఎన్‌పీడీసీఎల్ పరిధిలో విధి నిర్వహణలో చనిపోయిన జోగు నరేశ్ కుటుంబ సభ్యులకు కోటి రూపాయల ప్రమాద బీమా చెక్కును అందజేశారు.అలానే విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన మరో కార్మికుడు రమేశ్ భానకచరి కారుణ్య నియామక ఉత్తర్వులను కూడా అందించారు.

# పోలింగ్ బూత్ రూల్స్ మారాయి



**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణలో త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. జూన్, జులై రెండు నెలల్లోపే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో తాజాగా తెలంగాణ ఎన్నికల ముఖ్యాధికారి సుదర్శన్ రెడ్డి.. సోమవారం నాడు జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. దీనిలో భాగంగా పోలింగ్ రూల్స్ మారినట్లు నేను వచ్చాను.. అందుకే రేటు మారింది..

ఈ సందర్బంగా సీఈఓ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. త్వరలోనే రాష్ట్రంలో ఓటర్ల జాబితాను సరి చేసి.. ప్రత్యేక జాబితాను పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అంతేకాక ఓటర్ల సౌకర్యార్థం.. వారికి అందుబాటులో ఉండేలా పోలింగ్ కేంద్రాలను కేటాయించాలని తెలిపారు. అలానే ఎక్కువ మంది ఓటర్లు ఉన్న పోలింగ్ బూత్‌లని గుర్తించి.. వాటిని డివైడ్ చేసి.. కొత్త వాటిని ఏర్పాటు చేయాలని తెలిపారు.అలానే పెద్ద పెద్ద అపార్ట్‌మెంట్లు, కొత్తగా ఏర్పాటు చేసిన కాలనీలు, గుడిసెల్లో నివాసం ఉండే వారి కోసం.. వారికి సమీపంలో కొత్త పోలింగ్ కేంద్రాలు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సుదర్శన్ రెడ్డి సూచించారు. ఇందుకోసం ప్రత్యేకంగా సర్వేలు నిర్వహించి.. కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు అనుకూలమైన ప్రదేశాలను గుర్తించాలని ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలానే ఒక కుటుంబంలోని సభ్యులందరూ.. ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

తిరుమల శ్రీవారి సేవలో సినీ, రాజకీయ ప్రముఖులుత్వరలోనే నిర్వహించబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని.. ఎలక్షన్ విధుల కోసం సిబ్బంది కొరత లేకుండా ముందుగానే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సుదర్శన్ రెడ్డి అధికారులకు తెలిపారు. అలానే ఎన్నికల నిబంధనలు, చట్టాలు ఓటర్ల జాబితా వంటి అంశాలపై అందరికి పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. బీఎల్ఓలు ప్రతి ఇంటికి వెళ్లి.. ఓటర్ల జాబితాను అప్‌డేట్ చేయాలని తెలిపారు. అలానే ప్రజలు ఎవైరాన తమ ఓటర్ ఐడీల్లో మార్పు, చేర్పులు చేసుకోవాలని భావిస్తే.. అందుకు అవసరమైన ఫారాలు అందించి.. వారికి సాయం చేయాలని సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అలసత్వం పనికి రాదని అధికారులకు తెలిపారు.

# ఘోర ప్రమాదం

ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో కేంద్రమంత్రి సంప్రదింపులు జరుపుతున్నారు.

**విమానం కూలిన ఘటనపై హోంమంత్రి అమిత్‌షా తీవ్ర దిగ్భ్రాంతి**

విమానం కుప్పకూలిన ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితి తెలుసుకొన్నారు.అహ్మదాబాద్ విమానాశ్రయం కార్యకలాపాలు తాత్కాలికంగా నిలిపివేశారు. విమాన ప్రమాదం నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు ఎయిర్‌పోర్టు అధికారులు వెల్లడించారు.

**అమిత్ షాతో మాట్లాడిన ప్రధాని మోదీ**

అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంపై ఎయిర్ ఇండియా చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ విచారం వ్యక్తం చేశారు. ఈ సమయంలో బాధితులకు, వారి కుటుంబాలకు మద్దతు ఇవ్వడంపైనే ప్రధాన దృష్టి ఉందని అన్నారు. సమాచారం కోరుకునే కుటుంబాల కోసం అత్యవసర కేంద్రం ప్రారంభించామని తెలిపారు. అమిత్ షా తో మాట్లాడిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ విమాన విమాన ప్రమాదం తర్వాత బాధితులకు సాధ్యమైనంత సహాయం అందేలా చూడాలన్నారు.


**మోదీ ఆదేశాలతో ఘటనా స్థలికి అమిత్ షా**

తక్షణ సహాయం అందించాలని ప్రధాని మోదీ అమిత్ షా ను ఆదేశించారు. మరోవైపు ప్రధాని మోదీ ఆదేశాలతో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా సైతం ఘటనా స్థలంలో సహాయక చర్యలను ముమ్మరం చేయాలని స్థానిక అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. తానే స్వయంగా వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించనున్నారు. ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం అందించే ఏర్పాట్లు చేయాలని గుజరాత్ ప్రభుత్వానికి ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఇక ఘటనా స్థలంలో వీలైనన్ని అంబులెన్స్ లను కూడా అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు.

# ఇల్లెందు విద్యార్థులకు దిక్సూచి మార్గదర్శిని!

## ◆నేడు నూతన భవనం ప్రారంభోత్సవం









**పసుమర్తి లక్ష్మణరావు / జూన్ 12 నవభూమి ప్రతినిధి:** నల్ల బంగారానికి పుట్టినిల్లుగా పేరున్న ఇల్లెందు విద్యా రంగంలో వేల మంది విద్యార్థులను మేలిమి బంగారంలా తయారు చేసిన పేరున్న విద్యా సంస్థ మార్గదర్శిని హైస్కూల్ విద్యాసంస్థ. ఉన్నత విద్యా వంతులైన దమ్మాలపాటి వెంకటేశ్వరరావు (డీవీ), యాదగిరి రాంబాబు (వైఆర్) ల ఆధ్వర్యంలో 1996 లో ఇల్లెందు ఇందిరా నగర్ లో పురుడు పోసుకున్న మార్గదర్శిని హైస్కూల్, వీరికి మరో విద్యా ఆణిముత్యం అర్వపల్లి రాధాకృష్ణ (ఆర్కే) తోడై, 14 నెంబర్ బస్తీలో 2000 సంవత్సరంలో మరో బ్రాంచ్ ను ప్రారంభించారు. ఈ విద్యావేత్తలైన యజమానులే బోధకులుగా చిన్నారుల వెన్నంటి ఉండి ఎందరో ఆణిముత్యాలను తయారు చేశారు. గత మూడు దశాబ్దాలుగా వేల మంది విద్యార్థులను ఉన్నత విద్యా వంతులుగా తీర్చిదిద్ది ఉన్నత ఉద్యోగస్తులను తయారు చేశారు. ఇల్లెందులోని వారి మూడు బ్రాంచ్ లలో ప్రతి సంవత్సరం సుమారు రెండు వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. నేడు కార్పొరేట్ విద్యా సంస్థల హవా కొనసాగుతూ, అందరూ వాటి వైపుగా చూస్తున్న ఈ రోజుల్లో ఇల్లెందు మార్గదర్శిని విద్యా సంస్థలో రెండు వేల మంది విద్యార్థులు తమ చదువులు కొనసాగిస్తున్నారంటే మామూలు విషయం కాదు. మార్గదర్శిని పాఠశాలలో చదివిన ఎందరో విద్యార్థులు ఈరోజు అనేక రంగాలలో రాణిస్తూ ముందుకు వెళుతున్నారు. వారిలో శాస్త్రవేత్తలు, డాక్టరేట్లు సాధించినవారు, ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు, ఉపాధ్యాయులు, ఇంజనీర్లు, సైనికోద్యోగులు, పోలీసులు ఇలా చెప్పుకుంటూ పోతే అనేక రంగాలలో అనేక రకాలుగా దేశ విదేశాల్లో మార్గదర్శిని విద్యార్థులు రాణిస్తున్నారని అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో టెన్త్ క్లాస్ మార్కులలో ఒక సారి స్టేట్ ర్యాంకు కూడా వచ్చిందంటే వీరి కృషి, పట్టుదలను అర్థం చేసుకోవచ్చు. యజమానులే స్వతహాగా పాఠశాలను అంటిపెట్టుకుని ఉంటారు కాబట్టి వారికి బీద విద్యార్థులు కూడా వారి కంట పడుతుంటారు. అలాంటి విద్యార్థులలో వారి వారి స్తోమతను బట్టి కొందరికి ఉచిత విద్యను, మరికొందరికి రాయితీ విద్యను అందిస్తూ వారి సేవా దృక్పథాన్ని చాటుకుంటున్నారు. ఇల్లెందు పట్టణంతో పాటు చుట్టుపక్కల ఏరియాలో మంచి విద్యా వేత్తలుగా, సేవా గుణం కలిగిన వారిగా డీవీ, వైఆర్, ఆర్కే లకు మంచి పేరు ప్రఖ్యాతలు ఉన్నాయి. విద్యా బోధనలో మంచి పేరున్న మార్గదర్శిని హైస్కూల్ ను సకల సౌకర్యాలతో సర్వాంగ సుందరంగా నూతన భవనాన్ని నిర్మించారు. ఆ భవనాన్ని నేడు జూన్ 13న ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రారంభించనున్నారు. గత 29 సంవత్సరాలుగా అత్యున్నత ప్రమాణాలతో విద్యాబోధన గావిస్తూ మట్టిలో మాణిక్యాలను తయారు చేస్తున్న మార్గదర్శిని విద్యాసంస్థ నవీన హంగులతో సరికొత్తగా ఇల్లెందు ఏరియా ప్రజల ముందుకు రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# నటి కల్పిక గణేశ్‌పై కేసు

(1వపేజీ తరువాయి) సమయంలో నటి కల్పిక తమ సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించినట్లు పబ్ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్లేట్స్ విసిరేయడం, సిబ్బందిని బాడీ షేమింగ్ చేయడం, బూతులు తిట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసుల సమక్షంలోనే హంగామా సృష్టించినట్లు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కల్పికపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.మరోవైపు పబ్‌లో గొడవకు సంబంధించి కల్పిక ఇటీవలో ఓ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసిన విషయం తెలిసిందే. ఓ కేక్ విషయంలో తనతో సిబ్బంది దురుసుగా ప్రవర్తించడమే కాకుండా డ్రగ్ ఎడిక్ట్ అంటూ దూషించారని అందులో పేర్కొంది. ఈ క్రమంలో సిబ్బందితో వాగ్వాదం జరిగిందని, అది ముదరడంతో పబ్ నిర్వాహకులు దురుసుగా ప్రవర్తించారని తెలిపింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించింది.

# పిడుగులు పడి 8మంది మృతి

(1వపేజీ తరువాయి) కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ ఘటనలు రాష్ట్రంలో విషాదఛాయలు నింపాయి. రాష్ట్రంలో వర్షాలు దంచి కొడుతున్నాయి. ఇక బుధవారం రాత్రి, గురువారం తెల్లవారుజామున తెలంగాణలోని హైదరాబాద్ సహా పలు ప్రాంతాల్లో కుండపోత వర్షం కురిసింది. అంతేకాక మరో నాలుగు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా జోరు వానలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఇదిలా ఉండగా తాజాగా ఆదిలాబాద్ జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. పిడుగులు పడి గురువారం నాడు ఆరుగురు మృతి చెందారు. వీరంతా వ్యవసాయ పనులు చేసుకునే వారు కావడం గమనార్హం. గురువారం నాడు ఆదిలాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో పిడుగులు పడి ఆరుగురు మృతి చెందారు. జిల్లాలోని బేల, నార్నూర్ మండలాల్లో పిడుగుల పడి పలువురు వ్యవసాయ కూలీలు చనిపోయారు. బేల మండలంలో వ్యవసాయ పనులకు వెళ్లిన మహిళలు ఇద్దరు పిడుగులు పడి చనిపోయారు.

# ఒక్కడు..మృత్యుంజయుడు..!

(1వపేజీ తరువాయి) సమయంలో ఎమర్జెన్సీ ఎగ్జిట్ నుంచి దూకిన రమేశ్ ప్రాణాలతో బయటపడ్డాడు. నడుచుకుంటూ అతను అంబులెన్స్ వద్దకు వెళ్లాడు. బోయింగ్ డ్రీమ్‌లైనర్ దుర్ఘటనలో మృత్యుంజయుడిగా నిలిచాడు. ఒకే ఒక్కడు మృత్యుంజయుడు.. అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో బతికిన 38 ఏళ్ల రమేశ్ విశ్వకుమార్

అహ్మదాబాద్: గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంలో ఒకరు బతికినట్లు తెలుస్తోంది. 38 ఏళ్ల రమేశ్ విశ్వకుమార్ అనే వ్యక్తి ప్రాణాలతో ఉన్నారు. బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్‌లో.. 11నెంబరు సీటులో అతను కూర్చున్నట్లు సమాచారం. ప్రస్తుతం అతను ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విమాన ప్రమాదంలో 242 మంది మరణించినట్లు ధ్రువీకరించినా.. రమేశ్ కుమార్ మాత్రం ఆ విమానం నుంచి గాయాలతో బయటకు వచ్చినట్లు తెలుస్తోంది. ఆ మృత్యుంజయుడి వివరాలు మరిన్ని అందాల్సి ఉన్నది. విమానంలో ఉన్న ఎమర్జెన్సీ ఎగ్జిట్ నుంచి అతను దూకినట్లు భావిస్తున్నారు. ఆ మిరాకల్ ఘటనకు చెందిన ఓ వీడియో కూడా వైరల్ అవుతున్నది. అంబులెన్స్ వద్దకు రమేశ్ కుమార్ నడిచి వస్తున్న దృశ్యాలను రిలీజ్ చేశారు.

# తెలంగాణలో 5 రోజులు వర్షాలు

(1వపేజీ తరువాయి) ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని చెప్పింది. శుక్రవారం భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో భారీ వర్షాలు కురుస్తాయని చెప్పింది. శనివారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ చెప్పింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. అలాగే, సోమ, మంగళవారాల్లోనూ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కొనసాగుతాయని చెప్పింది. ఉత్తర తెలంగాణ జిల్లాలతో పాటు పలు జిల్లాల్లో వర్షాలు పడుతాయని వివరించింది.

# మృతుల కుటుంబాలకు భారీ ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన టాటా గ్రూప్




**అహ్మదాబాద్-నవభూమి:** అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటనపై టాటా గ్రూప్ స్పందించింది. ఈ విమాన ప్రమాద మృతుల కుటుంబాలకు టాటా గ్రూప్ ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ఆయా కుటుంబాలకు రూ. కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని వెల్లడించింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల వైద్య ఖర్చులన్నీ భరిస్తామని టాటా గ్రూప్ సంస్థ ఈ సందర్భంగా స్పష్టం చేసింది. బీజే మెడికల్ కాలేజ్ హాస్టల్ భవనాన్ని పునర్నిర్మిస్తామని వెల్లడించింది. ఈ మేరకు గురువారం టాటా గ్రూప్ ఎక్స్ వేదికగా స్పందించింది.

మరోవైపు ఈ ప్రమాద ఘటన నుంచి ఒకరు ప్రాణాలతో బయటపడ్డారని అహ్మదాబాద్ నగర పోలీస్ కమిషనర్ వెల్లడించారు. 11ఏ సీటు ప్రయాణికుడు రమేశ్ బతికారన్నారు. ఈ ప్రమాదం నుంచి బయటపడిన రమేశ్ బిశ్వాస్‌కు ఆసుపత్రిలో చికిత్స జరుగుతోందని వివరించారు. ఈ ప్రమాద మృతుల సంఖ్యపై ఇప్పడే తామేమీ చెప్పలేమన్నారు. నివాస ప్రాంతంలో విమానం కూలినందున మృతుల సంఖ్య ఎక్కువే ఉండ వచ్చని అహ్మదాబాద్ నగర పోలీస్ కమిషనర్ అభిప్రాయపడ్డారు.

జూన్ 12వ తేదీ మధ్యాహ్నం 1.39 గంటలకు అహ్మదాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి లండన్‌కు ఎయిర్ ఇండియా విమానం టేకాఫ్ అయింది. ఆ కొన్ని నిమిషాలకే ఆ విమానం కుప్పకూలింది. ఈ ఘటనలో 241 మంది మరణించారు. వీరిలో 229 మంది ప్రయాణికులు, 12 మంది విమాన సిబ్బంది ఉన్నారు. న్యూఢిల్లీ నుంచి వయా అహ్మదాబాద్ మీదగా లండన్‌కు ఈ విమానం వెళ్తోంది. మరోవైపు ఈ ఘటనపై సమగ్ర విచారణ జరుపుతామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. ఈ ఘటన జరిగిన వెంటనే కేంద్ర మంత్రులు అమిత్ షా, రామ్మోహన్ నాయుడులు వేర్వేరుగా అహ్మదాబాద్‌కు చేరుకుని ఉన్నతాధికారులతో పరిస్థితిని సమీక్షించారు.



## మరో దారుణం.. పెళ్లైన 15 రోజులకే భర్తను ఏం చేసిందంటే..



ఇంటర్నెట్ డెస్క్: పెళ్లి అంటేనే నేటి సమాజం భయపడుతోన్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. భార్య భర్తను చంపడం, భర్త భార్యను హత్య చేయడం వంటి ఘటనలు ఈ మధ్య కాలంలో తరచుగా జరుగుతున్నాయి. మేఘాలయ రాజా రఘువంశీ హత్య కేసు మరిచిపోకముందే తాజాగా మహారాష్ట్రలోని సాంగ్లీ జిల్లాలో మరో షాకింగ్ సంఘటన చోటుచేసుకుంది. పెళ్లైన 15 రోజులకే భర్తను భార్య అతి దారుణంగా హత్య చేసింది. కేసు వివరాల్లోకి వెళ్తే..రాధిక(27) అనే యువతి భర్త అనిల్ లోఖండే(53)ను హత్య చేసినట్లు తెలుస్తోంది. ఈ సంఘటన వారు పెళ్లి చేసుకున్న కేవలం 15 రోజులకే జరిగింది. మంగళవారం రాత్రి భార్యభర్తల మధ్య చిన్న గొడవ జరిగినట్లు తెలుస్తోంది. అయితే, బుధవారం తెల్లవారుజామున 12:30 గంటల సమయంలో భర్త అనిల్ నిద్రిస్తుండగా రాధిక గొడ్డలితో అతని తలపై దాడి చేసిందని, దీంతో అనిల్ అక్కడికక్కడే మరణించాడని స్థానికులు అంటున్నారు.పోలీసుల సమాచారం ప్రకారం, అనిల్ లోఖండే మొదటి భార్య క్యాన్సర్‌తో మరణించింది. దీంతో అతడు రాధికను రెండో పెళ్లి చేసుకున్నాడు. వివాహం అయిన దగ్గర నుండి అనిల్ తన భార్యను శారీరకంగా ఇబ్బంది పెట్టేవాడని, దీన్ని తట్టుకోలేక కోపంతో రాధిక హత్య చేసిందని అనుమానిస్తున్నారు. రాధికను అరెస్ట్ చేసిన పోలీసులు ఆమెను కోర్టులో హాజరు పరచగా, కోర్టు రెండు రోజుల పోలీస్ కస్టడీ విధించింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in



## గొర్లకాపరుల జీవితాల చుట్టూ అల్లిన కొండపొలం

తెలుగు భాషా సాహిత్యంలో నల్లమల అరణ్యంలో గొర్లకాపరుల జీవితాల ఆధారంగా రచించిన సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి గారి "కొండపొలం" నవల ఇప్పుడు అంతర్జాతీయంగా అంగ్లంలో "%ఱఅస్త్రవతీ నావంంశీఅం%"గా పాఠకులను ఆకట్టుకుంటోంది. అనువాదకుడు నరసింహ కుమార్ అద్భుతంగా ఈ సాహిత్యాన్ని ప్రపంచానికి పరిచయం చేశారు. ఇది తెలుగు భాషకూ, స్థానిక జీవనశైలికీ, ప్రకృతి తాత్వికతకూ ఒక గొప్ప గౌరవ సూచకంగా నిలుస్తోంది.మేత దొరకని కాలంలో గొర్రెలను నెలా నెలన్నర పాటు నల్లమల అడవుల్లో మేపటానికి పోయే గొర్ల కాపర్ల జీవితం చుట్టూ అల్లిన నవల 'కొండ పొలం'. సన్నపురెడ్డి వెంకటరామి రెడ్డి రాసిన ఈ నవల 2019 'తానా' నవలల పోటీలో రెండు లక్షల రూపాయల బహుమతిని గెలుచుకుంది. 2021లో క్రిష్ దర్శకత్వంలో సినిమాగా కూడా వచ్చింది. ఇప్పుడు ప్రముఖ అంతర్జాతీయ ప్రచురణ సంస్థ ఈ నవలకు ఇంగ్లీష్ అనువాదాన్ని జూన్ 3న విడుదల చేసింది.'కొండ పొలం' నవలకి మొట్ట మొదటి సమీక్ష, తెలుగులో కంటే ముందే, నేను ఇంగ్లీష్‌లో ఫేస్‌బుక్‌లో రాశాను. అందులో ఇంత గొప్ప నవల, అందులో వర్ణించబడిన జీవన విధానం, ప్రకృతి పట్ల వెలిబుచ్చిన భారతీయ జీవన దృక్పథం ఇంకా ఎక్కువమందికి చేరాలంటే, ఆంగ్లంలోకి అనువదిస్తే బాగుంటుంది అని రాశాను. నా సమీక్షకు కృతజ్ఞతలు తెలుపుతూ వెంకటరామి రెడ్డి గారు 'ఆ పని మీరే ఎందుకు చేయకూడదు,' అన్నారు. అలా ఈ అనువాదానికి బీజం పడింది.మనిషిప్రకృతుల మధ్య సంఘర్షణ గురించి ఇతర భాషల్లో చాలా నవలలు వచ్చాయి. హెర్మన్ మెల్విల్ 'మోబిడిక్', హెమ్మింగ్వే 'ది ఓల్డ్ మాన్ అండ్ ద సీ' లాంటి రచనల్లో మనిషి ప్రకృతితో యుద్ధం చేస్తాడు. ఈ రెండు నవలలు పాశ్చాత్య దృక్కోణానికి (మూల రూపాల) వంటివి. ఈ భూ ప్రపంచంలో మనిషే ఉత్తమ జీవి, మనిషి తన ఆధిపత్యం కోసం మిగిలిన జీవరాశులను ఎక్స్‌ప్లాయిట్ చేయడంలో ఏ తప్పూ లేదు అన్న దృక్పథం యిది. 'కొండ పొలం' నవల ఇందుకు విరుద్ధంగా ప్రకృతి పట్ల భారతీయ తత్వచింతనను పరిచయం చేస్తుంది.గొల్ల, యానాదుల దృక్కోణంలో చెప్పటంతో కథనానికి, వర్ణనలకు ఒక ప్రామాణికత అబ్బింది. నీటి వెతలు, చందనం దొంగల సమస్య, గ్రామాల్లో కుల రాజకీయాలు, ప్రజలు నమ్మే అవధూతలు, దేవతలు, దేవుళ్ళు, వన్యమృ గాలు, రకరకాల చెట్లు, ఔషధ మొక్కలు... ఒక్క మాటలో చెప్పాలంటే, మనకు ఎంతో దగ్గరగా ఉన్నా అస్సలు పరిచయంలేని ఒక జీవన శైలిని మనకు చేరువగా తీసుకువస్తుంది. ఒక కొత్త, మార్మిక లోకం లోకి తీసుకెళ్తుంది. కథా నాయకుని అద్భుతమైన క్యారెక్టర్ ఆర్క్ కనబడుతుంది. ఒళ్ళు గగుర్పొడిచే సన్నివేశాలూ ఉన్నాయి. ఇలాంటి వివిధ పార్శ్వాల సార్వత్రిక విలువలు ఉన్న కథ తెలుగులో రావడం మన అదృష్టమైతే, దాన్ని వేరే భాషల్లోకి తీసుకువెళ్లడం మన బాధ్యత అని నేను భావిస్తాను.ఈ నవల అనువదించటంలో ఎదురైన ముఖ్యమైన సవాలు నల్లమల పరిసర ప్రాంతాల్లో వాడే జాతీయాలు, పలుకుబడులు, సామెతలు, (సాంస్కృతిక విశిష్టత) ఉన్న పేర్లు (ఉదా: ఓబులం, కాశి నాయన) లాంటి వాటిని నాన్‌తెలుగు పాఠకులకు అర్థమయ్యేలా, కానీ ఆంగ్లంలో కృతకంగా ఉండకుండా, అలాగే కథ, వర్ణన, పాత్రల ఆత్మకి భంగం కలగకుండా చూసుకోవడం. బ్రౌణ్య నిఘంటువు, సూర్యరాయాంధ్ర నిఘం టువు ఉపయోగపడ్డాయి. నేను కడప జిల్లావాడిని కావడం, నంద్యాల, మహానంది, అహోబిలం, శ్రీశైలం ప్రాంతాలతో అనుబంధం ఉండడం కూడా పనికి వచ్చింది. అవసరమైనప్పుడల్లా, రచయితతో ఫోన్‌లో మాట్లాడగలగడం ఒక పెద్ద ఆసరా. ఆయనతో మాట్లాడినప్పుడల్లా ఒక జీవ శాస్త్ర నిపుణునితో, ఒక తత్వవేత్తతో చర్చించినట్టు ఉండేది. కొన్ని విషయాల్లో ఆంగ్లంలోకి అనువాదమైన ఇతర పుస్త కాలు గమనించి, ఆ పద్ధతులు (బెస్ట్ ప్రాక్టీసెస్) పాటించడానికి ప్రయత్నించాను. ఉదాహరణకి నల్లమల అడవుల్లో ప్రతి కొండకి, కోనకి, వాగుకి, వంకకి, పచ్చిక బయళ్ళకు, రాళ్ళగుట్టలకు, స్థానికంగా పేర్లు ఉంటాయి. ఆ పేర్లను కొన్ని చోట్ల అలాగే ఉంచడం, కొన్ని చోట్ల ఇంగ్లీషు లోకి అనువదించడం ద్వారా ఆ స్థానిక నామంలో ఉండే కవితాత్మకత పాఠకులకి తెలియబర్చడం చేశాను.నేను అనువాదం మొదలు పెట్టినప్పుడే, ఒక ప్రఖ్యాత పబ్లిషర్ అయితేనే ఈ నవల ఎక్కువమంది నాన్%-%తెలుగు పాఠకులకు చేరుతుంది కాబట్టి, ఆలస్యమైనా సరే ఆ దిశగానే ప్రయత్నం చేయాలని అనుకున్నాను. పబ్లిషింగ్ రంగంలోని ఒక మిత్రుని సలహా మేరకు ప్రపోజల్ తయారు చేసుకుని, ముందుగా ఒక బ్లూమ్స్‌బరీ ఎడిటర్‌ని ఫోన్ ద్వారా సంప్రదించి, తర్వాత నా ప్రపోజల్ పంపాను. కలిసి వచ్చిన విషయం ఏమంటే, బ్లూమ్స్‌బరీ వాళ్ళు భారతీయ భాషల్లో నుంచి మంచి పుస్తకాలు ఎన్నుకుని అనువాదం చేయించాలి అన్న ఆలోచనలో ఉన్నప్పుడే, కాకతాళీయంగా నేను వారిని సంప్రదించాను. బ్లూమ్స్‌బరీ ఇండియా టీంలో చదివిన అందరికీ ఈ నవల నచ్చింది. కానీ, కాంట్రాక్టు బ్లూమ్స్‌బరీ యుకె సంస్థ చేతుల్లో ఉంటుంది, కాబట్టి అఫిషియల్‌గా నాకూ రెడ్డిగారికి ఆఫర్ ఇవ్వటానికి కొన్ని నెలలు పట్టింది. బ్లూమ్స్‌బరీ సంస్థ తెలుగు నుంచి ప్రచురిస్తున్న మొదటి నవల ఇదే. దీని వలన, ఇదే మార్గంలో మరిన్ని తెలుగు పుస్తకాలు కొత్త పాఠకులని ఏర్పర్చుకుంటాయని నా ఆశ.ఫిక్షన్, ముఖ్యంగా నవలలకు ఎడిటింగ్ ప్రాసెస్ చాలా విస్తృతంగా వుంటుంది. బ్లూమ్స్‌బరీ సంస్థలో చీఫ్ ఫిక్షన్ ఎడిటర్ శివప్రియ మొదట మాన్యుస్క్రిప్ట్ మొత్తం చదివి, నోట్స్ పంపారు. ఈ మొదటి దశలో ముఖ్యంగా నవల స్ట్రక్చర్ గురించి చర్చించాం. నేను ఎక్కువ ఫుట్‌నోట్స్ వాడాను. వాటిని తీసేసి కథనంలో భాగంగా ఎలా కూర్చాలో ఎడిటర్ మంచి సలహాలు ఇచ్చారు. తరువాత దశలో, మొదట ఒక ఎడిటర్ మొత్తం నవలని ఎడిట్ చేస్తూ, ఒక్కోసారి రెండు మూడు అధ్యాయాల చొప్పున పంపించడం, నేను ఆ ఎడిట్స్‌ని ఒప్పుకోవడం, లేదా ఒప్పుకోకపోవడం, వాళ్ళు అడిగే ప్రశ్నలకి నా సమాధానాలు, సందేహాలకు క్లారిఫికేషన్స్ – ఇలా కొన్ని నెలలపాటు నడిచింది. ఈ ప్రక్రియ తరువాత ఇంకో ఎడిటర్ లైన్ బై లైన్ ఎడిట్స్ చేయగా, వారితో కలిసి నేను ఫైనలైజ్ చేశాను. శివప్రియ మళ్ళీ చివరిలో ఒకసారి, తానూ, తన టీం మెంబర్‌తో కలిసి ఇంకొక రివ్యూ చేసి, ఇంకొన్ని ప్రశ్నలు అడిగారు. ఒక్కోసారి ఒక్క సామెత వారికి అర్థం అయ్యేలా చెప్పడానికి రెండు ఫోన్ కాల్స్ అవసరం అయ్యేవి. వాళ్ళు అడిగిన ప్రశ్నలు నన్ను మరింత ఆలోచింపజేసి, నవలకి మంచి బిగువు వచ్చింది. ఈ క్రమంలో ముద్రణ ఆలస్యమైనా, పనిలో వారికి ఉన్న నిబద్ధత, ఓపిక, రచయిత పట్ల అనువాదకుల పట్ల వారు చూపించిన గౌరవం ఇవన్నీ నాకు చాలా ఆనందాన్ని ఇచ్చాయి. ఎడిటింగ్ ప్రాసెస్‌లో భాగంగా పబ్లిషర్ ఒక ముగ్గురు ప్రముఖ రచయితలకి ఇచ్చి అభిప్రాయం అడిగారు. వారిలో ఒకరు 'గోట్ డేస్' నవలా రచయిత బెన్యామిన్ (ఈ నవల తెలుగులో 'మేక జీవితం'గా అనువాదమైంది). ముగ్గురు రచయితలూ పుస్తకానికి గొప్ప ప్రశంసలు ఇచ్చారు.

# అయోడైజ్డ్ ఉప్పు ఆరోగ్యానికి హానికరమా?



ఉప్పు మన ఆహారంలో రుచి, సంరక్షణ, ఆరోగ్య పరిరక్షణ కోసం వేల సంవత్సరాలుగా ప్రాధాన్యం కలిగిన పదార్థం. కానీ అయోడైజ్డ్ ఉప్పు వచ్చిన తరువాత, సముద్రపు ఉప్పు, సైంధవ లవణం వాడకం తగ్గింది. అయితే, అయోడైజ్డ్ ఉప్పు హానికరమని, సముద్రపు ఉప్పు లేదా సైంధవ లవణం మంచిదని కొందరు అనుకుంటున్నారు. ఈ వాదనల్లో ఎంత నిజం ఉందో చూద్దాం.

**చరిత్రలో ఉప్పు ప్రాముఖ్యత:**

మానవ చరిత్రలో ఉప్పు అత్యంత కీలక పాత్ర పోషించింది. సముద్రపు ఉప్పు సముద్ర జలాన్ని ఆవిరి చేయడం ద్వారా, రాతి ఉప్పు గనుల నుండి తవ్వి సేకరించబడేది. భారతదేశంలోని తీరప్రాంతాల్లో ఇది ఒక సంప్రదాయ వృత్తిగా కొనసాగింది. ఈ ఉప్పు మెగ్నీషియం, కాల్షియం, పొటాషియం వంటి సహజ ఖనిజాలను కలిగి ఉండటంతో ఆరోగ్యానికి ప్రయోజనకరంగా భావించబడింది.

**అయోడైజ్డ్ ఉప్పు ఎలా వచ్చింది?:**

ఇరవయ్యవ శతాబ్దంలో అయోడిన్ లోపం వల్ల గాయిటర్, థైరాయిడ్ సంబంధిత సమస్యలు, ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాలు, హిమాలయ ప్రాంతాల్లో ఎక్కువగా కనిపించాయి. దాంతో, 1980లలో భారత ప్రభుత్వం, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సహకారంతో అయోడైజ్డ్ ఉప్పు కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇది గాయిటర్ కేసుల్ని గణనీయంగా తగ్గించింది. అయితే కొన్ని అభ్యంతరాలు కూడా వచ్చాయి.

**అయోడైజ్డ్ ఉప్పు అంటే ఏమిటి?:**

ఇది సాధారణ ఉప్పులో అయోడిన్ (పొటాషియం అయోడైడ్ లేదా అయోడేట్) జోడించిన



ఉప్పు. ఇది థైరాయిడ్ గ్రంథి పనితీరుకు అవసరమైన అయోడిన్‌ను అందిస్తూ గాయిటర్, హైపోథైరాయిడిజం, మానసిక వికాస లోపాలు, గర్భిణీ స్త్రీలలో వచ్చే సమస్యలు మొదలైన వాటిని నివారించడంలో ఉపయోగపడుతుంది. అలాగే దీనిలో ఉండే యాంటీకేకింగ్ ఏజెంట్లు (ఈ–535, ఈ–536, ఈ–538) ఉప్పు తడిపోవడం, గడ్డకట్టడం వంటి సమస్యలను నివారిస్తాయి. ఇవన్నీ ఎఫ్‌డీఏ, ఎఫ్ఎస్–ఎస్ఏఐ లాంటి సంస్థలచే నిర్ధారించబడిన పద్ధతులు.

**అయోడైజ్డ్ ఉప్పుపై అభ్యంతరాలు:**

కొందరు అయోడైజ్డ్ ఉప్పు బీపీ, థైరాయిడ్ సమస్యలు, ఊబకాయం, గుండె జబ్బులకు కారణమని వాదిస్తారు. అయితే, ఈ వాదనలకు గట్టి శాస్త్రీయ ఆధారాలు లేవు. బీపీకి ప్రధాన కారణం ఆహారంలో సోడియం అధికంగా తీసుకోవడం, ఇది అన్ని రకాల ఉప్పులకు (సైంధవ లవణం, సముద్రపు ఉప్పు, అయోడైజ్డ్ ఉప్పు) వర్తిస్తుంది. అయోడైజ్డ్ ఉప్పులోని అయోడిన్ సాధారణంగా సురక్షిత స్థాయిల్లో ఉంటుంది (15–30 డబ్లు హెచ్ ఓ సిఫార్సు ప్రకారం), అయోడిన్ అధికం వల్ల హైపర్‌థైరాయిడిజం వంటి సమస్యలు చాలా అరుదుగా సంభవిస్తాయి.

**సముద్రపు ఉప్పు విశేషాలు:**

సముద్రపు ఉప్పు సహజంగా మైనరల్స్‌తో కూడి ఉంటుంది. కానీ దీనిలో అయోడిన్ స్థాయి స్థిరంగా ఉండదు. కనుక ఇది అయోడిన్ లోపం ఉన్నవారికి సరైన పరిష్కారం కాదు. ఇది సాధారణంగా పొడి ఆకారంలో ఉండదు, పొడి చేసి వాడాల్సి వస్తుంది.

**సైంధవ లవణం (హిమాలయ ఉప్పు):**

ఈ ఉప్పు గనుల నుండి తవ్వి తీస్తారు. సహజ ఖనిజాలతో కలిగి ఉంటుంది. కానీ ఇది అయోడిన్‌ను కలిగి ఉండదు. అయోడిన్ లోపం ఉన్నవారికి ఇది ప్రత్యామ్నాయం కాదు. ధర ఎక్కువగా ఉండడం, ఆరోగ్య ప్రయోజనాలు పూర్తిగా శాస్త్రీయంగా నిరూపించబడకపోవడం వల్ల, దీన్ని తప్పనిసరిగా వాడాల్సిన అవసరం లేదు.

**కార్పొరేట్ లాబీయింగ్ ఆరోపణలు:**

కొంతమంది అయోడైజ్డ్ ఉప్పు అనేది కార్పొరేట్ కుట్ర అని, సముద్రపు ఉప్పును నిరోధించేందుకు పెద్ద సంస్థలు ప్రయత్నించాయని అంటున్నారు. అయితే దీనికి గట్టి ఆధారాలు లేవు. ఈ కార్యక్రమాన్ని డబ్ల్యూహెచ్ఓ, భారత ప్రభుత్వం కలిసి ఆరోగ్య ప్రయోజనాల కోసమే ప్రవేశపెట్టాయి. సముద్రపు ఉప్పును నిషేధించలేదు కానీ అయోడైజ్డ్ ఉప్పును ప్రోత్సహించారు.

**సోడియం పరిమితి అవసరం:**

ఏ రకమైన ఉప్పైనా, సోడియం అధికంగా తీసుకోవడం బీపీ, గుండె జబ్బులు, మూత్రపిండ సమస్యలకు దారితీస్తుంది. డబ్లు హెచ్ ఓ ప్రకారం, ఒక వ్యక్తి రోజుకు 5 గ్రాముల కంటే తక్కువ ఉప్పు (సుమారు 1 టీస్పూన్) తీసుకోవాలి. భారతీయ ఆహారంలో సగటున ఈ మోతాదు అధికంగా ఉంటుంది, కాబట్టి ఉప్పు వాడకాన్ని తగ్గించడం అన్ని రకాల ఉప్పులకు వర్తిస్తుంది.

**అపోహలు – నిజాలు:**

అయోడైజ్డ్ ఉప్పు హానికరం అనే భావన ఒక అపోహ మాత్రమే. ఇది సురక్షితమైనదిగా శాస్త్రీయంగా నిరూపితమైందే గాక, ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది. అలాగే, ఉప్పు నీటిలో కలిపి తాగితే రక్తపోటు తగ్గుతుందని చాలామంది అనుకుంటారు కానీ ఇది కూడా తప్పుదారి పట్టించే అపోహ. వాస్తవానికి సోడియం అధికంగా తీసుకుంటే బీపీ పెరుగుతుంది. ఉప్పు అనేది ఆహారంలో రుచికోసం మాత్రమే ఉపయోగపడాలి కానీ ఆరోగ్య పరిరక్షణ కోసం మాత్రం సమతుల్యమైన ఆహారం, సరైన జీవనశైలి అనుసరించాలి.

**నిబంధనలు చట్టబద్ధత:**

ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనల ప్రకారం అయోడైజ్డ్ ఉప్పును ప్రోత్సహిస్తున్నారు. కానీ సముద్రపు ఉప్పు, సైంధవ లవణాన్ని నిషేధించలేదు. కర్ణాటక హైకోర్టులో ఈ విషయంలో పిల్ కూడా దాఖలై ఉంది. మార్కెట్‌లో సముద్రపు ఉప్పు దొరుకుతోంది కానీ ధర ఎక్కువగా ఉండవచ్చు.

అయోడైజ్డ్ ఉప్పు ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన అయోడిన్‌ను అందిస్తుంది. ఇది గాయిటర్, థైరాయిడ్, మానసిక వికాస సమస్యలను నివారించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. సముద్రపు ఉప్పు, సైంధవ లవణం సహజ ఖనిజాలు కలిగి ఉన్నా, అవి అయోడిన్ అందించవు. కనుక ఎలాంటి ఉప్పు వాడాలో నిర్ణయించుకోవడానికి వైద్య సలహా తీసుకోవడం ఉత్తమం. రోజువారీ ఉప్పు వాడకాన్ని ఐదు గ్రాములలోపే పరిమితం చేయాలి. ఆరోగ్య పరిరక్షణ కోసం రుచికన్నా సమతుల్య జీవనశైలి ముఖ్యం.ఈ సమాచారం శాస్త్రీయ ఆధారాలపై ఆధారపడినది. ఆరోగ్య సమస్యలు ఉన్నవారు తప్పనిసరిగా వైద్య సలహా తీసుకోవాలి.


అమీనా కౌసర్
స్కూల్ అసిస్టెంట్
జెడ్ పి హెచ్ ఎస్ ఇనుగుర్తి
మహబూబాబాద్

# ప్రపంచ దేశాల చరిత్రలను ప్రభావితం చేసిన మహానుభావులు నేటికీ ముగ్గురే ముగ్గురు




ప్రపంచంలోనే అతిపెద్ద గ్రంధాలయంగా పేరొందిన లండన్ లో అత్యధిక పుస్తకాలను చదివిన రీడర్స్ గా ఈ ముగ్గురు గుర్తింపు పొందారు. 1.కారల్ మార్క్స్ జర్మని, 2. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఇండియా, 3. జోసఫ్ మజ్జిని జెనివా ఈ ముగ్గురు అగ్రజులు. అంబేద్కర్ 60 వేల పుస్తకాలకు పైగానే చదివారు.లక్ష పేజీలు రాసారు. కారల్ మార్క్స్ గురించి తెలియని వారెవరు ఉండరు . ఆయన తీసుకొచ్చిన సంస్కరణలే నేటికీ కొనసాగుతున్నాయి . అదే స్థాయిలో జెనీవాలో పుట్టిన మజ్జిని కూడా ఏడు వేరు వేరు ప్రాంతాలుగా ఉన్న సమూహాలను యునైటెడ్ ఇటలీ ఒకే దేశంగా గా మార్చడానికి ఎన్నో రహస్య ఉద్యమాలు చేశారు. ఆయన కృషి వల్లనే ఇట లీ సంయుక్త దేశంగా ఏర్పడింది . ఈ ముగ్గురు ప్రపంచ దేశాల్లో కల్లా అత్యధిక పుస్తకాలు చదివిన వారిలో గొప్పవారుగా చరిత్రకి ఎక్కారు . ఈ ముగ్గురు సంస్కరణలు ప్రపంచ దేశాలను నేటికీ ప్రభావితం చేసి వారు చూపిన మార్గంలోనే నడుస్తున్నాయి . భారతీయుడైన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్

బౌద్ధమతానికి సంబంధించి 2 వేల పుస్తకాలను చదివారు. ఆసియా ఖండంలోనే 2 దేశాలలో ఆర్థికశాస్త్రంలో 2 డాక్టరేట్ లు తీసుకున్న ప్రప్రథముడు. అలాగే ప్రపంచంలో అతిపెద్ద వ్యక్తిగత లైబ్రరి కల్గిన వ్యక్తులుగా డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ 1891 – 1956. అమెరికాకు చెందిన థామస్ జాఫర్సన్ 1743 –1826 లు గుర్తింపు నొందారు. అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాత అయితే. జాఫర్సన్ అమెరికా రాజ్యాంగం రూపకర్త. జాఫర్ సన్ యునైటెడ్ స్టేట్స్ కి మూడవ అధ్యక్షుడు కూడా జాఫర్సన్ కు 7000 వేల గ్రంధాలతో పర్సనల్ లైబ్రరి వుండేది. బహుశ ప్రపంచంలొ అతిపెద్ద తొలి పర్సనల్ లైబ్రరి ఇదేకావచ్చు. బాబాసాహెబ్ అంబేద్కర్ 60 వేల గ్రంధాలతో కూడిన లైబ్రరీ ని లండన్ మ్యూజియం ను న్యూయర్క్ లైబ్రరి తరహాలో ఏర్పరచుకున్నారు. ఒక వ్యక్తి లైబ్రరి కోసం బంగ్లాను నిర్మించడం అనేది ఆసియా ఖండంలోనే ప్రప్రదమం.అమెరికా రాజ్యాంగ నిర్మాణంలొ బెంజిమెన్ ఫ్రాంక్లిన్, జాఫర్ సన్ , మాడిసన్ అనె ముగ్గురు మేధావులు చేసిన కృషికి సమానంగా డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాణంలో చేసారు. రాజ్యాంగ నిపుణుడు సర్ జెన్నింగ్స్ కూడా ఏదైన సందేహముంటే అంబేద్కర్ తో చర్చించి సలహాలను తీసుకుంటా నని ప్రకటించారు. నాకు నోబుల్ అవార్డ్ రావడానికి ఆర్థిక శాస్త్రంలో అంబేద్కర్ సమర్పించిన థీసెస్ కారణమని







మన భారతీయుడు అమర్త్యసేన్ పేర్కొన్నారు. అంబేద్కర్ కి మహనీయుల చరిత్రలకు సంబందించిన పుస్తకాలను కొనడం అనేది తాను బి ఏ చదువుతున్నప్పుడే అలవాటు అయింది. ఆ సమయంలో తన తండ్రి వద్ద డబ్బులు లేకపోతే తన కూతురు పెళ్ళికి దాచి పెట్టిన చెవి కమ్మలను తాకట్టు పెట్టి అంబేద్కర్ కోరుకున్న పుస్తకాలను కొని ఇచ్చారు. తనకు ఉన్నత చదువుల కోసం బరోడా సంస్థానం నుంచి పంపే స్కాలర్ షిప్ లో కొంత సొంత ఖర్చులకు ఇంటి ఖర్చులకు పోను మిగిల్చుకున్న డబ్బులతో పాత పస్తకాలను కొనేవారు. పుస్తకాల కోసమని తక్కువ ఖర్చుతో కూడిన భోజనం చేసి అద్దెకు గదిని కుదర్చుకున్నాడు. చాలినంత డబ్బులు లేక ఎన్నిసార్లు ఆకలితో పడుకున్నాడో తనకే తెలియదు.ఒక రొట్టె ముక్కతో, ఒక కప్పు ' టీ ' తో ఆకలి తీర్చుకున్న రోజులు కోకొల్లలు అంబేద్కర్ జీవితంలో ఉన్నాయి. లండన్ లో ఒక అంటరాని వాడు అద్దెకు తీసుకున్న గది నేడు పరిశోధకులకు సందర్శన ప్రాంతంగా మారింది. అలా పస్తులుండి దాచిన డబ్బుతో న్యూయర్క్ నుండి 2000 పాత పుస్తకాలను ,లండన్ నుండి 8000 పుస్తకాలను తీసుకొచ్చారు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ . అందుకే నేడు ప్రపంచ మేధావులలో ప్రధముడు గా 2013 కేంబ్రిడ్జి యూనివర్సటి గుర్తించింది. ఆ విదంగా 1934 నాటికి 45 వేలు పుస్తకాలు అయినాయి.వాటిని భద్రపరచుకునే ప్రదేశం లేక అంబేద్కర్ మదనపడుతుండేవారు. ఆ సమయంలోనే వాటి కోసమని ఏకంగా ఒక బంగ్లానే నిర్మించారు. షాజహాన్ ముంతాజ్ కోసం తాజ్ మహల్ ని నిర్మిస్తే...బాబాసాహెబ్ అంబేద్కర్ తన పుస్తకాల జ్ఞానం కోసం రాజగృహ అనే మూడంతస్తుల భవనాని నిర్మించారు.ఇప్పుడు ఈ భవనం లైబ్రరీ పరిశోధకులకు సందర్శకులకు కేంద్రంగా మారింది. రీసెర్చ్ కొసం ఎంతోమంది స్కాలర్స్ దేశ విదేశాల నుండి రాజగృహకు వస్తుంటారు. 10 వేల విలువైన అతిముఖ్యమైన గ్రంధాలు అందులో వుండేవి. న్యాయశాస్త్రానికి సంబందించిడాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దగ్గర వున్న పుస్తకాలు బహుశ దేశంలో మరొకరి దగ్గర వుండక పోవచ్చునని, అలా న్యాయశాస్త్ర పుస్తకాలతో తన అలమార నిండిపోయివుండేదిని పరిశీలకులు భావిస్తున్నారు. తన 200 రూపాయల సంపాదిస్తే... అందులో 100 రూపాయలపైగానే పుస్తకాల కోసం ఖర్చు చేసేవారు.తన సంపాదనంతా పుస్తకాల కోసమే వ్యయం చేసారు. ఇంగ్లాడ్ నుండి తిరిగి వస్తున్నప్పుడు వెనిస్ నుండి బొంబాయి చేరుకోవాలంటే 6 రోజులు పడుతుంది. ఆసమయంలో 80 పేజీలు చదివానని అనేక ప్రసంగాల్లో అంబేద్కర్ చెప్పారు .ఒకసారి నేను 64 గంటలు పుస్తకాని చదువుతు కూర్చొన్నాను.అది అయిపోయిన తర్వాత నేను పైకిలేచాను అని అంబేద్కర్ వివరించారు. ప్రతి రోజు చదవడానికని తన బల్లపై 10, 15 పుస్తకాలను వుంచుకునేవారు.రోజుకు 18 గంటలు చదివేవారు.అన్ని మత గ్రంధాలతో పాటుగా బౌద్ధ గ్రంధాలను 2 వేల దాకా చదివారు.ప్రయాణాలలో కాదు ఎక్కడ సమయం దొరికితే అక్కడ చదవడంలో మునిగి పోయెవారు.ఆఖరికి బాత్రూంలో కూడా చదివేవారు అంబేద్కర్ . లండన్ లైబ్రరికి ఉదయం 10 గంటలకు వెలితే సాయత్రం 5 గంటల వరకు లైబ్రేరియన్ వచ్చి గుర్తు చేసేవరకు లేచేవారుకాదు.అలా పుస్తకంలో నిమగ్నమై పోయేవారు.1942 లో వైశ్రాయి ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా వున్నప్పుడు బొంబాయిలో రైల్వేస్టేషన్ లో తన పుస్తకాల కోసం ఒక ప్రత్యేక రైల్వేగది రైల్వే లాకర్ గది ని ఏర్పరుచుకున్నారు. ఆ సమయంలో సరోజినాయుడు రైల్వె లాకర్ లో వున్న గ్రంధాలను సందర్శించి ఆశ్చర్యానికి గురయ్యారు . కాంగ్రెస్ దాని అధినాయకుడు గాంధీ అంబేద్కర్ యొక్మ విలువను గుర్తించక పోవడం విచారకరం. భావితారాలు మాత్రం అతని జాతీయతను అపారమైన జ్ఞానాని గుర్తిస్తాయి అని అన్నారు. బెవర్లీ నికోలస్ అనె అమెరికా విధ్యావంతురాలు మహిళా అంబేద్కర్ తో కలసి మాట్లాడి తన జ్ఞానానికి ముగ్ధురాలై తాను వ్రాసిన " వర్ధిక్ ఆఫ్ ఇండియా " (1944) అనే గ్రంధంలో " అంబేద్కర్ జీవించి వున్న జ్ఞానదేవత " అనికొనియాడింది. ఒకసారి అంబేద్కర్ ' ఎ టేల్ ఆఫ్ టూ సిటీస్ ' అనే సినిమాకు వెల్లారు. మద్యలో ఒకఆలోచన వచ్చేసరికే సినిమా నుండి ఇంటికి వెల్లి ఆ...ఆలోచనను పేపర్ పై పెట్టారు.అంబేద్కర్ తన జీవితకాలంలో 4 సినిమాలను మాత్రమే చూసానని చెప్పుకున్నారు . పుస్తకాల పఠనం కోసం ఆకలిని సుఖాలను,విలాసాలను వదులు కున్నాడు.తనకు వున్న సమయాన్నంతా పుస్తకం పఠనం కోసమే దారబోసారు. సమయాని ఎప్పుడు వృదా చేయలేదు అంబేద్కర్ . 1948 లో శ్రీలంక స్వాతంత్రఉత్సవాలకు అంబేద్కర్ ని ఆహ్వానించారు. వాటికి నెహ్రూ పటేల్ హాజరైనారు. సమయాని వృధా చేయడం ఇష్టం లేకనే నేను ఉత్సవాలకు హాజరుకావడం లేదని అంబేద్కర్ అన్నారు. ఆఖరి దశలో నేను కఠిక పేదరికాని అనుభవించాను.నేను కనుక ఉద్యోగంలో చేరివుండి వుంటె పెన్షన్ డబ్బులతో నా శేష జీవితం. ఇబ్బందులు లేకుండా గడిచి పోయేదని క్షోబించాడు. నా పుస్తకాలను అమ్మితే 5 లక్షలు వస్తాయి. ఆ డబ్బులతో కష్టాలన నుండి బయటపడవచ్చు.కానీ పుస్తకాలు నా నేస్తాలు.నేను అలా చేయలేను ఎన్నో సార్లు నేను పస్తులుండి .. కుటుంబ ఖర్చులకు పంపకుండా..దాచిన డబ్బుతో కొన్న పాత ,కొత్త పుస్తకాలు అవి ..వాటిలో చాలా పుస్తకాలు ఇప్పుడు దొరకవు . బిర్లా నా పుస్తకాలను కొనడానికి నా దగ్గరకు వచ్చారు.నేను అందుకు ఒప్పుకోలేదు అని అంబేద్కర్ చెప్పారు .అంతటి మహా బహుముఖ ప్రజ్ఞాశాలిని ప్రపంచం ఎన్నడు చూచి వుండదు...ఇక చూడబోదు ప్రపంచంలోనే అత్యధిక పుస్తకాలను అధ్య యనం చేసి విశ్వనరుడుగా ఖ్యాతినొందిన అంబేద్కర్ వంటి మహా మేధావిని గర్తుంచుకోండి. అంబేద్కర్ 200 దేశాలలో విశ్వ జ్ఞానిగా వెలుగొందుతున్నాడు. అంబెద్కర్ ఒక్కరే జ్ఞానం ద్వారా ప్రపంచ వ్యాపితమైనారు. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక పుస్తకాలు చదివిన వ్యక్తులుగా ముగ్గురు ఉంటే అందులో ప్రతముడుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నిలిచాడు. అయన జ్ఞానాన్ని గుర్తించిన ఐక్యరాజ్యసమితి అంబేద్కర్ 125 వ జయంతి ఉత్సవాలను పు రష్కరించుకొని. ఇంటర్నేషనల్ నాలెడ్జ్ డేగా ప్రకటించింది. దీనితోపాటు అంబేద్కర్ ప్రతి జయంతి వర్ధంతిలను ఐక్యరాజ్యసమితిలో నిర్వహించడం భారతీయులుగా మనమంతా గర్వించదగ్గ అంశం . అంతేకాకుండా ఆయన చదువుకున్న కొలంబియా యూనివర్సిటీలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి సింబల్ ఆఫ్ నాలెడ్జ్ గా ప్రకటించారు. ప్రపంచంలోనే అత్యధిక పుస్తకాలు చదివిన వ్యక్తిగా తో పాటు అత్యధిక రాజనీతి శాస్త్రజ్ఞుడిగా , ఆర్థికవేత్తగా , న్యాయ కోవిదురుగా గుర్తింపు పొందారు . భారతదేశంలోని అణగారిన వర్గాల్లో జన్మించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కుటుంబానికి ఉండడానికి సరియైన ఇల్లు లేకపోయినా ఆయన మాత్రం పుస్తకాలకు ప్రాధాన్యత కల్పించాలని అటువంటిది సత్యం. జ్ఞానం ఒకటే మిగులును అనే అంశాన్ని సమాజం, నేటి తరం గుర్తుంచుకోవాల్సిన అంశం.

అస శ్రీరాములు
సీనియర్ జర్నలిస్ట్
9440037196



## అజ్ఞాతంలోనే ఆనందం



చైనాలో ఉద్భవించిన తావో మతంలో లావోట్జూ త ం ు ఎ ా త పేర్కొనదగినవాడు... ఆయన శిష్యుడైన చువాంగ్ ట్జూ. అతను మహా జ్ఞాని అని దేశంలో అందరూ చెప్పుకొనేవారు. ఈ సంగతి ఆ దేశపు చక్రవర్తి విన్నాడు. అలాంటి వ్యక్తి తన కొలువులో, తనకు సలహాదారుగా ఉండే బాగుంటందనుకున్నాడు. వెంటనే చువాంగ్‌ను తనవద్దకు తీసుకురావాలని భటుల్ని ఆజ్ఞాపించాడు.అయితే... అతి సామాన్యమైన జీవితాన్ని గడిపే చువాంగ్ ఎల్లప్పుడూ అజ్ఞాతంగా ఉండాలని భావించేవాడు. ఎక్కడా స్థిరంగా ఉండకుండా తిరిగేవాడు. ఏదైనా గ్రామంలో కొన్నాళ్ళు గడిపాక... అక్కడి ప్రజలు అతని గొప్పతనాన్ని గుర్తించి, ప్రత్యేక గౌరవాన్ని కనబరచడం మొదలుపెట్టగానే... మరో గ్రామానికి వెళ్ళేవాడు. అక్కడ కూడా ఇంతే. ఎప్పుడూ అనామకుడుగా ఉండడానికే ఇష్టపడేవాడు. అలాంటి వ్యక్తిని తన సమక్షానికి తీసుకురావాలని చక్రవర్తి ఆజ్ఞాపించాడు. భటులు ఊరూరా తిరిగారు, మూలమూలలు వెతికారు. కనబడినవారందరినీ అడిగారు. కానీ చువాంగ్ జాడ ఎన్ని రోజులైనా వారికి తెలియలేదు. వారు వెతికి వెతికి, అలసిపోయారు. నిరాశకు గురయ్యారు. "చువాంగ్‌ను ఎలా గుర్తించాలి?" అని అతని శిష్యుల్ని అడిగారు. "చువాంగ్ అత్యంత సామాన్యుడిగా ఉంటాడు. జనానికి దూరంగా... ఏమూలో ఒక మామూలు పని చేస్తూ ఉంటాడు" అని వాళ్ళు రాజభటులకు చెప్పారు.

%చివరకు... ఒక గ్రామంలో చువాంగ్ ఉన్నాడని భటులకు తెలిసింది. వారు ఆ గ్రామానికి వెళ్ళి, "ఇక్కడికి కొత్త వ్యక్తి ఎవరైనా వచ్చారా?" అని అడిగారు. "అవును. అదిగో... అక్కడున్నాడు. నదిలో చేపలు పడుతున్నాడు" అంటూ గ్రామస్తులు అతణ్ణి చూపించారు. భటులు చువాంగ్ దగ్గరకు వెళ్ళి "మిమ్మల్ని తన సభకు తీసుకురమ్మని చక్రవర్తి మమ్మల్ని పంపారు. ఆయన కొలువులో ముఖ్య సలహాదారుగా నియమిస్తారట" అని చెప్పారు. ఇంకెవరైనా అయితే ఎగిరి గంతేసేవారే! అయితే... భటుల మాట విన్న చువాంగ్ "ఈ రాత్రి నన్ను కాస్త ఆలోచించనివ్వండి. రేపు ఉదయం నా నిర్ణయం చెబుతాను. తెల్లారిన తరువాత చక్రవర్తి దగ్గరకు వెళ్దాం" అన్నాడు. భటులు సంతోషంగా సమ్మతించారు. ఆ రాత్రి అక్కడే విశ్రమించారు.మర్నాడు ఉదయం చూస్తే... వారికి చువాంగ్ కనిపించలేదు. రాత్రికి రాత్రే ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్ళిపోయాడు. చక్రవర్తికి ఈ సంగతి భటులు తెలిపారు. "స్వాతంత్ర్యాన్ని, ఏకాంతాన్ని కోరుకొనే సాధువులు, సన్న్యాసులు ఎలాంటి పదవులకు, హోదాలకు, సత్కారాలకు ఆకర్షితులు కారు. అజ్ఞాతంగా ఉండడమే వారికి ఆనందదాయకం" అని చక్రవర్తి గ్రహించాడు.



## ఆర్‌టీఈ నిధులను ఎన్ఈపీతో ముడిపెట్టొద్దు

**చెన్నై-నవభూమి:** విద్యా హక్కు చట్టం (ఆర్‌టీఈ) కింద రాష్ట్రాలకు కేంద్రం విడుదల చేసే నిధులను జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)తో ముడిపెట్టవలసిన అవసరం లేదని మద్రాస్ హైకోర్టు రూలింగ్ ఇచ్చింది. విద్యా హక్కు చట్టం కింద ప్రైవేటు పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం తమిళనాడుకు నిధులు విడుదల చేయటం కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని, దీనిని జాతీయ విద్యా విధానం అమలుతో ముడిపెట్టవద్దని స్పష్టం చేసింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ప్రైవేటు అన్‌ఎయిడెడ్ పాఠశాలలకు నిధులు విడుదల చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదని తేల్చి చెప్పింది. కేంద్రం నుంచి నిధులు రాలేదన్న వంకతో ఈ బాధ్యత నుంచి రాష్ట్రాలు తప్పించుకోజాలవని కోర్టు స్పష్టం చేసింది. 2025-26లో ఆర్‌టీఈ కింద అడ్మిషన్లు ప్రారంభించే విధంగా తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ కోయంబత్తూరుకు చెందిన హక్కుల కార్యకర్త వీ ఈశ్వరన్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ జీఆర్ స్వామినాథన్, జస్టిస్ వీ లక్ష్మీనారాయణన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. చట్టం అమలు కోసం నిధులు విడుదల చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏకకాలంలో బాధ్యత వహించాలని పేర్కొంది. సెక్షన్ 7(3) ప్రకారం, కేంద్రం రాష్ట్రాలతో సంప్రదించి ఆర్‌టీఈ చట్టం అమలుకు అయిన వ్యయంలో నిర్దిష్ట శాతాన్ని ఎప్పటికప్పుడు అందించడం తప్పనిసరి అని గుర్తుచేసింది.



## ఘోర ప్రమాదం.. అహ్మదాబాద్‌లో కూలిన ఎయిర్ ఇండియా విమానం



**అహ్మదాబాద్-నవభూమి:** గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో ఘోర విమాన ప్రమాదం సంభవించింది. మేఘానిలో ఎయిర్ ఇండియాకు చెందిన విమానం కుప్పకూలింది. టేకాఫ్ అయిన నిమిషాల్లోనే సివిల్ ఆసుపత్రి సమీపంలో జనావాసాలపై విమానం కూలినట్లు జాతీయ మీడియా పేర్కొంటోంది. ప్రమాద సమయంలో విమానంలో 133 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలిసింది. ప్రమాదం అనంతరం ఆ ప్రాంతంలో దట్టమైన పొగ వ్యాపించింది. విమానం అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్తున్నట్లు సమాచారం. ప్రమాద సమాచారం అందుకున్న అధికారులు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రులకు తరలిస్తున్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


## సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ అనుమానాస్పద మృతి

### కారులో డెడ్‌బాడీ గుర్తింపు



**బటిండా-నవభూమి:** ఓ సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. పంజాబ్‌కు చెందిన ఇన్‌ఫ్లూయెన్సర్ కాంచన్ కుమారీ మృతదేహాన్ని బటిండాలోని ఆదేశ్ మెడికల్ యూనివర్సిటీ క్యాంపస్ సమీపంలోని ఓ కారులో గుర్తించారు. పోలీసులు అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లుగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కొన్ని నెలల క్రితం ఆమెకు గ్యాంగ్‌స్టర్ అర్ష్‌దల్లా నుంచి బెదిరింపులు వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. కాంచన్ కుమారీకి గత ఏడాది అక్టోబర్‌లో అర్ష్ దల్లా నుంచి బెదిరింపులు వచ్చాయి. సోషల్ మీడియాలో అనుచిత వీడియోలను పోస్టు చేయడం ఆపాలంటూ గ్యాంగ్‌స్టర్ హెచ్చరించాడు. దీంతో కేసును ఆ కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. కాగా, కాంచన్ కుమారీకి 'కమల్ కౌర్ భాభీ'గా మంచి గుర్తింపు ఉంది. ఇన్‌స్టాగ్రామ్ వెరిఫైడ్ ఖాతాలో 3.83 లక్షల మందికిపైగా ఫాలోవర్లు ఉన్నారు.

## బెంగాల్‌లో హింస.. 40 మంది అరెస్టు



**కోల్‌కతా-నవభూమి:** పశ్చిమ బెంగాల్‌లోని సౌత్ 24 పరగనాస్ జిల్లాలో హింసచోటుచేసుకున్నది. రెండు వర్గాల ప్రజలు విధ్వంసానికి దిగారు. మిటాబ్రుజ్ అసెంబ్లీ నియోజకవర్గంలోని రబీంద్ర నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న మహేస్తల ప్రాంతంలో నిర్మించిన శివాలయాన్ని కొందరు ధ్వంసం చేశారు. అక్కడ ఉన్న ఆక్రమిత ప్రాంతంలో కొందరు షాపులు ఏర్పాటు చేయడంతో గొడవ జరిగింది. వివాదాస్పద భూమి విషయంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ తలెత్తినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. రెండు వర్గాల ప్రజలు రాళ్లు రువ్వుకున్నారు. ఓ మోటారు సైకిల్‌కు నిప్పుపెట్టారు. ఘర్షణలను అడ్డుకునే ప్రయత్నంలో పోలీసులు గాయపడ్డారు. మహేస్తల హింసకు చెందిన కేసులో బెంగాల్ పోలీసులు ఇప్పటి వరకు 40 మందిని అరెస్టు చేశారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ హింసకు చెందిన ఏడు ఎఫ్ఐఆర్‌లు నమోదు అయ్యాయి. బెంగాల్ ప్రతిపక్ష నేత సువేందు అధికారి తన ఎక్స్ అకౌంట్‌లో ఈ హింసపై స్పందించారు. ఆయన ఓ వీడియోను పోస్టు చేశారు. మహేస్తలలోని వార్డు నెంబర్ 7లో శివాలయాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఆలయ కమిటీ ఆధీనంలో ఉన్న భూమిని అల్లరిమూకలు ఆక్రమించినట్లు పేర్కొన్నారు. ఆలయం వద్ద హిందువుల షాపులను, తులసీ కోటను ధ్వంసం చేశారని ఆరోపించారు.

## 24 గంటల్లో 117 కొత్త కేసులు నమోదు.. మూడు మరణాలు



**తిరువనంతపురం-నవభూమి:** దేశంలో కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది. గత 24 గంటల్లో 117 మందికి పాజిటివ్‌గా తేలింది. దీంతో దేశంలో క్రియాశీల కేసుల సంఖ్య 7,154కి ఎగబాకింది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం కేరళ రాష్ట్రంలో అత్యధికంగా 2,165 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. ఆ తర్వాత గుజరాత్‌లో 1,281 కేసులు, పశ్చిమ బెంగాల్‌లో 747, ఢిల్లీలో 731, మహారాష్ట్రలో 615 కేసులు, కర్ణాటకలో 467, ఉత్తరప్రదేశ్‌లో 231, ఉత్తరప్రదేశ్‌లో 227 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. గత 24 గంటల్లో మూడు మరణాలు సంభవించాయి. మహారాష్ట్రలో ఇద్దరు, మధ్యప్రదేశ్‌లో ఒకరు మరణించారు. దీంతో ఈ ఏడాది ఇప్పటి వరకూ కరోనా కారణంగా మరణించిన వారి సంఖ్య 77కి ఎగబాకింది. ఇక ఇప్పటి వరకూ 9,556 మంది కరోనా నుంచి కోలుకున్నారు.

# ఈ కథ వింటే కళ్లు బైర్లుకమ్మాల్సిందే!



**రహీమాబాద్-నవభూమి:** రోజురోజుకూ మానవ సంబంధాలు మంట గలుస్తున్నాయి. పలువురు మహిళు పెళ్లిళ్లు అయ్యాక కూడా పరాయి పురుషులతో ప్రేమలో పడుతూ.. కట్టుకున్న వారిని, తాను కన్నవారిని, తమను కన్నవారిని చంపేస్తున్నారు. ఇప్పటి వరకు మనం ఇలాంటి కథలే చూశాం. కానీ ఇప్పుడు చూడబోయేది మాత్రం అంతకు మించిన కథ. ఎందుకంటే ఓ మహిళకు పెళ్లై భర్త ఉండగానే మరో వ్యక్తితో ప్రేమలో పడింది. మూడేళ్లపాటు చాటుమాటుగా వ్యవహారం సాగించింది. ఇప్పుడు అతడిని వదిలి మరో వ్యక్తితో ప్రేమాయణం సాగిస్తుండగా.. మాజీ ప్రేమికుడు గొడవకు దిగాడు. తనతోనే కలిసుండాలని గొడవ చేశాడు. ఇది ఏమాత్రం జీర్ణించుకోలేకపోయిన ఆమె కొత్త ప్రియుడితో కలిసి మాజీ ప్రియుడిని చంపేసింది. ఇందుకు ఆమె భర్త కూడా సహకరించడం గమనార్హం. ఉత్తర ప్రదేశ్‌లోని రహీమాబాద్ ప్రాంతంలోని మలిహాబాద్‌కు చెందిన 38 ఏళ్ల కుంతి రావత్‌కు చాలా ఏళ్ల క్రితమే 45 ఏళ్ల రాంభజన్‌తో వివాహం జరిగింది. అయితే పెళ్లైనప్పటి నుంచి వీరిద్దరి జీవితం బాగానే గడిచింది. కానీ గత మూడేళ్ల క్రితం తమ బంధువులు అయిన.. అహీందర్ గ్రామానికి చెందిన 30 ఏళ్ల విజయ్ కుమార్ అలియాస్ గప్పు భార్య చనిపోయింది. సతీమణి చనిపోయినప్పటి నుంచి గప్పు కన్ను.. తన బంధువు అయిన కుంతి రావత్‌పై పడింది. ఆమెకు కూడా అతడు నచ్చగా ఇద్దరూ కలిసి ప్రేమాయణం సాగించారు. నేరుగా కుంతి అతడిని ఇంటికి రప్పించుకుంటూనే వ్యవహారం నడిపింది. ముఖ్యంగా ఆమె తన ప్రియుడు గప్పుతో శారీరకంగా కలవాలనుకున్న ప్రతీ సారి తన భర్తకు మద్యం, ఆహారంలో మత్తు పదార్థాలు కలిపి ఇచ్చేది. దీంతో అతడు స్పృహ తప్పేవాడు. ఆ తర్వాత ఆమె తన ప్రియుడితో కలిసి ఇంట్లోనే ఎంజాయ్ చేసేంది. మూడేళ్లుగా వీరిద్దరూ ఇలాగే కాలం గడుపుతూ వస్తున్నారు. అయితే ఇవేవీ తెలియని గప్పు.. భార్యతో చాలా ప్రేమగా ఉంటున్నాడు. అయితే ఇటీవలే కుంతికి, గప్పుకు మధ్య విభేదాలు వచ్చాయి. అలాగే కుంతికి అదే గ్రామానికి చెందిన 40 ఏళ్ల జబ్బర్‌తో స్నేహం ఏర్పడింది. అది కూడా వివాహేతర సంబంధానికి దారి తీసింది. అప్పటి నుంచి మొదటి ప్రియుడు అయిన గప్పును తన ఇంటికి రానివ్వడం లేదు కుంతి. దీంతో ఆమెపై కోపం పెంచుకున్న అతడు ఇటీవలే ఆమె ఇంటికి వచ్చి గొడవ పెట్టుకున్నాడు. అప్పుడు కుంతీ భర్త కూడా అక్కడే ఉండగా.. వారిద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. దీంతో గప్పుపై కోపం పెంచుకున్న కుంతి.. అతడిని ఎలాగైనా చంపేయాలని భావించింది. అదే విషయాన్ని తన కొత్త ప్రియుడు జబ్బర్, భర్త రాంభజన్‌తో చెప్పింది. తన పరువు తీసినవాడు బతకూడదని వివరించింది. అందుకు వాళ్లిద్దరూ ఓకే చెప్పగా.. గప్పు హత్యకు పన్నాగం పన్నారు. జూన్ 8వ తేదీన తమ ఇంటికి రప్పించుకుని మరీ అతడిని చంపేశారు. ముగ్గురూ కలిసి ఓ కత్తితో గొంతుకోసి చంపేశారు. ఆపై రక్తం కింద కారకుండా ఓ తువ్వాలను మెడచుట్టూ చుట్టి మృతదేహాన్ని తమ ఇంటికి 100 మీటర్ల దూరంలో పడేసి వచ్చారు. ప్రేమ ఎవరితోనైనా పర్లేదు...పెళ్లి మాత్రం మన కులపోడితేనే!అయితే మరుసటి రోజు ఉదయమే ఊళ్లో గప్పు మృతదేహం లభ్యం కాగా.. పోలీసులు రంగ ప్రవేశం చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈక్రమంలోనే గప్పుది హత్యగా గుర్తించారు. అలాగే అతడిని చంపింది కుంతి, రాంభజన్, జబ్బర్‌లే అని కూడా తెలుసుకుని వారిని అరెస్ట్ చేశారు. అలాగే చంపడానికి ఉపయోగించిన కత్తి, తువ్వాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఆపై నిందితులు ముగ్గురిని విచారించగా వారు కూడా తమ తప్పును ఒప్పుకున్నారు.

# భారత్ బ్రహ్మోస్ దెబ్బకు పాక్ బెంబేలు




**న్యూఢిల్లీ-నవభూమి:** పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్.. పాకిస్తాన్ కు తీవ్ర నష్టం చేకూర్చింది. భారత్‌పై దాడులు చేయడం సంగతి అటుంచితే.. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ చేసిన దాడులను పసిగట్టడం, వాటిని అడ్డుకోవడంలో ఘోరంగా విఫలమైంది. ఫలితంగా భారత్ జరిపిన దాడుల్లో పాకిస్తాన్ ఎయిర్‌బేస్‌లు, ఉగ్రవాద శిబిరాలు సహా కీలక ప్రాంతాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. భారత్ ప్రయోగించిన బ్రహ్మోస్ మిసైల్స్ దాడులు గుర్తుకు వస్తేనే పాకిస్తాన్‌కు ఇప్పుడు కంటిమీద కునుకు లేకుండా పోయింది. చైనా నుంచి కొనుగోలు చేసిన ఫైటర్ జెట్లు, డ్రోన్లు, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు పూర్తిగా తేలిపోవడంతో.. పాక్ చేతులెత్తేసింది. ఈ నేపథ్యంలోనే భారత్ నుంచి చేసే దాడులను అడ్డుకోవాలన్నా.. భారత్‌పై దాడులు చేయాలన్నా.. అత్యాధునిక ఆయుధాలు కావాలని ఒక నిర్ణయానికి వచ్చింది. ఇందులో భాగంగానే చైనా ఆయుధాలను కాకుండా.. జర్మనీ నుంచి రక్షణ వ్యవస్థలను కొనుగోలు చేయాలని భావిస్తోంది. చైనా నుంచి కొనుగోలు చేసిన హెచ్‌క్యూ-9, హెచ్‌క్యూ-16 ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు భారత్ చేసిన దాడులను అడ్డుకోలేకపోవడంతో.. జర్మనీకి చెందిన అధునాతన ఐరిస్-టి-ఎస్ఎల్ఎమ్ వ్యవస్థను కొనుగోలు చేయాలని ఇప్పుడు పాక్ యోచిస్తోంది. అయితే భారత రక్షణ ప్రాజెక్టుల్లో జర్మనీ సంస్థకు కీలక భాగస్వామ్యం ఉండటం.. ప్రస్తుతం అడుక్కుతినే స్థితిలో ఉన్న పాకిస్తాన్ ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడం ఈ కొనుగోలుకు అడ్డంకులుగా మారనున్నాయి. తమ వైమానిక స్థావరాలపై భారత్ బ్రహ్మోస్ క్షిపణులను ప్రయోగించిందని పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ పేర్కొనగా.. భారత్ పూర్తిస్థాయిలో దాడి చేస్తే తాము తట్టుకోలేమని ముందుగానే గ్రహించారు. ఈ నేపథ్యంలోనే బ్రహ్మోస్ క్షిపణులు సృష్టించే విధ్వంసాన్ని అడ్డుకోవాలంటే ప్రత్యేక రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని పాకిస్తాన్ భావిస్తోంది. ఇటీవల భారత్ ప్రయోగించిన డ్రోన్, క్షిపణి దాడులను చైనా రక్షణ వ్యవస్థలు అడ్డుకోలేక బిక్కమొహం వేశాయి. పాకిస్తాన్ చెబుతున్నట్లు ఒకవేళ భారత్ బ్రహ్మోస్ క్షిపణులను ప్రయోగించినా.. వాటిని ఎదిరించే సత్తా హెచ్‌క్యూ-9, హెచ్‌క్యూ-16 రక్షణ వ్యవస్థలకు లేనట్లు మొన్ననే అర్థమైపోయింది. ఈ నేపథ్యంలోనే దీనికి కచ్చితమైన పరిష్కారాన్ని కనుగొనాలని పాక్ నిర్ణయించుకుంది. ఇందుకోసం రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని పరిశీలిస్తోంది. గత 3 ఏళ్లుగా రష్యా దాడులను సమర్థవంతంగా తిప్పికొడుతున్న ఉక్రెయిన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను.. తాము సొంతం చేసుకోవాలని పాకిస్తాన్ ప్రయత్నాలు చేస్తోంది. అయితే ఈ ఐరిస్-టి-ఎస్ఎల్ఎమ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను జర్మనీ నుంచి ఉక్రెయిన్ కొనుగోలు చేసింది. డీల్ డిఫెన్స్ సంస్థ తయారుచేసిన ఈ ఐరిస్-టి-ఎస్-ఎల్ఎమ్ రక్షణ వ్యవస్థ.. రష్యాకు చెందిన పీ-800 ఆనిక్స్ మిసైళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంది. ఈ క్షిపణులకు భారత్ రూపొందించిన బ్రహ్మోస్ క్షిపణులకు దగ్గరి పోలికలు ఉన్నట్లు రక్షణ రంగ నిపుణులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఐరిస్-టి-ఎస్ఎల్ఎమ్ డిఫెన్స్ సిస్టమ్‌ను కొనుగోలు చేసేందుకు పాక్ పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఆ సంస్థతో ఒప్పందం కుదుర్చుకోవడం పాకిస్తాన్‌కు అంత సులువేం కాదు. డీల్ డిఫెన్స్ సంస్థలో భాగస్వామ్యం ఉన్న థైసెన్‌క్రప్ మెరైన్ సిస్టమ్స్ అనే సంస్థ భారత్‌లోని వివిధ రక్షణ ప్రాజెక్టుల్లో కీలకంగా వ్యవహరిస్తోంది. మరోవైపు.. ఇప్పటికే రక్షణ కోసం భారీగా నిధులు ఖర్చు చేస్తున్నారని పాకిస్తాన్‌లో నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. గత నెలలో ఐఎంఎఫ్ నుంచి 1 బిలియన్ డాలర్లు.. ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నుంచి మరో 800 మిలియన్ డాలర్లను పాకిస్తాన్ రుణంగా తీసుకుంది. ఈ పరిస్థితుల్లో అంత భారీ మొత్తాన్ని చెల్లించి జర్మనీ నుంచి పాక్ రక్షణ వ్యవస్థను కొనుగోలు చేస్తుందా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇవన్నీ పక్కనబెట్టినా.. చైనాకు వ్యతిరేకంగా జర్మనీ నుంచి ఆయుధాలు కొనుగోలు చేస్తే ఇప్పటివరకు మద్దతుగా ఉన్న చైనా కూడా పాక్‌కు వ్యతిరేకం అయ్యే సూచనలు ఉన్నాయి.

## నా భర్తను నేనే చంపా.. పోలీసుల వద్ద ఒప్పుకున్న సోనమ్



**షిల్లాంగ్-నవభూమి:** తన భర్త రాజా రఘువంశీని తానే హత్య చేసినట్లు సోనమ్ రఘువంశీ ఒప్పుకున్నట్లు మేఘాలయ పోలీసులు బుధవారం వెల్లడించారు. ఈ కేసులో మరో నిందితుడైన సోనమ్ ప్రియుడు రాజ్ కుష్వాహ సమక్షంలో ప్రశ్నించినపుడు తన భర్త హత్యకు జరిగిన కుట్రలో తన ప్రమేయం ఉన్నట్లు ఆమె అంగీకరించిందని పోలీసులు తెలిపారు. రాజ్ కుష్వాహతో కలసి సోనమ్ తీసుకున్న ఫొటో కూడా బయటపడింది. మే 23 లేక 24న రాజాను హత్య చేసి ఉంటారని పోలీసులు తెలిపారు. మే 25న నిందితులు ఇండోర్‌కు తిరిగి వచ్చారని చెప్పారు. తన భర్త హత్య తర్వాత సోనమ్ కూడా ఇండోర్ తిరిగి వచ్చినట్లు తెలిపారు. అద్దెకు తీసుకున్న గదిలో ఆమె తన ప్రియుడు రాజ్ కుష్వాహను కలుసుకుందని చెప్పారు. మే 23న మేఘాలయలోని వీ సాడాంగ్ జలపాతం వద్ద రఘువంశీ అదృశ్యం కాగా జూన్ 2న ఆయన మృతదేహం వాటర్ ఫాల్స్ సమీపంలోని లోయలో లభించింది. రాజా రఘువంశీ హత్య కుట్రలో పాలు పంచుకున్న సోనమ్, మరో నలుగురు నిందితులకు షిల్లాంగ్ కోర్టు 8 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధించినట్లు ఓ సీనియర్ అధికారి తెలిపారు.

**నా సోదరే హత్య చేయించింది**

రాజా రఘువంశీ హత్యకు సోనమ్ కుట్ర పన్నినట్లు తాను వంద శాతం నమ్ముతున్నానని, నేరం రుజువైతే ఆమెను ఉరితీయాలని సోనమ్ సోదరుడు గోవింద్ బుధవారం ఇండోర్‌లో తెలిపారు. తన సోదరితో తమ కుటుంబం అన్ని బంధాలను తెంపుకుందని ఆయన చెప్పారు. హత్యకు గురైన రాజా కుటుంబానికి సంఘీభావం ప్రకటించిన గోవింద్ న్యాయం కోసం వారు సాగించే పోరాటానికి తాను కూడా సాయపడతానని చెప్పారు. రాజా కుటుంబ సభ్యులను ఇండోర్‌లోని వారి ఇంటికి గోవింద్ వెళ్లారు. హృదయ విదారకంగా రోదిస్తున్న రాజా తల్లి ఉమను గోవింద్ ఓదార్చారు. అనంతరం అక్కడే విలేకరులతో గోవింద్ మాట్లాడారు. తన సోదరి సోనమ్ నేరం చేసినట్లు రుజువైతే ఆమెను నేరుగా ఉరితీయాలని ఆయన డిమాండ్ చేశారు. కోర్టులో రాజా రఘువంశీ కుటుంబం తరపున వాదించేందుకు తానే ఓ న్యాయవాదిని నియమిస్తానని ఆయన వెల్లడించారు. కుమారుడిని కోల్పోయిన ఆ కుటుంబానికి తాను క్షమాపణ చెప్పానని గోవింద్ చెప్పారు.

# మృతుడు రాజా రఘువంశీ సోదరిపై విపరీతమైన ట్రోల్స్



మేఘాలయ హనీమూన్ హత్య కేసులో మృతి చెందిన రాజా రఘువంశి సోదరి సృష్టి రఘువంశిపై పెద్ద ఎత్తున ట్రోల్స్ వస్తున్నాయి. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా ఆమె తన అన్నయ్య కేసుకు సంబంధించి పెట్టిన కొన్ని రీల్స్‌పై నెటిజెన్లు తీవ్రంగా స్పందించారు. మీ అన్న చావును నువ్వు ఇలా వాడుకుంటున్నావా అంటూ దుమ్మెత్తి పోస్తున్నారు. అయితే తాజాగా ఈ ట్రోల్స్‌పై సృష్టి రఘువంశి స్పందించారు. విమర్శలకు గట్టిగా సమాధానం చెబుతూ మరీ ఓ వీడియోను పోస్ట్ చేశారు. "నేను మౌనంగా ఉండి ఉంటే, ఈ కేసును ఎప్పుడో మూసేసేవారు, హంతకులు కూడా దొరికేవారు కాదు" అంటూ అందులో ఆవేదన వ్యక్తం చేశారు. రాజా రఘువంశి భార్య సోనమ్ రఘువంశియే ఆమె ప్రియుడు రాజ్ కుశ్వాహా కోసం హత్య చేయించింది. హనీమూన్ పేరుతో మేఘాలయ తీసుకెళ్లి మరీ చంపేయించింది. అయితే ఈ విషయం వెలుగులోకి వచ్చిన తర్వాత నుంచి మృతుడి కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజా రఘువంశిని ఉత్తి పుణ్యానికే చంపేయించిన సోనమ్‌ను ఉరి తీయాలని డిమాండ్ చేస్తున్నారు. రాజా రఘువంశీ సోదరుడు, తల్లిదండ్రులు సహా అతడి సోదరి సృష్టి కూడా ఇదే కోరుతున్నారు. అయితే ఆమె ఓ సోషల్ మీడియా ఇన్‌ఫ్యూయెన్సర్ కాగా.. న్యాయం జరగాలని సోషల్ మీడియా వేదికగానే పోరాడుతున్నారు. అలాగే ఈ కేసులో నిందితులుగా తేలిన వారి ఫొటోలు, వీడియోలను కూడా బయట పెడుతూ వస్తున్నారు. ఇప్పటికే రాజ్ కుశ్వాహా తన సోదరుడి అంత్యక్రియల్లో పాల్గొన్న వీడియోతో పాటు.. తన వదిన, ప్రధాన నిందితురాలు అయిన సోనమ్‌కు సంబంధించిన వీడియోలను షేర్ చేసింది. ఆ వీడియో చూస్తుంటేనే రాజా రఘువంశితో సోనమ్‌కు ఇష్టం లేని పెళ్లి చేశారని అర్థం అయింది. అయితే సృష్టి షేర్ చేసిన ఈ వీడియోలపై నెటిజెన్లు తీవ్రంగా స్పందించారు. మీ అన్నయ్య చావును కూడా నువ్వు నీ అభివృద్ధి కోసం ఉపయోగించుకుంటున్నావా అని ప్రశ్నించారు. ఇది చాలా తప్పని కొందరు, ఇలాంటి సమయాల్లో నువ్వు నీ కుటుంబానికి తోడుగా ఉండాలని మరికొందరు వివరిస్తున్నారు. ఇలా పెద్ద ఎత్తున తనపై ట్రోల్స్ వస్తుండగా.. తాజాగా సృష్టి రఘువంశి వీటిపై స్పందించారు. తాను నోరు మెదపకపోయి ఉన్నా, నిందితుల వీడియోలను రిలీజ్ చేయకపోయి ఉన్నా చాలా ఆధారాలు మిస్సయ్యేవని చెప్పారు. తన సోదరుడిని చంపిన వారికి కఠిన శిక్ష పడాలనే ఉద్దేశంతోనే తాను ఇదంతా చేస్తున్నానని వెల్లడించారు. అందరికీ నిజానిజాలు తెలియాలనే తాను పలు వీడియోలు, రీల్స్ షేర్ చేసినట్లు స్పష్టం చేశారు. దీని వెనుక తనకు ఎలాంటి దురుద్దేశమూ లేదని.. ఇది జరగకముందే తనకు 4 లక్షల 81 వేల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారని చెప్పారుఅలాగే తనకు ఇలాంటి సమయంలో మద్దతు ఇవ్వాల్సింది పోయి విమర్శిస్తున్న వారిని చూస్తుంటే చాలా బాధగా అనిపిస్తుందని సృష్టి రఘువంశి అన్నారు. తన బాధను వ్యక్తం చేసేందుకు.. తన అన్నకు న్యాయం జరిగేలా చేసేందుకు తనకు ఉన్న ఒకే ఒక్క మార్గం ఇదేనని చెప్పారు. సృష్టి పోస్ట్ చేసిన ఈ వీడియోపై చాలా మంది స్పందించారు. ఒక కుటుంబం ఎదుర్కొంటున్న తీవ్ర విషాదాన్ని అర్థం చేసుకోకుండా, వారి భావోద్వేగాలను అపహాస్యం చేయడం ఎంతమాత్రం సరికాదని చెబుతూ ఆమెకు అండగా నిలుస్తున్నారు.

## ప్రపంచంలో అతి పెద్ద మతంగా క్రైస్తవం




**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న మతం ఇస్లాం అని ప్యూ రిసెర్చ్ సెంటర్ వెల్లడించింది. 2010-2020 మధ్య కాలంలో ప్రపంచ జనాభా తీరును పరిశీలించి, ఈ నెల 9న విడుదల చేసిన నివేదిక ప్రకారం, ఈ పదేళ్లలో ముస్లిం జనాభా 34.7 కోట్లు పెరిగింది. హిందువులు ప్రపంచ జనాభాలో 14.9 శాతంతో నాలుగో స్థానంలో ఉన్నారు. మిగిలిన మతాల్లో పెరిగిన జన సంఖ్య మొత్తం కన్నా ముస్లిం జనాభా పెరుగుదల అధికంగా ఉంది. క్రైస్తవం వృద్ధి చెందుతున్నప్పటికీ ప్రపంచ జనాభాలో వీరి సంఖ్య తగ్గుతున్నది. 2010-2020 మధ్య వీరు 12.2 కోట్ల మంది పెరిగారు. అయినప్పటికీ, 230 కోట్ల జనాభాతో ప్రపంచంలో అతి పెద్ద మతంగా క్రైస్తవం కొనసాగుతున్నది. ఏ మతంతోనూ సంబంధంలేనివారు ప్రపంచ జనాభాలో 24.2 శాతం ఉన్నారు. ప్రపంచ జనాభాలో 14.9 శాతంతో హిందువులు నాలుగో స్థానంలో ఉన్నారు. మధ్య ప్రాచ్యం-ఉత్తర ఆఫ్రికా ప్రాంతానికి వీరు వలస వెళ్లడంతో అక్కడ వీరి జనాభా 2010-2020 మధ్య 62 శాతం పెరిగింది.

# పాస్‌పోర్ట్ ఉంటే వీసా లేకపోయినా చైనాలోకి ఎంట్రీ.. ఆ 55 దేశాలకు మాత్రమే!



**బీజింగ్-నవభూమి:** అంతర్జాతీయ పర్యాటకం, వ్యాపార సంబంధాలను ప్రోత్సహించే లక్ష్యంతో చైనా కీలకమైన నిర్ణయం తీసుకుంది. 55 దేశాల పౌరులకు తమ 240 గంటల (10 రోజుల) వీసా రహిత ట్రాన్సిట్ విధానాన్ని విస్తరించినట్లు అధికారికంగా ప్రకటించింది. అంటే 240 గంటల పాటు పాస్‌పోర్ట్ ఉంటే వీసా లేకపోయినా ఆ దేశంలో ఉండవచ్చు. ఈ నూతన మార్పులు నేటి నుంచి అంటే జూన్ 12వ తేదీ గురువారం రోజు నుంచే అమల్లోకి రాబోతున్నట్లు వివరించింది. బీజింగ్ ప్రకటించిన ఈ కొత్త పాలసీతో చైనాలో ఆయా దేశాల ప్రజలు స్వల్పకాలిక పర్యటనలను సౌకర్యవంతంగా చేసుకోవచ్చు. చైనా తీసుకు వచ్చిన ఈ 240 గంటల వీసా రహిత ప్రయాణ వెసులుబాటు వల్ల ప్రయాణికులు చైనాలో పర్యాటక కార్యకలాపాలలో పాల్గొనవచ్చు. లేదంటే వ్యాపార సంబంధిత పనులను కూడా నిర్వహించుకోవచ్చు. ఇండోనేషియా, రష్యా, బ్రిటన్ వంటి కీలక దేశాలు ఈ 55 దేశాల జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో 144 గంటల వీసా రహిత ట్రాన్సిట్ విధానం అమలులో ఉండేది. కానీ చైనా ఇప్పుడు దాన్ని 240 గంటలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అంతేకాకుండా అర్హత కలిగిన దేశాల సంఖ్యను కూడా గణనీయంగా పెంచేసింది. ఈ విషయాన్ని షిన్హువా న్యూస్ ఏజెన్సీయే నేరుగా వెల్లడించింది. ఈ పథకం చైనాకు వచ్చేవారి వద్ద ధ్రువీకరించిన తేదీలతో ఇతర దేశాలకు వెళ్లే ఇంటర్ లైన్ టికెట్లు, అంతర్జాతీయ ప్రయాణాలకు సంబంధించిన పత్రాలు తప్పనిసరిగా ఉండాలి. అలాగే వీరు దేశంలోని 24 ప్రావిన్సుల్లోని 40 ఓపెన్ పోర్టుల ద్వారా చైనాలో ప్రవేశించవచ్చు. ముఖ్యంగా బీజింగ్, షాంఘై వంటి ప్రాంతాలను సందర్శించవచ్చు. అలాగే పర్యాటక స్థలాల సందర్శన, ఫ్యామిలీ విజిట్స్ వంటివి కూడా చేయొచ్చు. కానీ విద్య, పని, న్యూస్ రిపోర్టింగ్ వంటివి చేయాలంటే మాత్రం సరైన వీసాతో పాటు అధికారుల అనుమతి తప్పనిసరి. చైనా వివిధ దేశాలకు వీసా రహిత ప్రవేశాన్ని కల్పించడం ద్వారా తన ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేసుకోవడానికి, అంతర్జాతీయ సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి ప్రయత్నిస్తోంది.

కొవిడ్-19 తర్వాత ప్రపంచ వ్యాప్తంగా పర్యాటక రంగం దెబ్బతిన్న నేపథ్యంలో చైనా ఈ సరికొత్త విధానాన్ని తీసుకువచ్చి పర్యాటకులను ఆకర్షిస్తోంది. ఈ చర్యతో చైనాలో విదేశీ పెట్టుబడులు, వ్యాపార సమావేశాలు విపరీతంగా పెరుగుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. వీసా ప్రక్రియల సరళీకరణ, సమయం ఆదా వంటి ప్రయోజనాల వల్ల ప్రయాణికులు సులువుగా దీన్ని వాడుకుంటారని చెబుతున్నారు.



## ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1,200 మంది ఓటర్లు



చెన్నై: రానున్న శాసనసభ ఎన్నికల్లో ఒక పోలింగ్ కేంద్రంలో 1,200 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అర్చనా పట్నాయక్(%ూతీఎష్త్రుఅు ూఞ్అుఋుఎ%) తెలిపారు. సచివాలయంలోని ఎన్నికల కార్యాలయంలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ... పోలింగ్ కేంద్రాల్లోకి ఓటర్లు సెల్‌ఫోన్లు తీసుకెళ్లడంపై ఈసీ నిషేధం విధించిందని, అందుకోసం పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు సెల్‌ఫోన్ భద్రపరచుకొనేలా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయనున్నామన్నారు. ఓటర్లు అధికంగా ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి, వాటిని విభజించి ఒక్కో కేంద్రంలో 1,200 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టామని తెలిపారు. అందుకోసం అదనపు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేసే ప్రాంతాలు ఎంపిక చేస్తున్నామన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 68,400 పోలింగ్ కేంద్రాలుండగా, 1,200 మంది ఓటర్లకు ఒక కేంద్రం ఏర్పాటుతో పోలింగ్ కేంద్రాల సంఖ్య పెరిగే అవకాశముందని తెలిపారు. ఓటర్ల జాబితా పరిశీలన పనులు అక్టోబరు నుంచి ప్రారంభించనున్నట్లు అర్చనా పట్నాయక్ తెలిపారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in



## రేపిస్టును చంపి తగలబెట్టారు! లైంగికదాడి బాధిత మహిళల చర్య



**భువనేశ్వర్-నవభూమి:** తమపై సంవత్సరాల తరబడి అనేక సార్లు లైంగికదాడికి పాల్పడిన ఓ 60 ఏళ్ల కామాంధుడిని కొందరు మహిళలు నరికి చంపి అతని మృతదేహాన్ని తగలబెట్టారు. ఒడిశాలోని గజపతి జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకున్నట్టు పోలీసులు బుధవారం తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి 8 మంది మహిళలను పోలీసులు అరెస్టు చేశారు. తమ కుటుంబ సభ్యుడు కనిపించడం లేదని ఓ కుటుంబం ఫిర్యాదు చేయడంతో పోలీసులు గాలింపు మొదలు పెట్టారు. అయితే ఆ వ్యక్తిని నరికి చంపారని, అతని మృతదేహాన్ని కాల్చివేశారని తమకు తెలిసిందని మోహానా పోలీసు స్టేషన్ ఆఫీసర్ ఇన్‌చార్జ్ బసంత్ సేఠీ తెలిపారు. మృతుడి అస్థికలు, చితాభస్మాన్ని గ్రామానికి 2 కిలోమీటర్ల దూరంలో అటవీ ప్రాంతంలోని ఓ గుట్ట వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామ వార్డు సభ్యుడితోసహా 10 మందిని అరెస్టు చేసినట్లు ఆయన చెప్పారు. జూన్ 3వ తేదీ రాత్రి ఈ ఘటన జరిగిందని, అదే రోజు గ్రామంలో ఓ 52 ఏళ్ల వితంతువును ఆ వ్యక్తి రేప్ చేసినట్లు తెలిసిందని అధికారి చెప్పారు. గతంలో ఆ వ్యక్తి చేత అత్యాచారానికి గురైన బాధిత మహిళలతోసహా కొంతమంది మహిళలు సమావేశమై అతడిని హత్యచేయాలని నిర్ణయించుకున్నారు. అతని ఇంటికి వెళ్లిన మహిళలు ఆరు బయట నిద్రిస్తున్న అతడిని 52 ఏళ్ల బాధిత మహిళ ఇతర మహిళల సాయంతో నరికి చంపింది. ఇద్దరు పురుషులు కూడా మహిళలకు సాయపడ్డారని పోలీసు అధికారి చెప్పారు. నాలుగేళ్ల క్రితం భార్య మరణించగా అప్పటి నుంచి గ్రామంలోని మహిళలపై అతను అత్యాచారానికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ అఘాయిత్యాలకు చరమగీతం పాడాలన్న ఉద్దేశంతోనే అతడిని నరికి చంపామని వారు చెప్పారని ఆయన వివరించారు. కాగా, బాధిత మహిళలు ఎన్నడూ పోలీసు సాయం కోరలేదని జిల్లా ఎస్పీ తెలిపారు.

## బెంగళూరులో ఇద్దరు మహిళలపై ఆకతాయి వేధింపులు

**బెంగళూరు-నవభూమి:** కాంగ్రెస్ పాలిత కర్ణాటక రాజధాని బెంగళూరులో మహిళలకు భద్రత కరువవుతున్నది. నగరంలోని మిల్లర్ పార్క్‌లో ఇద్దరు మహిళలపై ఆకతాయి వేధింపులకు పాల్పడ్డాడు. జూన్ 6న రాత్రి 7 గంటల సమయంలో వాకింగ్‌కు వెళ్లిన తనను ఓ యువకుడు బలవంతంగా కౌగిలించుకుని, ముద్దుపెట్టుకున్నాడని ఓ మహిళ ఫిర్యాదు చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసుకుంటే చేసుకోవాలని నిర్లక్ష్యంగా మాట్లాడుతూ అక్కడి నుంచి పారిపోయాడని పేర్కొన్నారు. కాసేపటికే మరో మహిళ పట్ల కూడా ఇదేవిధంగా ప్రవర్తించినట్టు కేసు నమోదైంది. పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్నారు.

## కోరినవన్నీ కొనిచ్చి.. రైలుకు ఎదురెళ్లి.. నలుగురు కొడుకులతో తండ్రి ఆత్మహత్య

**ఫరీదాబాద్-నవభూమి:** భార్యతో గొడవపడిన భర్త తన నలుగురు పిల్లలతో కలిసి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హర్యానాలోని ఫరీదాబాద్‌లో మంగళవారం చోటుచేసుకుంది. బీహార్‌కు చెందిన మనోజ్ మహతో (45), ప్రియ భార్యాభర్తలు. భార్యకు వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో మహతో ఆమెతో తరచూ గొడవపడేవాడు. మంగళవారం మరోమారు గొడవ జరిగింది. అనంతరం పార్క్‌కు తీసుకెళ్తున్నట్టు చెప్పి మూడు నుంచి పదేండ్ల వయసున్న నలుగురు కుమారులతో కలిసి ఇంటి నుంచి బయలుదేరాడు. పార్క్‌కు బదులుగా వారిని రైల్వే ట్రాక్ వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ వారికి కోరినవన్నీ కొనిచ్చాడు. అనంతరం పిల్లలతో కలిసి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు.

## ప్రభుత్వాలు విఫలమైతే కోర్టుల జోక్యం

**న్యూఢిల్లీ-నవభూమి:** న్యాయపరమైన క్రియాశీలత భారత్‌లో కొనసాగడమేగాక ప్రధాన పాత్ర పోషిస్తుందని, అయితే అది న్యాయపరమైన ఉగ్రవాదంగా రూపాంతరం చెందరాదని సీజేఐ గవాయ్ అభిప్రాయపడ్డారు. పౌరుల హక్కులను పరిరక్షించడంలో శాసన వ్యవస్థ, కార్య నిర్వాహక వ్యవస్థ విఫలమైనట్లు తేలిన పక్షంలో న్యాయవ్యవస్థ జోక్యం తప్పదని సీజేఐ అన్నారు. మంగళవారం ఆక్స్‌ఫర్డ్ యూనియన్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో సీజేఐ గవాయ్ ప్రసంగిస్తూ న్యాయపరమైన క్రియాశీలత భారత్‌లో ఉండి తీరుతుందని, అయితే అది న్యాయపరమైన ఉగ్రవాదంగా మారకూడదని అన్నారు. కొన్ని సందర్భాలలో న్యాయవ్యవస్థ తన పరిధులు దాటి ప్రవేశించకూడని ప్రాంతంలోకి ప్రవేశించవలసి వస్తుందని, అరుదైన కేసులలో మాత్రమే న్యాయపరమైన సమీక్ష అధికారాన్ని ఉపయోగించాలని నొక్కి చెప్పారు.

## ఓఎంసీ కేసులో గాలి జనార్దన్‌రెడ్డికి బెయిలు



**హైదరాబాద్-నవభూమి:** ఓఎంసీ కేసులో దోషులైన గాలి జనార్దన్‌రెడ్డి, బీవీ శ్రీనివాసరెడ్డి, వీడీ రాజగోపాల్, మెఫజ్‌అలీ ఖాన్‌కు హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ.10 లక్షల వ్యక్తిగత బాండ్లతోపాటు మరో రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదని పేర్కొంది. వారితోపాటు ఓబుళాపురం మైనింగ్ కంపెనీలను దోషులుగా నిర్ధారిస్తూ సీబీఐ కోర్టు ఇచ్చిన తీర్పు అమలును నిలిపివేస్తూ జస్టిస్ కే లక్ష్మణ్ బుధవారం మధ్యంతర ఉత్తర్వులు వెలువరించారు. ఈ ఉత్తర్వులు జారీ చేయకపోతే ఎమ్మెల్యేగా గాలి జనార్దన్‌రెడ్డి ప్రజలకు సేవ చేయలేరని.. దీనికితోడు ఇప్పటికే సగానికి పైగా శిక్ష అనుభవించారని న్యాయమూర్తి పేరొన్నారు. రాజగోపాల్, శ్రీనివాస్‌రెడ్డి వయసు, వారి ఆరోగ్య పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్నట్టు తెలిపారు.

**శ్రీలక్ష్మి పిటిషన్‌లో కౌంటరు వేయండి**

ఓఎంసీ కేసులో 6వ నిందితురాలైన ఐఏఎస్ అధికారిణి ఎం శ్రీలక్ష్మి దాఖలు చేసిన క్రిమినల్ రివిజన్ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు సీబీఐకి నోటీసులు జారీచేసింది. సుప్రీంకోర్టు నెల రోజుల క్రితం ఆదేశించినా ఇప్పటికీ కౌంటర్ దాఖలు చేయలేదని ఆక్షేపించింది. ఇలాగే తాత్సారం చేస్తే తదుపరి విచారణకు సీబీఐ డీఐజీని హాజరుకావాలని ఆదేశాలు ఇవ్వాల్సివస్తుందని హెచ్చరించింది.

# ఎవరీ రాధిక సుబ్రమణియన్



**చెన్నై-నవభూమి:** ప్రస్తుతం సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ల హవా నడుస్తోంది. మారుమూల ప్రాంతాల్లో ఉన్న విషయాలను కూడా తెలుసుకుని.. ట్రావెల్ వ్లాగర్స్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు.. ప్రపంచానికి కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నారు. అయితే ఇలా చేయడం వల్ల వారు కొత్త కొత్త విషయాలను తెలుసుకోవడమే కాకుండా.. సోషల్ మీడియాలో బాగా ఫేమస్ అవుతున్నారు. దీంతో నాలుగు రాళ్లు వెనకేసుకుంటున్నారు. ప్రస్తుత ఏఐ టెక్నాలజీ యుగంలో.. అన్ని రంగాల్లోకి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రవేశిస్తోంది. ఈ క్రమంలోనే ఓ మీడియా సంస్థ.. వర్చువల్ ఇన్‌ఫ్లూయెన్సర్‌ను సృష్టించింది. ఆమెనే రాధిక సుబ్రమణియన్. భారతదేశ తొలి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత వర్చువల్ ఇన్‌ఫ్లూయెన్సర్ రాధిక సుబ్రమణియన్.. ఇప్పుడు వార్తల్లో నిలిచింది. దేశవ్యాప్తంగా రకరకాల ప్రాంతాల్లో పర్యటించి.. అక్కడ ఉన్న సంస్కృతి, సంప్రదాయాలు, వింతలు, విశేషాలను.. ఒక ట్రావెల్ వ్లాగర్ లాగా వీడియోలు, సమాచారాన్ని సేకరించి ఈ రాధిక సుబ్రమణియన్ అందిస్తుంది. అయితే ఈ రాధిక సుబ్రమణియన్‌ను.. కలెక్టివ్ ఆర్టిస్ట్స్ నెట్‌వర్క్ అనే మీడియా కంపెనీ రూపొందించింది. ఇక ఈ ఏఐ ట్రావెల్ ఇన్‌ఫ్లూయెన్సర్ తమిళంతోపాటు ఇంగ్లీష్ భాషల్లో మాట్లాడుతుంది. పాస్‌పోర్ట్, సెలవులు లేకుండానే నిత్యం కంటెంట్‌ను ఉత్పత్తి చేసే ఏఐ ఇన్‌ఫ్లుయెన్సర్‌లు బ్రాండ్‌లకు కొత్త అవకాశాలను అందిస్తున్నాయి. ఎప్పుడూ సెలవులు తీసుకోని, పాస్‌పోర్ట్ అవసరం లేని ఒక ట్రావెల్ ఇన్‌ఫ్లుయెన్సర్‌ను కలెక్టివ్ ఆర్టిస్ట్స్ నెట్‌వర్క్ ' రాధికా సుబ్రమణియన్ ' పేరుతో పరిచయం చేసింది. తమిళం, ఇంగ్లీష్ భాషల్లో మాట్లాడే ఈ ఏఐ ఆధారిత ఇన్‌ఫ్యూయెన్సర్.. భారతదేశం అంతటా పర్యటించి సంస్కృతి, గుర్తింపులకు సంబంధించిన స్టోరీలను తెలియజేసేందుకు రూపొందించారు. కావ్య మిలీనియల్ ఫోకస్డ్ ఏఐ ఇన్‌ఫ్లుయెన్సర్ తర్వాత వచ్చిన ఏఐ ఇన్‌ఫ్లుయెన్సర్ ఈ రాధిక సుబ్రమణియన్. అయితే కావ్య విలాసవంతమైన కంటెంట్‌ను తయారు చేసి అందించగా.. రాధిక సుబ్రమణియన్ జెన్ జీ విలువలను ప్రోత్సహించే సోలో ట్రావెలర్ కావడం గమనార్హం. ఇక ఈ రాధిక సుబ్రమణియన్ గురించి వివరిస్తూ.. కలెక్టివ్ ఆర్టిస్ట్స్ నెట్‌వర్క్ ఫౌండర్, గ్రూప్ సీఈఓ విజయ్ సుబ్రమణియన్.. కీలక విషయాలు వెల్లడించారు. రాధిక సుబ్రమణియన్ అందరికీ తెలిసిన, పరిచయం ఉన్న వ్యక్తిలా అనిపిస్తుందని.. అంటే నిజంగా ట్రావెల్ చేసిన ఒక ఫ్రెండ్ లాగా ఉంటుందని పేర్కొన్నారు. ఆమె ఆలోచనాత్మకంగా, స్వతంత్రంగా, తన చుట్టూ ఉన్న ప్రపంచంపై ఎంతో ఆసక్తితో ఉంటుందని తెలిపారు. రాధిక సుబ్రమణియన్ ద్వారా.. తాము ఒక కొత్త రకమైన ఏఐ ఇన్‌ఫ్లుయెన్సర్‌ను మాత్రమే అందిచకుండా.. హృదయం లోపలి నుంచి కథలను చెప్పగలిగే వ్యక్తి లాగా.. నెటిజన్లు తమను తాము చూసుకోగలిగే వ్యక్తిని సృష్టించాలనుకున్నామని విజయ్ సుబ్రమణియన్ వెల్లడించారు. కలెక్టివ్ ఆర్టిస్ట్స్ నెట్‌వర్క్ కంపెనీ వెల్లడించిన వివరాల ప్రకారం.. రాధిక సుబ్రమణియన్ కథ చెప్పే విధానం ఆమెను ఇన్‌ఫ్లుయెన్సర్ల ప్రపంచంలో స్పెషల్‌గా నిలుపుతుందని చెప్పింది. కంపెనీ చీఫ్ రెవెన్యూ ఆఫీసర్, బిగ్ బ్యాంగ్ సోషల్ సీఈఓ సుదీప్ సుభాష్ మాట్లాడుతూ.. రాధిక సుబ్రమణియన్ కేవలం ట్రెండ్‌లను అనుసరించి వైరల్ అయ్యేందుకు ప్రయత్నించడం లేదని.. ప్రతీది నిజంగా అర్థం చేసుకుంటుందని పేర్కొన్నారు. బ్రాండ్‌లకు రాధిక సుబ్రమణియన్ బంగారం లాంటిదని వెల్లడించారు. ఏఐ ట్రావెల్ ఇన్‌ఫ్లుయెన్సర్ అంటే ఒక వ్యక్తి కాదు. ఇది ఒక జనరేటివ్ డిజైన్, మెషిన్ లెర్నింగ్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ వంటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్‌ను ఉపయోగించి తయారు చేసిన ఒక కంప్యూటర్ ఆధారిత వర్చువల్ పాత్ర. ఇక ఇలాంటి ఏఐ ట్రావెల్ ఇన్‌ఫ్లూయెన్సర్లను నిర్దిష్ట వ్యక్తిత్వాలు, నేపథ్యాలు, కమ్యూనికేషన్ శైలితో రూపొందిస్తారు. సోషల్ మీడియాలో పోస్ట్‌లు చేయడానికి.. నెటిజన్లతో సంభాషించడానికి, కంటెంట్‌ను తయారు చేయడానికి సాధారణ ఇన్‌ఫ్లూయెన్సర్లను అనుమతిస్తారు. ఇక ఇలాంటి ఏఐ ఇన్‌ఫ్లుయెన్సర్‌లను.. నెటిజన్ల అభిరుచులకు అనుగుణంగా మార్చుకోవచ్చు.

**జర్మనీలో కూడా ఇలాంటి అవతార్**

అయితే ఈ ఏఐ ట్రావెల్ ఇన్‌ఫ్లూయెన్సర్ తొలిసారి మన దేశంలో సందడి చేస్తుండగా.. 2023లోనే జర్మనీలో రూపొందించారు. జర్మన్ నేషనల్ టూరిస్ట్ బోర్డ్ 'ఎమ్మా' అనే ఏఐ ఆధారిత ట్రావెల్ అంబాసిడర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. జర్మనీలో టూరిజాన్ని ప్రోత్సహించేందుకు ఎమ్మాను సృష్టించారు. ఈ ఎమ్మా ఏఐ ట్రావెల్ అంబాసిడర్.. 20 భాషల్లో అనర్గళంగా మాట్లాడగలదు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న టూరిస్ట్‌లను డిజిటల్‌గా ఆకర్షించేందుకు రూపొందించిన వినూత్నమైన, ఇంటరాక్టివ్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఎమ్మాను పేర్కొంటున్నారు.

## ఆ ప్రాంతాల్లో సిగరెట్ తాగితే రూ.1000 జరిమానా



**రాయ్‌పూర్-నవభూమి:** ఝార్ఖండ్‌లో పొగాకు వాడకంపై కఠిన చర్యలు తీసుకుంటూ ఆ రాష్ట్ర ప్రభుత్వం కొత్త చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేసినా, పొగాకు ఉత్పత్తులను సేవించినా లేదా ఉమ్మినా రూ.1,000 జరిమానా విధించబోతున్నట్లు స్పష్టం చేసింది. అంతేకాకుండా రాష్ట్రంలోని హుక్కా బార్‌లను కూడా పూర్తిగా నిషేధిస్తున్నట్లు వివరించింది. సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులకు ఝార్ఖండ్ సవరణ బిల్లు 2021కి తాజాగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. ఈ మేరకే ఝార్ఖండ్ రాజ్ భవన్ సెక్రటేరియెట్ ఇందుకు సంబంధించి ప్రకటనను విడుదల చేసింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కీలకమైన 'సిగరెట్స్ అండ్ అదర్ టొబాకో ప్రొడక్ట్స్ (ప్రొహిబిషన్ ఆఫ్ అడ్వర్టైజ్‌మెంట్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ట్రేడ్ అండ్ కామర్స్, ప్రొడక్షన్, సప్లై, అండ్ డిస్ట్రిబ్యూషన్) జార్కండ్ సవరణ బిల్లు-2021'కి ఆమోదం తెలిపారు. అయితే గతంలో బహిరంగ ప్రదేశాల్లో పొగాకు కాలిస్తే.. రూ.200 జరిమానా ఉండగా.. ఇప్పుడు దాన్ని ఐదు రెట్లకు పెంచి రూ.1000 చేశారు. అలాగే ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారికి జైలు శిక్ష కూడా విధించే అవకాశం ఉన్నట్లు సవరణలో వెల్లడించారు. 2021లో అప్పటి హేమంత్ సోరెన్ ప్రభుత్వం ఈ బిల్లును ప్రవేశ పెట్టింది. మొదట రూ.10,000 జరిమానా విధించాలని ప్రతిపాదన ఉన్నప్పటికీ.. దాన్ని ఆమోదించలేరు. రాష్ట్ర ప్రభుత్వం నుండి ఆదేశాలు అందిన తర్వాత జిల్లా ఆరోగ్య శాఖ ఈ కొత్త చట్టాన్ని అమలు చేస్తుందని రాంచీ సివిల్ సర్జన్ డాక్టర్ ప్రభాత్ కుమార్ తెలిపారు. పొగాకు వినియోగాన్ని తగ్గించి, ప్రజారోగ్యాన్ని పరిరక్షించడమే ఈ చట్టం ముఖ్య ఉద్దేశ్యం అని వివరించారు. ముఖ్యంగా యువతను హుక్కా బార్‌ల వ్యసనం నుండి దూరం చేయాలనే లక్ష్యంతో ఈ నిషేధం విధించారు. ఈ కఠినమైన చర్యల ద్వారా రాష్ట్రంలో పొగాకు వినియోగం గణనీయంగా తగ్గుతుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం కూడా దేశంలో పొగాకు వినియోగం తగ్గాలని చాలానే జాగ్రత్తలు తీసుకుంటోంది. అందులో భాగంగానే.. ధూమపాన ప్రియులకు చేదువార్త చెప్పేందుకు సిద్ధం యింది. త్వరలోనే సిగరెట్లతో పాటు పొగాకు ఉత్పత్తుల ధరలను పెంచాలని భావిస్తోంది. పన్ను ఆదాయం తగ్గకుండా చూసేందుకు కేంద్ర ప్రభుత్వం సిగరెట్, పొగాకు ఉత్పత్తులకు జీఎస్టీ ధరలను పెంచాయలని చూస్తోంది. ప్రస్తుతం వీటిపై జీఎస్టీ 28 శాతం ఉండగా.. ఇతర ఛార్జీలతో కలిసి 52 శాతం పన్నులు విధిస్తున్నారు. త్వరలోనే జీఎస్టీని 28 శాతం నుంచి 40 శాతానికి పెంచాలని కేంద్రం ఆలోచిస్తోంది. దీంతో సిగరెట్లు సహా పొగాకు ఉత్పత్తులపై ధరలు అధికంగా పెరగనున్నాయి.

### దేశంలోనే తొలిసారి.. 9 అంతస్థుల భవనంలో

# మెట్రో రైలు పరుగులు



**చెన్నై-నవభూమి:** దేశంలోనే మొట్టమొదటిసారిగా తొమ్మిది అంతస్థుల భవన సముదాయంలో నిర్మించే రైలు పట్టాలపై మెట్రోరైలు పరుగులు తీయనుంది. ఈ అద్భుత దృశ్యం తిరుమంగళం మెట్రో రైల్వేస్టేషన్ వద్ద ఆవిష్కృతం కాబోతోంది. రాజధాని నగరం చెన్నైలో రెండో దశ మెట్రో రైలు ప్రాజెక్టులో భాగంగా తిరుమంగళం వద్ద షాపింగ్‌మాల్స్‌తో కూడిన బహుళ అంతస్థుల భవన సముదాయం మధ్య నుంచి వెళ్లేలా మెట్రోరైలు మార్గాన్ని నిర్మిస్తున్నారు.

ఈ కొత్త రైలు మార్గానికి సంబంధించిన తొమ్మిది అంతస్థుల భవనసముదాయం, టవర్ల ఊహాచిత్రాలను చెన్నై మెట్రోరైల్వే (సీఎంఆర్ఎల్) బుధవారం విడుదల చేసింది. నగరంలో రెండో దశ మెట్రోరైలు ప్రాజెక్టును 116.1 కి.మీ వరకు మూడు మార్గాలలో నిర్మిస్తున్న విషయం తెలిసిందే. వీటిలో మాధవరం - షోళింగనల్లూరు మార్గంలోని తిరుమంగళం జంక్షన్ వద్ద మెట్రో రైల్వేస్టేషన్‌తో పాటు షాపింగ్‌మాల్స్‌తో 9 అంతస్థులతో ఏ, బీ, సీ పేర్లతో మూడు భవనాలు నిర్మించనున్నారు.

ఈ భవన సముదాయంలో రెండంతస్థుల రైల్వేస్టేషన్ కూడా నిర్మితమవుతుంది. ఈ భవన సముదాయలతో కూడిన మెట్రో రైల్వేస్టేషన్ నిర్మాణ పనులకు సంబంధించి త్వరలో టెండర్లను ఆహ్వానించనున్నారు. కొత్తగా నిర్మించబోయే ఈ భవనంలో పలు కార్యాలయాలు, చిల్లర దుకాణాలు, మూడు సొరంగమార్గాల పార్కింగ్ స్థలాలుంటాయి. భారతదేశంలోనే వాణిజ్య సముదాయాలు కలిగిన భవనంలో ప్రయాణించేలా మెట్రోరైలు మార్గాన్ని నిర్మించడం ఇదే ప్రప్రథమమని మెట్రో రైల్వే అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం జపాన్, చైనా దేశాల్లోనే భవన సముదాయాల మధ్య నుంచి రైళ్లు వెళుతున్నాయని, ఆ రీతిలోనే నగరంలోనూ బహుళ అంతస్థుల భవన సముదాయంలోకి మెట్రో రైళ్లు దూసుకెళతాయని తెలిపారు. ఈ భవనసముదాయంలోని నాలుగో అంతస్థులో మెట్రోరైళ్లు ప్రయాణిస్తాయని, మూడో అంతస్థులో ప్రయాణికుల వెయింటింగ్ హాల్స్ ఉంటాయని పేర్కొన్నారు.

## యోగాకు భారీ ఏర్పాట్లు.. వివరాలు వెల్లడించిన కేంద్రమంత్రి




**న్యూఢిల్లీ-నవభూమి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నంలో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ వివారాలను కేంద్ర ఆయూష్ శాఖ సహాయ మంత్రి ప్రతాప్ రావ్ జాదవ్ వివరించారు. ఈరోజు (గురువారం) మీడియాతో మాట్లాడుతూ.. అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమంలో భాగంగా ఉదయం 5:30 గంటల నుంచి ప్రజలకు యోగా వేదిక వద్దకు చేరుకోవడానికి అనుమతి ఉంటుందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉదయం 6:30 గంటల నుంచి 7:30 గంటల వరకు యోగా కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ప్రధాని ప్రసంగం తర్వాత కార్యక్రమం ముగునస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీతో పాటుగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా పాల్గొంటారని అన్నారు. 5 లక్షల మంది ఈ కార్యక్రమానికి హాజరవుతారని ఏపీ ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. దేశ వ్యాప్తంగా లక్ష కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. ఇప్పటి వరకు మన దేశంలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమాలలో 2018 సంవత్సరంలో ఉత్తరాఖండ్ డెహ్రాడూన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 60 వేల మంది ప్రజలు పాల్గొన్నారని తెలిపారు.

అంతర్జాతీయంగా పలు దేశాల్లో యోగా దినోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. విశాఖపట్నంలో జరిగే యోగా కార్యక్రమంలో 40 దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారని వెల్లడించారు.

45 నిమిషాల పాటు యోగా కార్యక్రమం ఉంటుందన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వివిధ రాష్ట్రాల్లో నిర్వహించే కార్యక్రమాల్లో ముఖ్యమంత్రులు, మంత్రులు, అధికారులు పాల్గొంటారని.. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో లైవ్ ప్రసారం జరుగుతుందని కేంద్రమంత్రి ప్రతాప్ రావ్ జాదవ్ తెలియజేశారు.

## మేమూ ఎక్కువ సీట్లు అడుగుతాం..



చెన్నై: వచ్చే యేడాది జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో కూటమి నుంచి తమకు మరిన్ని సీట్లు కేటాయించాలని డీఎంకే అధిష్టానాన్ని కోరుతామని డీపీఐ నేత తొల్ తిరుమావళవన్ ప్రకటించారు. చిదంబరం లోక్‌సభ నియోజకవర్గంలో గురువారం ఉదయం పర్యటించిన ఆయన వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పినాత్తూరులో నిర్మించిన సమగ్ర తాగునీటి పథకాన్ని ప్రారంభించారు. డీఎంకే కూటమిలో ఉన్న సీపీఎం ఈసారి పది సీట్లు కోరుతుండటాన్ని ఆయన సమర్థించారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రతి ఎన్నికల్లో సీట్లు పెంచాలని మిత్రపక్షాలన్నీ కూటమికి నాయకత్వం వహిస్తున్న డీఎంకేను కోరటం సహజమని, సీట్ల కేటాయింపు కమిటీ ద్వారా మిత్రపక్షాలు అధికంగా సీట్లు కేటాయించాలని ప్రతిపాదనలు చేస్తుంటాయని చెప్పారు. రాష్ట్రంలో సుదీర్ఘకాలంగా డీఎంకే మిత్రపక్షాలన్నీ ఆ పార్టీ నాయకత్వంలోని కూటమిలోనే కొనసాగుతున్నాయని, సీట్ల కేటాయింపులపై అసంతృప్తి ఉన్నా మతతత్త్వ శక్తుల నుండి ప్రజలను కాపాడడానికి బీజేపీ - అన్నాడీఎంకేను ఓడించాలన్న ఏకైక తీర్మానంతో ఎన్నికల బరిలోకి దిగుతున్నామని స్పష్టం చేశారు. కేంద్రమంత్రి అమిత్‌షా అదే పనిగా రాష్ట్రంలో పలుమార్లు పర్యటించినా బీజేపీకి ఓట్లు రాలవన్నారు.

రాష్ట్రంలో రానున్నది బీజేపీ- అన్నాడీఎంకే సంకీర్ణ ప్రభుత్వమేనని అమిత్‌షా స్పష్టంగా ప్రకటించినా అన్నాడీఎంకే నేతలు ఆ ప్రకటనపై మౌనం దాల్చడం సిగ్గుచేటన్నారు. బీజేపీ అధికారంలో భాగస్వామ్యం ఇచ్చేందుకు అన్నాడీఎంకే సిద్ధంగా ఉన్నట్లు స్పష్టమవుతోందన్నారు. ప్రస్తుతం అన్నాడీఎంకే, బీజేపీ మధ్య పొత్తు ఖరారైనప్పటికీ, అన్నాడీఎంకే మిత్రపక్షాలైన పీఎంకే, డీఎండీకే కొత్తగా ఏర్పాటైన కూటమిలో చేరేందుకు తటపటాయిస్తున్నాయన్నారు. ఏది ఏమైనప్పటికీ ఈ సారి శాసనసభ ఎన్నికల్లో మునుపటి కంటే అధిక సంఖ్యలో సీట్లు కేటాయించాలని డీఎంకే అధిష్టాంపై ఒత్తిడి చేస్తామని తిరుమావళవన్ పేర్కొన్నారు.

## ఈపీఎస్ నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం




చెన్నై: రాష్ట్రంలో రానున్న శాసనసభ ఎన్నికల అనంతరం అన్నాడీఎంకే అధినేత ఈపీఎస్() నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటవుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ స్పష్టం చేశారు. తిరునల్వేలి జిల్లా బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... తమ కూటమిలో పలు పార్టీలు చేరే అవకాశం ఉందని, దానికి సంబంధించి చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఏది బలమైన పార్టీయో తెలుస్తుందన్నారు. తమదే బలమైన కూటమి అని చెబుతున్న డీఎంకే, ఒంటరిగా పోటీచేసేందుకు సిద్ధమేనా అని ప్రశ్నించారు. మదురైలో జరుగనున్న మురుగన్ మహానాడుకు సుమారు 4 లక్షల మందికి పైగా వచ్చే అవకాశముందని తెలిపారు. ఈ మహానాడులో డీఎంకే, అన్నాడీఎంకే సహా వివిధ పార్టీల నుంచి మురుగన్ భక్తులు పాల్గొంటారని తెలిపారు. గత 11 సంవత్సరాల్లో రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్లను ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం అందజేసిందని, ఈ విషయాన్ని ప్రజలకు తెలినివ్వకుండా డీఎంకే ప్రభుత్వం వారిని మభ్యపెడుతున్నారని ఆరోపించారు. తమిళ భాషకు మోదీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, తిరుక్కురళ్‌ను 63 భాషల్లోకి అనువదించి ప్రపంచం మొత్తానికి తీసుకెళ్లిన ఘనత ప్రధాని మోదీకి దక్కుతుందన్నారు. ప్రస్తుతం డీఎంకే కూటమిలో వున్న ఓ పార్టీ త్వరలో బీజేపీ కూటమిలోకి వస్తుందని కేంద్రమంత్రి ఎల్.మురుగన్ వెల్లడించారు. ఈ విషయమై కేంద్రమంత్రి మాట్లాడుతూ... మాజీ ప్రధానమంత్రి వాజ్‌పేయి నేతృత్వంలోని ఎన్డీఏ అధికారంలో ఉన్న సమయంలో ఆ పార్టీ బీజేపీ కూటమిలో ఉందని తెలిపారు. డీఎంకే కూటమి త్వరలోనే విచ్ఛిన్నమవుతుందని, రానున్న శాసనసభ ఎన్నికల్లో ఆ కూటమికి ఘోరపరాజయం తప్పదన్నారు. కొత్తగా కూటమిలో చేరే పార్టీలపై వేచి ఉండాలని, అన్నీ ఇప్పుడే చెబితే రాజకీయాల్లో అంచనాలు ఉండవని కేంద్రమంత్రి సరదాగా వ్యాఖ్యానించారు.

# నవతార





## స్పైడర్ ఉండాల్సిందే

మనం ఇంట్లో అందమైన మొక్కల కుండీలను పెట్టుకుంటూ ఉంటాం. ఈ మొక్కలు ఇల్లంతా తాజాదనాన్ని వ్యాపింపజేస్తూ ఉంటాయి. వెడల్పాటి కుండీలో తోటమట్టిని నింపి చిన్న మొక్కను నాటితే చాలు. కొద్ది సమయంలోనే గుబురుగా పెరుగుతుంది. బాల్కనీ గోడమీద, కిటికీల దగ్గర కుండీలు అమర్చుకోవచ్చు. ఈ మొక్కకు నేరుగా ఎండ తగలకూడదు. కొద్దిగా వెలుగు సోకితే చాలు. గది ఉష్ణోగ్రత వద్ద వేగంగా పెరుగుతుంది. దీనికి నీరు ఎక్కువగా పోయకూడదు. మట్టి తేమగా ఉందో లేదో చూసుకుని రెండు రోజులకు ఒకసారి నీళ్లు చిలకరిస్తే సరిపోతుంది. క్లోరిన్ కలిపిన మంచినీరు కాకుండా బోరు నీళ్లు, బాగా శుద్ధి చేసిన నీరు లేదంటే వర్షపు నీటిని మాత్రమే కొద్దిగా చల్లాలి. స్పైడర్ మొక్క కుండీలను వంటగది, పడక గది, పిల్లలు చదువుకునే గదుల్లో పెట్టుకోవచ్చు. హాల్లో సోఫాకు ఇరుపక్కలా పెట్టినా అందంగా కనిపిస్తుంది. వంటగది నుంచి వెలువడే వేడి, ఘాటైన వాసనలను ఈ మొక్క పీల్చుకుంటుంది. ఆక్సిజన్‌తోపాటు తేమనీ విడుదల చేస్తుంది. దీనివల్ల ఇల్లంతా చల్లగా ఉన్నట్లు అనిపిస్తుంది. స్పైడర్ మొక్క ఆకులు ఇంట్లో గాలిని శుద్ధి చేస్తాయి. దీంతో ఒత్తిడి, ఆందోళన తగ్గి ప్రశాంతంగా నిద్ర పడుతుంది. మెదడు చురుకుగా పనిచేయడంతోపాటు ఏకాగ్రత పెరుగుతుంది. ఏసీ ఉన్న గదిలో ఈ మొక్కను ఏర్పాటు చేసుకుంటే శ్వాసకోశ సమస్యలు రావు. ఇంట్లో స్పైడర్ మొక్కను పెంచడం వల్ల ఈగలు, దోమలు, ఇతర క్రిమి కీటకాలు లోనికి రావు.

## కంటి ఆరోగ్యాన్ని కాపాడే ఎరుపు రంగు ఆహారాల గురించి తెలుసా..!



చూడడానికి అందంగా ఆకర్షణగా కనిపించే దానిమ్మ, టమాటా వంటి వాటిలో ఎన్ని పోషకాలు దాగున్నాయో..తెలుసా. రెడ్ కలర్ ఫుడ్స్ అందంగా కనిపించడమే కాకుండా ఆరోగ్యంగా కూడా ఉంటాయి. గుండె ఆరోగ్యానికి ఎరుపు రంగు ఆహారాలు మేలు చేస్తాయి...ఆరోగ్యకరమైన ఎరుపు రంగు ఆహారాలలో కూరగాయలు, పండ్లను గురించి అవి ఇచ్చే ఆరోగ్యం గురించి తెలుసుకుందాం.

**ఎరుపు రంగు ఆహారాలు ఏమిటి?**

ఎరుపు రంగు ఆహారాలు పండ్లు, కూరగాయలు ప్రధానంగా లైకోపీన్, ఆంథోసైనిన్‌లు, బీటాలైన్‌ల వంటి సమ్మేళనాల ఉనికి కారణంగా ఎరుపు వర్ణద్రవ్యాన్ని కలిగి ఉంటాయి. ఎర్రటి ఫుడ్స్‌లోని సమ్మేళనాలు శక్తివంతమైన రంగును కలిగి ఉంటాయి. ఇవి అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి.

**1. గుండె ఆరోగ్యం**

రెడ్ ఫుడ్స్, ముఖ్యంగా టొమాటోలు, లైకోపీన్‌ను కలిగి ఉంటాయి, ఇది గుండె రక్షిత లక్షణాలకు ప్రసిద్ధి చెందింది. లైకోపీన్ రక్తపోటును తగ్గిస్తుంది. హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. బయోసైన్స్ రీసెర్చ్‌లో ప్రచురించబడిన 2021 అధ్యయనంలో పుచ్చకాయలో లభించే పొటాషియం, గుండె జబ్బులను ఎదుర్కోవడంలో సహాయపడుతుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుందని తేల్చింది.

మంచి జీర్ణ ఆరోగ్యానికి వేసవిలో తీసుకోవాల్సిన డ్రింక్స్ ఇవే..

**2. క్యాన్సర్ నివారణ**

రెడ్ ఫుడ్స్‌లోని యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతాయి. ఇవి రొమ్ము, ప్రోస్టేట్ క్యాన్సర్‌తో సహ కొన్ని క్యాన్సర్‌ల ప్రమాదాన్ని సమర్థవంతంగా తగ్గిస్తాయి.

**3. మెరుగైన దృష్టి**

స్ట్రాబెర్రీ, పుచ్చకాయ వంటి ఎర్రటి పండ్లలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. అవి కంటి ఆరోగ్యాన్ని పెంచుతాయి.

**4. రోగనిరోధక శక్తి పెరిగింది**

రెడ్ ఫుడ్స్‌లో విటమిన్ సి ఉండటం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అవి శరీరానికి అంటువ్యాధులతో పాటు అనారోగ్యాలను కూడా దూరం చేస్తాయి.

**5. ఆరోగ్యకరమైన చర్మం**

రెడ్ ఫుడ్స్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మ ఆరోగ్యానికి కూడా తోడ్పడతాయి.

**6. జీర్ణ ఆరోగ్యం**

రాస్ప్బెర్రీస్, చెర్రీస్ వంటి ఎర్రటి పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. అవి జీర్ణక్రియకు సహాయపడతాయి.

**గమనిక:** పైన పేర్కొన్న వివరాలను ఆరోగ్య నిపుణులు అందించిన సమాచారం మేరకు ఇవ్వడం జరిగింది. దీనిని ధృవీకరించడం లేదు. ఆరోగ్య నిపుణుల సలహాల మేరకు పైన చెప్పిన సూచనలు పాటించాలి.

## అధిక బరువు తగ్గించే శాకాహారం



బరువు తగ్గాలని ఆశించేవారు దానికి తగిన విధంగా ఆహారంలో కూడా మార్పులు చేయడం ముఖ్యం. దీనిలో శాకాహారాన్ని తీసుకుంటే ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. పుష్కలంగా కూరగాయలతో సమతుల్య ఆహారం తీసుకోవడం ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడం ప్రభావవంతమైన మార్గాలలో ఒకటి. కూరగాయలు సహజంగా తక్కువ కేలరీలను కలిగి ఉంటాయి, అయితే వీటిలో నీరు, ఫైబర్ అధికంగా ఉంటాయి, ఇది కడుపును ఎక్కువసేపు నిండుగా ఉంచడంలో సహాయపడుతుంది. అదనంగా, కూరగాయలలో విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి, ఇవి మంటను తగ్గించగలవు. దీర్ఘకాలిక ఆరోగ్య పరిస్థితుల నుండి రక్షించగలవు. ఆరోగ్యకరమైన, స్థిరమైన బరువు తగ్గించే విధానంలో కూరగాయలు ఉత్తమమైనవి.

1. బచ్చలికూర, కాలే, స్విస్ చార్డ్, కొల్లార్డ్ గ్రీన్స్‌లో కేలరీలు తక్కువగా ఉంటాయి. అలాగే పోషకాలు అధికంగా ఉంటాయి.
2. బీన్స్, కాయధాన్యాలు, చిక్ పీస్ మొక్కల ఆధారిత ప్రోటీన్, ఫైబర్ అద్భుతమైన మూలాలు.
3. క్వినోవాలో పూర్తిగా ప్రోటీన్ ఉంటుంది. అంటే ఇందులో మొత్తం తొమ్మిది ముఖ్యమైన అమైనో ఆమ్లాలు ఉంటాయి. ఇది ఫైబర్ ను కూడా ఎక్కువగా ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది.
4. బాదం, వాల్ నట్స్, చియా గింజలు, అవిసె గింజలలో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్లు, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి క్యాలరీలు దట్టంగా ఉన్నప్పటికీ కడుపునిండిన ఫీలింగ్‌ని ఇస్తాయి.
5. సాధారణ పెరుగుతో పోలిస్తే గ్రీకు పెరుగులో ప్రోటీన్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి కడుపు నిండుగా ఉన్న ఫీలిగ్‌ని ఇస్తాయి. బరువు తగ్గడానికి సహాయపడతాయి.
6. ఈ సోయా ఆధారిత ఉత్పత్తులు మొక్కల ఆధారిత ప్రోటీన్ అద్భుతమైన మూలాలు. వీటిని తీసుకోవడం వల్ల బరువు తగ్గిన ఫీలింగ్ ఉంటుంది.

దంతాలను సహజంగా తెల్లగా చేసుకోవడం ఎలా..!

జుట్టు పెరగాలంటే ఈ సమస్యలు దాటేస్తే చాలు.. ఒత్తైన జుట్టు మీ సొంతం..!

ఆలోచనను మార్చి పడేసే పాప్‌కార్న్ బ్రెయిన్ గురించి తెలుసా..!

7. స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీస్, రాస్బెర్రీస్ వంటి బెర్రీలలో కేలరీలు తక్కువగా ఉంటాయి. ఫైబర్ అధికంగా ఉంటాయి. ఇవి యాంటీ ఆక్సిడెంట్లలో కూడా పుష్కలంగా ఉంటాయి. ఇవి మంటను తగ్గిస్తాయి.
8. బ్రౌన్ రైస్, క్వినోవా, బార్లీ, ఓట్స్ వంటి తృణధాన్యాలలో ఫైబర్ పోషకాలు పుష్కలంగా ఉంటాయి.
9. అవకాడోలో ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్స్, విటమిన్లు, ఖనిజాలు అధికంగా ఉంటాయి.
10. ఇందులో క్యాలరీలు దట్టంగా ఉన్నప్పటికీ ఇది సలాడ్లు, శాండ్ విచ్, టోస్ట్‌కు సరిగ్గా సరిపోతుంది.

## అమ్మ సంకల్పమే బంగారపు బాట





అడవుల్లో ప్రారంభమైన ఒక చిన్న పయనం... పేదరికం, పోరాటం మధ్యలో సాగిన ప్రయాణం కానీ కలల తలపులా ఆగని పరుగులెత్తిన ఆదివాసీ ముద్దుబిడ్డ రజిత ఇప్పుడు ఆసియా ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణాన్ని సాధించి దేశ గర్వంగా నిలిచింది. ఈ బంగారు విజయం వెనుక, కూలి చేసుకుంటూ పిల్లలకు చదువు చెప్పాలన్న తల్లి భద్రమ్మ సంకల్పం ఒక వెలుగు కిరణం లా నిలిచింది.

ఆ ఊరికి వెళ్లాలంటే... అభయారణ్యంలో పది కిలోమీటర్లు నడవాలి. అలా అడవిలో ఆ పాదాలే ఆమెకు పరుగును నేర్పాయి. క్రీడారంగాన్ని పరిచయం చేశాయి. తన తపనకు, కఠోర సాధనకు దాతల సాయం తోడైంది... ఇప్పుడు అండర్-20 వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో సత్తా నిరూపించుకునేందుకు కెన్యాకు పయనమైంది. ఆమే.. కుంజా రజిత(%ఖఖచీజీూ =ూజీ×ునూ%). అడవి నుంచి అంతర్జాతీయ స్థాయికి చేరిన రజిత జీవన పయనం.

ఆ ప్రాంతంలో ఎక్కువ మంది ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చినవారే! అక్కడి ప్రజలకు పూట గడవటమే గగనం. అలాంటి దుర్భర పరిస్థితులలో పెరిగిన ఆదివాసి అమ్మాయి రజిత. ఆసియా అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ 400 మీటర్ల రిలేలో స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. ఈ నేపథ్యంలో ఆమె తల్లి భద్రమ్మను పలకరించింది.

"అవునా.. నా బిడ్డ బంగారం గెలిచిందా.." భద్రమ్మకు రజిత స్వర్ణం గెలిచిందని చెప్పినప్పుడు ఆమె అన్న తొలిమాటలు. అక్కడే ఉన్న ప్లాస్టిక్ ఫ్రేమ్‌లో రజిత ఫొటో చూసినప్పుడు ఆమె కళ్లలో ఒక గర్వం. తాను ఎంతో కష్టపడి పెంచిన చిన్నతల్లి ఏదో సాధించిందనే ఆనందం. భద్రమ్మకు ఆసియా అథ్లెటిక్ ఛాంపియన్‌షిప గురించి తెలియదు. ఒలింపిక్స్ గురించి తెలియదు. కేవలం తన చిట్టి తల్లి ఏదో ఒక గొప్ప పని చేసిందని మాత్రమే తెలుసు. రజిత స్వర్ణం వెనక భద్రమ్మ కృషి ఎన్నడూ మరవలేనిది. వాస్తవానికి భద్రమ్మ, ఆమె భర్త మారయ్యలది చత్తీసగఢ్ దంతేవాడ జిల్లాలోని బుసరాస్ గ్రామం. కరువు కాటకాలు రావటంతో ఆమె కుటుంబం అక్కడి నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండంలో రామచంద్రాపురం అనే గ్రామానికి వలస వచ్చింది. రామచంద్రాపురం చుట్టూ అడవులు. రోజూ అడవిలోకి వెళ్లి ఆహారాన్ని సంపాదించుకోవాల్సిన పరిస్థితి. రజిత పుట్టిన రెండేళ్లకు మారయ్య మరణించారు. దీంతో కుటుంబ భారమంతా భద్రమ్మపైనే పడింది.

**దిన దిన గండం...**

రోజూ కూలికి వెళ్లి సంపాదిస్తే కానీ పిల్లలకు కనీసం భోజనం కూడా పెట్టలేని పరిస్థితి. సాధారణంగా ఇలాంటి పరిస్థితుల్లో ఇతరులైతే బెంబేలు పడిపోతారు. కుదేలవుతారు. కానీ భద్రమ్మ వేటికీ తలవంచలేదు. జీవితంతో పోరాడాలనుకుంది. రోజూ కూలికి వెళ్లేది. అప్పుడప్పుడు అడవిలోకి వెళ్లి ఫలసాయం సంపాదించుకు వచ్చేది. వాటితో తాను తిన్నా.. తినకపోయినా పిల్లలకు పెట్టేది. ఆ సమయంలోనే తన పిల్లలను బాగా చదివించుకోవాలనే భావన భద్రమ్మలో బలంగా పడింది. దీనితో పిల్లలను స్కూలుకు పంపాలనుకుంది. వలసగ్రామం కావటంతో రామచంద్రపురంలో స్కూలు లేదు. దూరంగా ఉన్న ప్రాంతాలకు పంపి చదివించాలనే డబ్బులు లేవు. ఈ సమయంలో సమీపంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవల్‌పమెంట్ సొసైటీ నిర్వహిస్తున్న అరూపే ఉన్నత పాఠశాల ఆమెకు ఆసరా అయింది.

**చిన్ననాటి నుంచే...**

చిన్నప్పటి నుంచి రజిత ఇతరులతో పోలిస్తే అలసట లేకుండా వేగంగా పరుగెట్టేది. పరుగులో ఆమెకు సహజమైన ప్రతిభ ఉందని ఎవరికీ తెలియదు. చిన్నప్పుడు రజిత "చటుక్కున ఊరంతా పరిగెత్తి వచ్చేసేది.." అంటారు భద్రమ్మ. స్కూలులో చేరిన తర్వాత రజితకు పాఠ్యాంశాల కన్నా ఆటలలోనే ఎక్కువ ఆసక్తి కనబరిచేది. ఆమెకు పరుగులో ప్రతిభ ఉందని తొలిసారి గుర్తించి ప్రొత్సహించినది అరూపే పాఠశాలకు చెందిన ఫాదర్ ఏసురత్నం. ఆయన ఇచ్చిన ప్రొత్సాహంతో... జిల్లా స్థాయిలో 100 మీటర్ల రేసులో గెలిచిన రజిత ఆదివాసీ పిల్లల్లో ఒక స్టార్‌గా మారింది. ఆ తర్వాత కాలంలో జాతీయ స్థాయిలో ఆమెకు అనేక బహుమతులు వచ్చాయి. కానీ ఆమెను పేదరికం వెంటాడుతూనే ఉండేది. కాళ్లకు వేసుకోవటానికి సరైన షూలు ఉండేవి కావు. తనవద్ద ఉన్న కొద్దిపాటి డబ్బులను రజితకు భద్రమ్మ అప్పుడప్పుడూ ఇస్తూ ఉండేది. ఈ సమయంలో రజిత పరుగు ప్రస్థానంలో భద్రమ్మతో పాటు, సోదరుడు జోగయ్య సహకారం వెలకట్టలేనిది. ప్రస్తుతం 2026లో జరగనున్న కామన్వెల్త్ పోటీలకు శిక్షణ పొందుతున్న రజిత 2028లో జరగబోయే ఒలింపిక్స్ అథ్లెటిక్స్ జట్టుకు కూడా ఎంపిక అయింది. మన్యం ప్రాంతం నుంచి అంతర్జాతీయ స్థాయిలో పతకాలను సాధించిన అథ్లెట్‌గా రజిత పేరు చరిత్రలో నిలిచిపోతుంది. ఆమె భవిష్యత్తులో మరిన్ని పతకాలను సాధించి మన

## తేడా రావొద్దు!



ప్రేమ సంగతి ఎలా ఉన్నా.. పెండ్లి మాత్రం అనేక షరతులతో కుదురుతుంది. మిగతా విషయాలను పక్కన పెడితే.. వివాహబంధంలో 'వయసు' కీలకపాత్ర పోషిస్తుంది. అయితే, నేటి ఆధునిక యువత.. ప్రేమ వివాహాలకే ఎక్కువగా మొగ్గు చూపుతున్నది. ఈ క్రమంలో 'వయోబేధం'లో తేడా కొడుతున్నది. ఫలితంగా అభిప్రాయబేధాలు తలెత్తి.. 'కాపురం' అల్లకల్లోలంగా మారుతున్నది. సంతానోత్పత్తి కూడా సమస్యగా మారుతున్నది. అయితే.. భార్యాభర్తల మధ్య వయసులో ఎంత తేడా ఉంటే మంచిది? ఈ ప్రశ్నకు నిపుణులు చెబుతున్న సమాధానం ఇది..

నేటితరంలో ఎక్కువగా ప్రేమ వివాహాలే చేసుకుంటున్నారు. దాంతో.. దంపతులిద్దరూ ఒకే వయసువారై ఉంటున్నారు. ఇలాంటి దంపతుల మధ్య అండర్‌స్టాండింగ్ బాగుంటుందట. సంతానోత్పత్తికీ ఎలాంటి సమస్యలూ ఉండవట. అయితే, అభిప్రాయ బేధాలు వస్తే మాత్రం.. ఇద్దరిలో ఎవరూ సర్దుకుపోయేందుకు మొగ్గుచూపరట. పంతాలకు పోయి.. తెగేదాకా లాక్కుంటారట.

భార్యాభర్తల మధ్య ఐదు నుంచి ఆరేండ్ల తేడా ఉంటే మంచిదన్నది నిపుణుల మాట. ఇలాంటి జంటల మధ్య అవగాహన బాగుంటుందట. అభిప్రాయాలు కలవడం.. సంతాన సాఫల్యతకు ఇబ్బంది లేకపోవడం వీరికి కలిసొచ్చే అంశాలు. వయసులో తేడా తక్కువగా ఉండటం వల్ల వీరికి ఆరోగ్యవంతమైన పిల్లలు పుడతారట. అభిప్రాయబేధాలు వచ్చినా.. సర్దుకుపోతారట.

పదేండ్ల తేడా ఉంటే.. ఇద్దరి మధ్య ప్రేమ బాగుంటుందట. ఒకరినొకరు గౌరవించుకుంటారట. అభిప్రాయాల్లో కొద్దిగా తేడాలు ఏర్పడినప్పటికీ.. సర్దుకుపోయేందుకే మొగ్గు చూపుతారట. ఇక వీరిలో సంతానానికీ ఎలాంటి ఇబ్బందులు ఉండవని నిపుణులు చెబుతున్నారు. జీవిత లక్ష్యాలు, ఆశయాలు, దృక్పథాలు కలిస్తే.. ఈ పదేండ్ల తేడా వారి కాపురంపై పెద్దగా ప్రభావం చూపించదని నిపుణుల మాట.

కారణాలేవైనా.. కొందరు దంపతుల్లో వయసు తేడా ఎక్కుగా కనిపిస్తుంది. కొన్ని జంటల్లో 15 ఏండ్లకు మించి కూడా తేడా ఉంటుంది. ఇలాంటివారిలో తరచుగా అభిప్రాయబేధాలు తలెత్తుతాయట. వారి ఆశయాల్లో, లక్ష్యాల్లోనూ తేడాలు కనిపిస్తాయి. ముఖ్యంగా.. వయసులో ఈ తేడా సంతానోత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు.

## మామిడి ఆకులతో అందం!



మామిడి పండ్లే కాదు.. ఆకులూ ఎన్నో ప్రయోజనాలు అందిస్తాయి. చర్మాన్ని మెరిపించడంలో.. అందానికి మరిన్ని వన్నెలు అద్దడంలో మామిడాకులు అద్భుతమే చేస్తాయి. ఆయుర్వేదంలో విరివిగా వాడే ఆమ్రపత్రాలు.. మొటిమలు, మచ్చలను తగ్గించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తాయి.

మామిడి ఆకుల్లో ఉండే యాంటి ఆక్సిడెంట్లు.. చర్మాన్ని రక్షిస్తాయి. యూవీ కిరణాలు, కాలుష్యం నుంచి కాపాడుతాయి. చర్మాన్ని మృదువుగా మారుస్తాయి. మామిడి ఆకుల ఫేస్‌ప్యాక్‌ను క్రమం తప్పకుండా వాడితే.. వృద్ధాప్య ఛాయలు కూడా తగ్గుతాయని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు.

తయారీ విధానం

గుప్పెడు మామిడి ఆకుల్ని తీసుకుని.. శుభ్రంగా కడగాలి. వాటిని పాన్‌పైన మెల్లిగా వేయించాలి. చల్లారిన తర్వాత ఆకుల్ని మెత్తని పొడిలా మిక్సీ పట్టుకోవాలి. ఈ పొడిని ఒక గిన్నెలోకి తీసుకొని.. రెండు టీస్పూన్ల కొబ్బరి నూనె వేసి, బాగా కలపాలి. మందపాటి పేస్ట్‌గా తయారు చేసుకొని.. ముఖం మొత్తానికి బాగా అప్లయి చేయాలి. ఓ ఇరవై నిమిషాలు అలాగే వదిలేసి.. గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. వారానికి రెండు మూడుసార్లు ఇలా మామిడి ఆకుల ఫేస్‌ప్యాక్ వేసుకుంటే.. ముఖవర్చస్సు మారిపోతుంది.

ప్రయోజనాలు

మామిడి ఆకుల్లో ఉండే 'మాంగిఫెరిన్' అనే సమ్మేళనాలు.. మొటిమల వల్ల కలిగే మచ్చల్ని తగ్గిస్తాయి. మొటిమలతో ఇబ్బంది పడేవారికి మామిడి ఆకుల ఫేస్‌ప్యాక్ మంచి ఫలితం ఇస్తుంది.

వీటిలో పుష్కలంగా లభించే 'టైరోసిన్'.. చర్మం నల్లబడటాన్ని నివారిస్తుంది. ముఖం, ఇతర శరీర భాగాలపై ఏర్పడే నల్లటి మచ్చల్ని తగ్గిస్తుంది. క్రమం తప్పకుండా వాడితే.. గ్లాసీ గ్లోయింగ్ స్కిన్ మీ సొంతమవుతుంది.

శరీరంలో కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచడంలో మామిడి ఆకులు సాయపడతాయి. దాంతో చర్మం ముడతలు పడటం తగ్గుతుంది.








## వానల్లో వయ్యారంగా

చిత్తడిలో నేల మీద జీరాడే దుస్తులు ధరించలేం! కాబట్టి ప్రత్యేకించి వాన రోజుల్లో కురచ గౌన్లకే ప్రాధాన్యం ఇస్తూ ఉంటారు అమ్మాయిలు. అలాంటి కొన్ని చిట్టి పొట్టి గౌన్ల మీద ఓ లుక్కేద్దామా? మోకాలి పొడవు గౌన్లు ధరించడానికి సౌకర్యంగా ఉండడంతో పాటు చూడముచ్చటగా కనిపిస్తాయి. పూలు, లతల డిజైన్లు, జామెట్రిక్ డిజైన్లు... ఇలా భిన్నమైన డిజైన్లతో, భిన్నమైన వస్త్రాలతో రూపొందే షార్ట్ గౌన్స్‌కు అనువైన కాలమిది. అయితే వీటిని ధరించేటప్పుడు కొన్ని అంశాలు దృష్టిలో పెట్టుకోవాలి. అవేంటంటే...

కాటన్, లినెన్, జార్జెట్, స్పన్... ఇలా గౌన్లు ఎన్నో రకాల వస్త్రాలతో తయారవుతూ ఉంటాయి. అయితే ఒడ్డు పొడవుల ఆధారంగా ఎవరికి వారు ఈ గౌన్లను ఎంచుకోవాలి. నాజూకుగా ఉన్న మహిళలు కాటన్, లినెన్ గౌన్లను ఎంచుకోవచ్చు. బొద్దుగా ఉండేవారికి స్పన్, జార్జెట్ గౌన్లు బాగుంటాయుబ్లంట్ హీల్స్, పెన్సిల్ హీల్స్.. వీటిలో ఏ జోళ్లు ధరించినా గౌన్లకు చక్కగా మ్యాచ్ అవుతాయి. అయితే ఇది వానాకాలం కాబట్టి తోలుతో తయారైన జోళ్లకు బదులుగా ఇతరత్రా మెటీరియల్స్‌తో తయారైన వాటినే ఎంచుకోవాలి.

ఈ గౌన్లతో కృత్రిమ ఆభరణాలు, జర్మన్ సిల్వర్ ఆభరణాలు ధరించవచ్చు. ఈ ఆభరణాలు వీలైనంత సింపుల్‌గా ఉండేలా చూసుకోవాలి. ఇక మిగతా యాక్సెసరీస్ విషయానికొస్తే పర్సులకు బదులుగా స్లింగ్ బ్యాగ్స్ గౌన్లకు చక్కగా నప్పుతాయి. చేతులకు బ్యాంగిల్స్‌కు బదులుగా పెద్ద డయల్ కలిగిన వాచీలను ఎంచుకోవాలి.





## ఇండియాలో ఫ్లైట్ ప్రమాదం.. అమెరికాలో బోయింగ్ షేర్లు భారీగా పతనం

**న్యూఢిల్లీ-నవభూమి:** గుజరాత్‌లోని అహ్మదాబాద్ సర్దార్ వల్లభాయ్ పటేల్ విమానాశ్రయంలో ఎయిర్ ఇండియా విమానం టేకాఫ్ సమయంలో జరిగిన ప్రమాదం ప్రపంచ ఆర్థిక మార్కెట్లలో కలకలం రేపింది. ఈ విమానం బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్, 242 మంది ప్రయాణికులను మోసుకెళ్తూ ఉండగా ఆకస్మాత్తుగా కుప్పకూలింది. ఈ ఘటన అమెరికాలోని స్టాక్ మార్కెట్‌లో బోయింగ్ కంపెనీ షేర్లపై తీవ్ర ప్రభావం చూపింది. గురువారం ఉదయం అమెరికా ప్రీ-మార్కెట్ ట్రేడింగ్‌లో బోయింగ్ షేర్లు 8% కంటే ఎక్కువగా పడిపోయాయి. ఒక్కో షేరు ధర సుమారు %వి%196.50 వద్ద నమోదైంది. ఇది 17.50 లేదా 8.18% తగ్గుదలను సూచిస్తుంది.దేశీయ మార్కెట్‌లోనూ అలజడి.ఈ ఘటన భారతదేశ ఆర్థిక మార్కెట్‌పై కూడా ప్రభావం చూపించింది. ఈ క్రమంలో బడ్జెట్ ఎయిర్‌లైన్స్ అయిన ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ (ఇండిగో), స్పైస్‌జెట్ షేర్లు గురువారం నాడు 3.4% వరకు పడిపోయాయి. భారత స్టాక్ మార్కెట్ మొత్తం మీద భారీ నష్టాలతో ముగిసింది. గురువారం ట్రేడింగ్ సెషన్ భారతీయ స్టాక్ మార్కెట్‌కు కఠినమైన సవాలుగా మారింది. గ్లోబల్ అనిశ్చితులు, మధ్య ప్రాచ్యంలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, వీక్లీ %ఖీడూ% ఎక్స్‌పైరీ వంటి అంశాలు కూడా మార్కెట్‌ను మరింత ఒత్తిడికి గురిచేశాయి.

## ఒక్క సారీ.. రూ.1600 కోట్లు లాభం.. ఎలన్ మస్క్ జాక్‌పాట్



**న్యూయార్కు-నవభూమి:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ కుభేరుడు ఎలన్ మస్క్ మధ్య కొన్ని రోజుల క్రితం విభేదాలు మొదలైన సంగతి తెలిసిందే. అధ్యక్షుడు ట్రంప్‌పై మస్క్ మాటల యుద్ధానికి దిగారు. సంచలన ఆరోపణలు చేశారు. అయితే తాజాగా మస్క్ వెనక్కి తగ్గారు. ట్రంప్‌నకు సోషల్ మీడియా ద్వారా క్షమాపణలు చెప్పారు. తన వ్యాఖ్యల పట్ల చింతిస్తున్నట్టు పేర్కొన్నారు. మస్క్ క్షమాపణలను ట్రంప్ అంగీకరించారు. దీంతో ఎలన్ మస్క్ భారీ లాభాలను ఆర్జించారు అమెరికా స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అయి ఉన్న టెస్లా షేర్లు బుధవారం భారీగా లాభపడ్డాయి. సారీ పోస్ట్‌తో మస్క్ నికర సంపద బుధవారం ఒక్కరోజే దాదాపు 191 మిలియన్ డాలర్ల మేర పెరిగింది. అంటే మన దేశీ కరెన్సీలో దాదాపు 1600 కోట్ల రూపాయలు. బుధవారం తెల్లవారు ఝామున మస్క్ తన ఎక్స్ ఖాతా ద్వారా ట్రంప్‌నకు క్షమాపణలు తెలిపారు. %-%అమెరికా అధ్యక్షుడిపై పెట్టిన నా పోస్ట్‌లపై విచారం వ్యక్తం చేస్తున్నా. అవి చాలా దూరం వెళ్లాయి. అవి చాలా దూరం వెళ్లాయి అని మస్క్ పేర్కొన్నారు. మస్క్ క్షమాపణలను ట్రంప్ ఆమోదించినట్టు వైట్‌హౌస్ కూడా ఓ ప్రకటన జారీ చేసింది.అమెరికా ప్రభుత్వం రూపొందించిన %-%బిగ్ బ్యూటిఫుల్ బిల్లు%-%ను టెస్లా అధినేత మస్క్ వ్యతిరేకించిన దగ్గర్నుంచి వారి మధ్య దూరం పెరిగింది. ఆ తర్వాత ట్రంప్‌పై మస్క్ వరుసగా సంచలన ఆరోపణలు చేశారు. ట్రంప్‌తో విభేదాల నేపథ్యంలో మస్క్ సంస్థ టెస్లా షేర్లు భారీగా పతనమయ్యాయి. ఒక్క రోజులోనే ఏకంగా 14 శాతం మేర నష్టపోయాయి. ఆ తర్వాత కాస్తా కోలుకున్నాయి. తాజాగా ట్రంప్-మస్క్ మధ్య విభేదాలు తొలిగిపోవడంతో లాభాలను ఆర్జిస్తున్నాయి.

## జీఆర్‌టీ నుంచి గోల్డెన్ ఎలెవెన్ ఫ్లెక్సీ ప్లాన్

**హైదరాబాద్-నవభూమి:** ఆభరణాల రిటైలింగ్ దిగ్గజం జీఆర్‌టీ జువెలర్స్ తమ కస్టమర్ల కోసం గోల్డెన్ ఎలెవెన్ ఫ్లెక్సీ ప్లాన్‌ను ప్రారంభించింది. ఇది 11 నెలల పాటు బంగారంపై పెట్టుబడి పెట్టే ఆకర్షణీయమైన ప్లాన్. కనీస పెట్టుబడి రూ.1000. ఆ పైన ఎంత మొత్తంలో అయినా ఇన్వెస్ట్ చేయవచ్చు. వారు 11 నెలల అనంతరం తమకు ఇష్టమైన ఆభరణాలు కొనుగోలు చేయవచ్చునని జీఆర్‌టీ జువెలర్స్ ఒక ప్రకటనలో తెలిపింది. ఇందులో రెండు ఆప్షన్లుంటాయి. ఒకటి బరువు ఆధారిత ప్లాన్ కాగా రెండోది విలువ ఆధారిత ప్లాన్. ఈ రెండింటిలో ఏదో ఒకటి కస్టమర్ ఎంచుకోవచ్చు. 18 శాతం వరకు ఎలాంటి తరుగు వసూలు చేయకపోవడం ఈ ప్లాన్ ప్రత్యేకత. బంగారం, వజ్రాలు, ప్లాటినం, వెండి ఆభరణాలన్నింటికీ ఈ ప్లాన్ వర్తిస్తుంది. బంగారం ధరలు భారీ ఆటుపోట్లకు గురవుతున్న ప్రస్తుత వాతావరణంలో ఇది కస్టమర్ల సొమ్ముకు విలువ చేకూర్చే చక్కని ప్లాన్ అని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ జీఆర్ 'ఆనంద్' అనంత పద్మనాభన్ అన్నారు.నెలవారీ వాయిదా ఎంపిక నుంచి ఎప్పటికప్పుడు చెల్లింపులకు సంబంధించిన అలర్ట్‌లు జారీ చేయడం వరకు అన్నింటిలోనూ తమ నిపుణులు కస్టమర్లకు మార్గదర్శకం చేస్తారని చెప్పారు. జన్మదినాలు, ఇతరత్రా వేడుకల సమయంలో కుటుంబ సభ్యులకు ఆకర్షణీయమైన బహుమతులు ప్లాన్ చేసేందుకు ఇది చక్కని అవకాశమని మేనేజింగ్ డైరెక్టర్ జీఆర్ రాధాకృష్ణన్ అన్నారు.

## కెనరా బ్యాంక్ యూబీఐ ఐఓబీ రుణ రేట్లు తగ్గింపు



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ), ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ).. రుణాలపై వడ్డీరేట్లను 0.50 శాతం తగ్గించాయి. రుణాలకు ప్రామాణికమైన ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేటుతో (ఈబీఎల్‌ఆర్) పాటు రెపో అనుసంధానిత రుణ రేటును (ఆర్‌ఎల్‌ఎల్‌ఆర్) అర శాతం తగ్గించినట్లు బుధవారం నాటి ప్రకటనలో యూబీఐ తెలిపింది. అలాగే ఆర్‌ఎల్‌ఎల్‌ఆర్‌ను 0.50 శాతం తగ్గిస్తున్నట్లు ఐఓబీ వెల్లడించింది. దాంతో బ్యాంక్ రుణ రేటు 8.85 శాతం నుంచి 8.35 శాతానికి తగ్గనుంది. గురువారం నుంచి ఈ రేటు అమలులోకి రానుంది.కెనరా బ్యాంక్: కెనరా బ్యాంక్ కూడా ఆర్‌ఎల్‌ఎల్‌ఆర్‌ను 0.50 శాతం తగ్గించినట్టు ప్రకటించింది. దాంతో బ్యాంక్ రుణరేటు 8.75 శాతం నుంచి 8.35 శాతానికి తగ్గనుంది. గురువారం నుంచి ఈ రేటు అమలులోకి రానుంది. ఆర్‌బీఐ రెపోరేటును గత శుక్రవారం 0.50 శాతం తగ్గించడంతో పలు బ్యాంకులు ఆ ప్రయోజనాన్ని కస్టమర్లకు పంచుతున్నాయి.

## తత్కాల్ బుకింగ్ కోసం కొత్త రూల్.. అలా అయితేనే టికెట్లు.. రైల్వే శాఖ కీలక నిర్ణయం..



**న్యూఢిల్లీ-నవభూమి:** తత్కాల్ టికెట్ల(కు సంబంధించి రైల్వే శాఖమరో కొత్త నిబంధన అమల్లోకి తీసుకురాబోతోంది. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ లేదా యాప్‌లో ఆధార్ అథంటికేటెడ్ వ్యక్తులకే తత్కాల్ టికెట్ బుకింగ్ సదుపాయం కల్పించాలని నిర్ణయం తీసుకుంది. జులై 1వ తేదీ నుంచి ఈ నిబంధనను అమలు చేయబోతున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు అన్ని జోన్లకు తాజాగా సర్క్యులర్ జారీ చేసింది. ఆధార్ అథంటికేటెడ్ కాని వ్యక్తులు జులై 1 తర్వాత తత్కాల్ టికెట్లను బుక్ చేసుకోలేరు.ఇక, జులై 15 నుంచి తత్కాల్ టికెట్ల బుకింగ్‌కు ఆధార్ బేస్డ్ ఓటీపీ కూడా తప్పనిసరి చేయబోతున్నట్టు రైల్వే శాఖ ప్రకటించింది. రైల్వే శాఖకు చెందిన టికెట్ బుకింగ్ కౌంటర్లలో, ఏజెంట్ల దగ్గర తత్కాల్ టికెట్లు బుక్ చేయాలంటే వ్యక్తుల మొబైల్‌కు వచ్చే ఆధార్ ఓటీపీని చెప్పాల్సి ఉంటుంది. అలాగే ఏజెంట్లకు తత్కాల్ టికెట్ల బుకింగ్ చేసే అవకాశాన్ని తొలి అరగంట ఇవ్వబోమని రైల్వే శాఖ తేల్చి చెప్పింది. అంటే ఏసీ కోచ్ టికెట్లను ఉదయం 10:30 తర్వాత, స్లీపర్ క్లాస్ టికెట్లను ఉదయం 11:30 గంటల తర్వాత మాత్రమే ఏజెంట్లు బుక్ చేయడానికి వీలవుతుంది.

## విశాఖపట్నంలో అడ్వాన్స్‌డ్ క్యాన్సర్ కేర్ బ్లాక్‌కు శంకుస్థాపన చేసిన ఐసీఐసీఐ బ్యాంక్, టాటా మెమోరియల్ సెంటర్





**విశాఖపట్నం:-నవభూమి:** టాటా మెమోరియల్ సెంటర్‌తో (టీఎంసీ) కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో హెూమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ లో కొత్త భవంతి నిర్మాణ పనులను ప్రారంభించినట్లు ఐసీఐసీఐ బ్యాంక్ ప్రకటించింది.సుమారు 3.9 లక్షల చ.అ. విస్తీర్ణంలో, అత్యుత్తమ మెడికల్ టెక్నాలజీతో ఏర్పాటయ్యే ఈ అధునాతన కేంద్రం నిర్మాణానికి రూ. 550 కోట్ల పైగా మొత్తానికి కమిట్‌మెంట్‌తో ఐసీఐసీఐ బ్యాంకు నిధులను సమకూరుస్తోంది.ఎనిమిది అంతస్తుల ఐసీఐసీఐ ఫౌండేషన్ బ్లాక్ ఫర్ చైల్డ్ అండ్ బ్లడ్ క్యాన్సర్ కొత్త బిల్డింగ్ అందుబాటులోకి వచ్చాక ఏటా 3,000 మంది పేషంట్లకు సేవలందించేందుకు ఉపయోగపడుతుంది. ప్రస్తుతం విశాఖపట్నంలోని ఎదీజ౹=జ వార్షిక సామర్థ్యం 6,200 పేషంట్లుగా ఉంది.తూర్పు భారతదేశంలోనే అత్యుత్తమ స్పెషలైజ్డ్ క్యాన్సర్ చికిత్సా కేంద్రాల్లో ఒకటిగా నిల్చేలా రూపొందిస్తున్న ఈ కొత్త భవనంలో 215 పైగా పడకలు ఉంటాయి. అన్ని అనుమతులకు లోబడి 2027 నాటికి ఇది పూర్తవుతుందని అంచనా. ఐసీఐసీఐ బ్యాంక్ సీఎస్ఆర్ విభాగమైన ఐసీఐసీఐ ఫౌండేషన్ ఫర్ ఇన్‌క్లూజివ్ గ్రోత్ దీన్ని అమలును పర్యవేక్షిస్తుంది.ఐసీఐసీఐ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ . సందీప్ బాత్రా, టాటా మెమోరియల్ సెంటర్ (ముంబై) డైరెక్టర్ సుదీప్ గుప్తా సమక్షంలో ఐసీఐసీఐ బ్యాంక్ చైర్మన్ . ప్రదీప్ కుమార్ సిన్హా కొత్త భవనం శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఇతర ప్రముఖుల సమక్షంలో రావు ఆడిటోరియంను కూడా సిన్హా ప్రారంభించారు. కొత్త ఆడిటోరియంనకు మౌలిక సదుపాయాలు, ఎక్విప్‌మెంట్‌పరంగా TMCకి ఐసీఐసీఐ ఫౌండేషన్ సహాయ సహకారాలు అందించింది."దేశీయంగా కీలక ఆరోగ్యసంరక్షణ మౌలిక సదుపాయాలను పటిష్టపర్చాలన్న మా లక్ష్యానికి అనుగుణంగా క్యాన్సర్ కేర్ విషయంలో TMCతో చేతులు కలపడం మాకు ఎంతో గర్వకారణమైన విషయం. అవసరార్థులకు అత్యంత నాణ్యమైన వైద్య సంరక్షణను అందుబాటులోకి తేవాలన్న మా నిబద్ధతకు ఈ ప్రాజెక్టు నిదర్శనంగా నిలుస్తుంది. తూర్పు కారిడార్‌లో శిశు మరియు రక్త క్యాన్సర్‌కి సంబంధించి అతి పెద్ద ప్రాజెక్టుల్లో ఇది కూడా ఒకటిగా ఉంటుంది. ఆంధ్రప్రదేశ్, సమీపాన ఉన్న తూర్పు రాష్ట్రాల్లోని పేషంట్లకు సేవలందించేందుకు ఉపయోగపడుతుంది. పెరుగుతున్న క్యాన్సర్ చికిత్స అవసరాలను తీర్చడంలో సహాయపడుతుంది" అని ఐసీఐసీఐ బ్యాంక్ చైర్మన్ . ప్రదీప్ కుమార్ సిన్హా తెలిపారు."సీఎస్ఆర్ కార్యకలాపాలకు సంబంధించి ఆరోగ్య సంరక్షణపై ఐసీఐసీఐ బ్యాంక్ ప్రత్యేక దృష్టి పెడుతుంది. విశాఖపట్నం, నవీ ముంబై, న్యూ చండీగఢ్‌లో కొత్తగా మూడు TMCకేంద్రాలను ఏర్పాటు చేసేందుకు రూ. 1,200 కోట్లు హామీనివ్వడం ద్వారా భారత్‌లో క్యాన్సర్ కేర్‌కి సంబంధించి విశిష్ట సేవలు అందిస్తున్నో రెండేళ్ల క్రితం జట్టు కట్టాం. తాజా అవసరాల దృష్ట్యా ఈ మొత్తాన్ని రూ. 1,800 కోట్లకు పెంచుతున్నట్లు తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. 10.7 లక్షల చ.అ. విస్తీర్ణంలో ఏర్పాటయ్యే ఈ కొత్త బ్లాక్‌లలో అధునాతన వైద్య సదుపాయాలు, పరిశోధన విభాగాలు ఉంటాయి. ఈ బ్లాకుల్లో మొత్తం 19 LINAC%లులి మరియు 555 పడకలు ఉంటాయి. ఇవి పూర్తిగా అందుబాటులోకి వస్తే, ప్రాంతీయ హబ్‌లుగా పని చేస్తాయి" అని ఐసీఐసీఐ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ . సందీప్ బాత్రా తెలిపారు.

## బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ భద్రతపై ప్రశ్నలు..!



**న్యూఢిల్లీ-నవభూమి:** గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లోని ఎయిర్ ఇండియా విమానం ప్రమాదానికి గురైంది. లండన్‌లోని గాట్విక్‌కు వెళ్తున్న ఎయిర్ ఇండియాకు చెందిన ఏఐ-171 కుప్పకూలింది. ఇది బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమానం. టేకాఫ్ అయిన కొద్ది సమయంలోనే అదుపు తప్పింది. విమానంలో 242 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ ప్రమాదం తర్వాత సంఘటనా స్థలానికి చేరుకొని, సహాయక చర్యలు చేపడుతున్నాయి. ప్రమాదం నేపథ్యంలో బోయింగ్ 787-8 డ్రీమ్ లైనర్ విమానాల భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. గతంలోనూ ఈ విమానాలు వివాదాల్లో కూరుకుపోయాయి. ఉత్పత్తి ప్రక్రియ.. నాణ్యతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.గతంలో ఫ్యూజ్‌లేజ్ షిమ్మింగ్, స్కిన్ సర్ఫేసింగ్ సమస్యలపై పలువురు ఇంజినీర్లు ఆరోపణలు వ్యక్తం చేశారు. బోయింగ్ అక్రమాలకు పాల్పడుతోందంటూనే,.. విమానాల తయారీలో షార్ట్‌కట్స్ వైఫల్యాలపై హెచ్చరికలు జారీ చేశారు. ఈ క్రమంలో 2020లో అనేక బోయింగ్ 787 విమానాలను ఫ్యూజ్‌లేజ్ షిమ్మింగ్ స్కిన్ సర్ఫేసింగ్ సహా నాణ్యత నియంత్రణల సమస్యల కారణంగా గ్రౌండింగ్ చేశారు. బోయింగ్ ఇంజినీర్ సామ్ సలేహ్‌పూర్ 787, 777 రెండింటిలోనూ తయారీ షార్ట్‌కట్స్, తయారీ వైఫల్యాలపై హెచ్చరికలు చేశారు. ఆయా సమస్యలు విమానాల వయసు పెరిగే కొద్దీ ప్రమాదాల బారినపడే అవకాశాలుంటాయని హెచ్చరించారు. విజిల్‌బ్లోయర్ వాదనలపై ఎఫ్ఏఏ సైతం దర్యాప్తు చేశారు. 787 నిర్మాణాన్ని ప్రభావితం చేసే ఏరోస్పేస్ -గ్రేడ్ టైటానియం మిశ్రమం బదులుగా స్టాండర్డ్ టైటానియం తదితన పదార్థాలను వినియోగిస్తున్నట్లు ఎఫ్ఏఏ గుర్తించింది. 787 డ్రీమ్‌లైనర్ ఉత్పత్తిలో బోయింగ్ అనేక సమస్యలను ఎదుర్కొంది. ప్రధాన సమస్యల్లో ఒకటి దాని సరఫరా గొలుసు, ఉత్పత్తి ప్రక్రియలో జాప్యం. అలాగే, బోయింగ్ విమానం ఈ మోడల్‌లోని భాగాలకు నాణ్యత నియంత్రణ లేదని తేలింది. దాంతో భద్రతా సమస్యలను లేవనెత్తింది. భద్రతా సమస్యల కారణంగా, విమానం భద్రత, నాణ్యతను ప్రశ్నించిన నియంత్రణ సంస్థల నుంచి బోయింగ్ దర్యాప్తులను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ వివాదాలు బోయింగ్‌కు ఆర్థిక నష్టాలను తీసుకువచ్చాయి. అదే సమయంలో కంపెనీ ప్రతిష్టను సైతం ప్రభావితం చేశాయి. బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ జెట్ చుట్టూ ఉన్న వివాదం విమానయాన పరిశ్రమలో నాణ్యత నియంత్రణ, ఉత్పత్తి ప్రక్రియల ప్రాముఖ్యతను హైలైట్ చేసింది. బోయింగ్ ఈ సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంది. కానీ, వివాదం కంపెనీ ప్రతిష్ట, ఆర్థిక పరిస్థితులను దెబ్బతీసింది.

## భారీగా పెరిగిన బంగారం, వెండి ధరలు



**న్యూఢిల్లీ-నవభూమి:** పసిడికి మార్కెట్లో ఎల్లప్పుడూ డిమాండ్ ఉంటుంది. అయితే పసిడి ధరలు గత కొంత కాలం నుంచి పరుగులు పెడుతున్న సంగతి తెలిసిందే. గతంలో ఎన్నడూ లేని విధంగా వీటి ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. 10 గ్రాముల బంగారం ధర రూ. లక్షకు చేరువలో ఉంది. జూన్ నెల ప్రారంభంలోనే బంగారం ధరలు భారీ ఎత్తున పెరిగాయి. తాజాగా భారతదేశంలో 24 క్యారెట్లు బంగారం గ్రాముకు రూ. 88 పెరిగి రూ. 9,928గా ఉండగా, 22 క్యారెట్లు బంగారం గ్రాముకు రూ. 80 పెరిగి రూ. 9,100గా ఉంది. అలాగే 18 క్యారెట్లు బంగారం కూడా రూ. 66 పెరిగి రూ. 7,446గా ఉంది.

భారతదేశంలో బంగారం ధరలు..

పస్తుతం 100 గ్రాముల బంగారం ధర 24 క్యారెట్లు రూ.9,92,800గా ఉంది. అదే 22 క్యారెట్ల బంగారం ధర రూ.9,10,000.. 18 క్యారెట్లు రూ.7,44,600గా ఉంది.

హైదరాబాద్‌లో బంగారం ధరలు..

నగరంలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 99,280.. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 91,000.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర రూ. 74,460గా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ, విజయవాడలోనూ ఇవే ధరలు కొనసాగుతున్నాయి.

దేశవ్యాప్తంగా 10 గ్రాముల బంగారం (24, 22, 18 క్యారెట్ల) ధరలు ఎలా ఉన్నాయంటే..

ఢిల్లీ: రూ.99,430, రూ.91,150, రూ.74,580
ముంబై: రూ.98,280, రూ.91,000, రూ.74,460
కోల్‌కతా- రూ.98,280, రూ.91,000, రూ.74,460
చెన్నై- రూ.98,280, రూ.91,000, రూ.74,460
బెంగళూరు- రూ.98,280, రూ.91,000, రూ.74,460
కేరళ: రూ.98,280, రూ.91,000, రూ.74,460
పుణె- రూ.98,280, రూ.91,000, రూ.74,460

**వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..**

బంగారమే ముఖ్యంగా వెండి ధరలను నిర్ణయిస్తుంది. డిమాండ్ పెరిగితే బంగారం ధర కూడా పెరుగుతుంది, ఫలితంగా వెండి ధర కూడా పెరుగుతుంది. పరిశ్రమలు, వ్యాపారసంస్థలు.. వెండిని వివిధ వస్తువులు అనగా, కంప్యూటర్లు, టీవీలు, మెడల్స్, నాణేలు ఇంక నగల వంటి తమ ఉత్పత్తులు తయారుచేయటంలో వాడతాయి. ఈ పరిశ్రమలు దాదాపు ప్రతిరోజూ ఏవో ఒక కొత్త ఉత్పత్తులు ప్రారంభిస్తాయి, దానివల్ల వెండి డిమాండ్ పెరిగి, ధరలు కూడా పెరుగుతాయి. హైదరాబాద్‌లో కేజీ వెండి రూ. 100 పెరిగి.. రూ. 1,18,900గా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో కిలో వెండికి రూ. 100 పెరిగి. రూ.1,08,900కు చేరింది. ఆర్థిక రాజధాని ముంబైలో కిలో వెండికి రూ. 100 పెరిగి. రూ.1,08,900 వద్ద కొనసాగుతోంది. ఇక విజయవాడలో కేజీ ధర రూ.1,18,900గా ఉంది, విశాఖపట్నంలో కిలో వెండి ధర రూ. 1,18,900 వద్ద కొనసాగుతోంది.

### అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై స్పందించిన

## ఎయిర్ ఇండియా చైర్మన్ చంద్రశేఖరన్



**అహ్మదాబాద్-నవభూమి:** అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమానం కూలిపోయింది. 242 మంది ప్రయాణికులతో లండన్‌కు బయలుదేరిన విమానం.. టేకాఫ్ అయిన కొద్ది నిమిషాలకు కూలిపోయింది. ఈ ఘటనలో ఇప్పటి వరకు వంద మందికిపైగా మృతి చెందినట్లు సమాచారం. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో ఎంత మంది మరణించారో అధికారులు నిర్ధారించలేదు. ప్రమాదం నేపథ్యంలో అహ్మదాబాద్ విమానాశ్రయాన్ని మూసివేశారు. ప్రస్తుతం అన్ని కార్యకలాపాలు నిలిపివేశారు. ఎయిర్ ఇండియా చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఎయిర్ ఇండియా ఫ్లయిట్ 171 ప్రమాదాన్ని ధ్రువీకరించారు. బాధితులు, కుటుంబాలకు అండగా నిలుస్తామన్నారు.ప్రస్తుతం వారికి సహాయం చేయడంపైనే ప్రాథమికంగా దృష్టి సారించినట్లు తెలిపారు. విషాదకర ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఆయన.. ఘటనతో ప్రభావితమైన వారందరి కుటుంబాలు, ప్రియమైన వారి గురించే తమ ఆలోచనలు ఉన్నాయని.. వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానన్నారు. సంఘటనా స్థలంలో అత్యవసర ఎమర్జెన్సీ రెస్పాన్స్ బృందాలకు సహాయం చేసేందుకు..అవసరమైన మద్దతు అందించేందుకు తమ శక్తి మేరకు ప్రతిదీ చేస్తున్నామన్నారు. ప్రమాదం నేపథ్యంలో సమాచారం అందించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామని.. అవసరమైన సమాచారం అందిస్తుందన్నారు. సమాచారం అందించిన వెంటనే మిగతా వివరాలు పంచుకుంటామన్నారు. ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై ఇండిగో స్పందించింది. ఈ సమయంలో ఎయిర్ ఇండియాకు అండగా

## పీఎం కిసాన్ 20వ విడత డేట్ ఫిక్స్.. ఆరోజే రైతుల ఖాతాల్లోకి రూ.2 వేలు..!



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలోని రైతుల ఆదాయం రెట్టింపు చేసే లక్ష్యంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం వివిధ రకాల పథకాలు అందిస్తోంది. అందులో ఒకటే ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన పంట పెట్టుబడి సాయం అందించేందుకు ఈ పథకాన్ని కేంద్రం తీసుకొచ్చింది. ఇప్పటి వరకు 19 విడతల్లో రూ.2 వేల చొప్పున కోట్లాది రూపాయిలు, కోట్లాది మంది రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఇప్పుడు 20వ విడత కింద నిధుల విడుదలకు సమయం ఆసన్నమైంది. ఖరీఫ్ సీజన్ పంట సాగు సీజన్ మొదలైన క్రమంలో పీఎం కిసాన్ నిధుల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. వారందరికీ ఇది శుభవార్త అని చెప్పాలి.

పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన 20వ విడత పెట్టుబడి సాయం విడుదల చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసినట్లు తెలుస్తోంది. కేంద్ర వ్యవసాయ శాఖ వర్గాల సమాచారం ప్రకారం జూన్ 20, 2025 రోజున రైతుల ఖాతాల్లో రూ.2 వేలు జమ చేయాలని ప్రభుత్వం మూహూర్తం ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. అయితే, సాధారణంగానే ఖరీఫ్ సీజన్‌కి ముందు మే- జూన్ నెలలోనే నిధులు విడుదల చేస్తూ వస్తున్నారు. దీని ప్రకారమే ఈ నెలలోనే రైతుల ఖాతాల్లోకి డబ్బులు విడుదల అవుతాయని స్పష్టమవుతోంది. మరోవైపు.. 20వ విడత నిధులు అందుకోవాలంటే రైతులు తప్పనిసరిగా ఇ-కేవైసీ పూర్తి చేసి ఉండాలి. అలాగే బ్యాంక్ ఖాతాతో ఆధార్ నంబర్ లింక్ చేసుకుని ఉండాలి. ఈ రెండు పనులు పూర్తి చేయడంలో విఫలమైతే పీఎం కిసాన్ డబ్బులు అందుకోవడంలో ఇబ్బందులు తలెత్తుతాయి. కొన్ని సార్లు కోల్పోవాల్సి వస్తుంది. 19వ విడత నిధులను ఫిబ్రవరి 24, 2025 రోజున ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విడుదల చేశారు. 11 కోట్లకుపైగా రైతుల ఖాతాల్లో రూ.2 వేల చొప్పున రూ.22 వేల కోట్ల వరకు నగదు బదిలీ చేశారు. ఈసారి కూడా అదే స్థాయిలో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయనున్నారు.

ఇ-కేవైసీ ప్రాసెస్ ఇదే..

ముందుగా పీఎం కిసాన్ అధికారిక వెబ్‌సైట్లోకి వెళ్లాలి.

ఫార్మర్ కార్నర్‌లో అప్డేట్ మొబైల్ నంబర్ అని ఉంటుంది. దానిని సెలెక్ట్ చేయాలి.

ఆధార్ వివరాలు ఎంటర్ చేయాలి. ఓటీపీ కోసం క్లిక్ చేయాలి.

రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కి వచ్చే ఓటీపీ ఎంటర్ చేసి వెరిఫై చేస్తే సరిపోతుంది.

రైతుల స్టేటస్ ప్రాసెస్ ఇదే..

పీఎం కిసాన్ అధికారిక వెబ్‌సైట్లోకి వెళ్లాలి.

ఫార్మర్స్ కార్నర్‌లో బెనిఫిషియరీ స్టేటస్ ఆప్షన్ ఎంచుకోవాలి.

ఆధార్ నంబర్ లేదా అకౌంట్ నంబర్ ఎంటర్ చేయాలి.


పేమెంట్ హిస్టరీ లేదా ఎలిజిబిలిటీని వెరిఫై చేసుకోవాలి.

## రూ 1 45 లక్షల కోట్ల ఐపీఓలు

**ముంబై-నవభూమి:** ట్రంప్ సుంకాలతోపాటు భౌగోళిక రాజకీయ అనిశ్చితుల ప్రభావం నుంచి ఈక్విటీ మార్కెట్ క్రమంగా కోలు కుంటోంది. 52 వారాల కనిష్ఠ స్థాయి నుంచి నిఫ్టీ 15 శాతం మేర ఎగబాకింది. ఐపీఓల సందడి కూడా క్రమంగా పెరుగుతోంది. ప్రైమ్ డేటాబేస్ ప్రకారం.. ప్రస్తుతం 75కు పైగా కంపెనీలు సెబీ నుంచి ఐపీఓకు అనుమతి పొంది, పబ్లిక్ ఆఫర్‌ను ప్రారంభించేందుకు సరైన సమయం కోసం వేచి చూస్తున్నాయి. ఈ కంపెనీలు మార్కెట్ నుంచి మొత్తం రూ.1.45 లక్షల కోట్ల వరకు సమీకరించే అవకాశం ఉంది. మరో రూ.90,000 కోట్లకు పైగా విలువైన 65 కంపెనీల ఐపీఓలు సెబీ గ్రీన్ సిగ్నల్ కోసం ఎదురు చూస్తున్నాయి. ఈ కంపెనీలన్నీ కలిసి మార్కెట్ నుంచి రూ.2.35 లక్షల కోట్ల వరకు సమీకరించే అవకాశం ఉంది.

గత నెల నుంచి మళ్లీ గాడిలోకి..ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్‌లో దాదాపుగా స్తంభించిపోయిన ఐపీఓ మార్కెట్‌లో గత నెల నుంచి మళ్లీ కదలిక మొదలైంది. 10కి పైగా కంపెనీలు పబ్లిక్ ఆఫరింగ్‌ల ద్వారా రూ.20,000 కోట్ల వరకు సమీకరించాయి. మున్ముందు ఇష్యూల జోరు మరింత పెరగవచ్చని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 105 కంపెనీలు ఐపీఓల ద్వారా రూ.2.11 లక్షల కోట్లకు పైగా నిధులు సేకరించాయి.రియల్టీ రంగంలోనూ జోష్..స్థిరాస్తి రంగంలోని పలు కంపెనీలు ఐపీఓ ద్వారా నిధుల సమీకరణకు సిద్ధమవుతున్నాయి. నోయిడాకు చెందిన బీపీటీపీ లిమిటెడ్, ఎం3ఎం గ్రూప్‌నకు చెందిన స్మార్ట్‌వరల్డ్ డెవలపర్స్, గౌర్‌సన్స్ ఇండియా, వాద్వా గ్రూప్ ఈ జాబితాలో ఉన్నాయి. ఈ సంస్థలు ఐపీఓల ద్వారా రూ.15,000 కోట్లకు పైగా సమీకరించే అవకాశం ఉంది.పెరగనున్న దరఖాస్తులు..ఐపీఓకు వచ్చేందుకు సెబీకి కంపెనీల దరఖాస్తులు కూడా భారీగా పెరిగే అవకాశాలున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఐటీ, ఫిన్‌టెక్, రెన్యువబుల్ ఎనర్జీ వంటి నవతరం కంపెనీలు ఐపీఓకు వచ్చేందుకు అధిక ఆసక్తి చూపుతున్నాయన్నారు. ఎంటీఆర్, ఈస్టర్న్ మసాలా బ్రాండ్ల యూ జమాన్య సంస్థ ఓర్క్లా ఇండియా కూడా ఐపీఓకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. మర్చం ట్ పేమెంట్స్ సేవల సంస్థ పైన్ ల్యాబ్స్ కూడా సెబీకి దరఖాస్తు సమర్పించనున్నట్లు తెలిపింది.

## ఏఎస్‌బీఎల్ కొత్త వెంచర్ బ్రాడ్‌వే




**హైదరాబాద్-నవభూమి:** స్థానిక రియల్ ఎస్టేట్ సంస్థ ఏఎస్‌బీఎల్ నగరంలో మరో ప్రీమియం రెసిడెన్షియల్ గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టు చేపట్టింది. 'బ్రాడ్‌వే' పేరుతో ఈ నెల 14న ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్‌లో ఈ ప్రాజెక్టును ప్రారంభిస్తోంది. రూ.900 కోట్ల పెట్టు బడితో తలపెట్టిన ఈ ప్రీమియం రెసిడెన్షియల్ వెంచర్ కోసం ఏఎస్‌బీఎల్ ఇప్పటికే రూ.400 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో రూ.275 కోట్లు మోతీలాల్ ఓస్వాల్ గ్రూప్ నుంచి సమీకరించినట్టు కంపెనీ తెలిపింది. ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్‌లో ఐదు ఎకరాల విస్తీర్ణంలో చేపడుతున్న ఈ ప్రాజెక్టులో జీ౦50 ఫ్లోర్లలో 885 లగ్జరీ ట్రిపుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లు నిర్మిస్తారు. ఇందులో ఒక్కో ఫ్లాట్ విస్తీర్ణం 2,035 నుంచి 2,650 చదరపు అడుగుల వరకు ఉంటుంది. అత్యాధునిక సదుపాయా లతో నిర్మిస్తున్న ఈ వెంచర్‌లో ఒక్కో ఫ్లాటు కనీస ధర రూ.2.5 కోట్ల వరకు ఉంటుందని కంపెనీ తెలిపింది. ఈ ప్రాజెక్టు 2029 డిసెంబరుకల్లా పూర్తవుతుందని ఏఎస్‌బీఎల్ తెలిపింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 హైదరాబాద్ గురువారం 12 । జూన్ । 2025



# మంచి నిర్మాత మహేంద్ర మరిలేరు

తెలుగు సినిమా రంగానికి మరో సీనియర్ నిర్మాత వీడ్కోలు పలికారు. ఐదున్నర దశాబ్దాలకు పైగా తెలుగు సినిమా రంగంలో వివిధ శాఖలలో అనుభవం గడించి, నిర్మాతగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కావూరి మహేంద్ర (79) అనారోగ్యంతో గుంటూరులో కన్నుమూశారు. గుడివాడ తాలుకు దోసపాడులో 1946లో మహేంద్ర జన్మించారు. తండ్రి అచ్యుతరామయ్య డీఎస్పీగా గుంటూరులో పనిచేయడంతో వారి కుటుంబం అక్కడే స్థిరపడింది. ఏలూరు, విజయవాడ, హైదరాబాద్, ఒంగోలులో విద్యాభ్యాసం నెరపిన మహేంద్ర 1966లో చిత్రసీమలోకి అడుగుపెట్టారు. ఆయన బంధువు తాతినేని ప్రకాశరావు సలహా మేరకు కె. ప్రత్యగాత్మ , ఆయన సోదరుడు కె. హేమాంబరధర రావు వద్ద కొన్ని సినిమాలకు దర్శకత్వ శాఖలో మహేంద్ర పనిచేశారు. ఆపైన 'అదృష్ట జాతకుడు, వింత దంపతులు, ఇంటిదొంగ, పరివర్తన' చిత్రాలకు ప్రొడక్షన్ కంట్రోలర్ గా వ్యవహరించారు. 1977లో 'ప్రేమించి పెళ్ళి చేసుకో' సినిమాతో నిర్మాతగా మారారు.చాలా యేళ్ళ పాటు ఆయన గీతా ఆర్ట్ పిక్చర్స్ పతాకంపై సినిమాలను నిర్మించారు. 'ఏది పాపం ఏది పుణ్యం, ఆరని మంటలు, తోడు దొంగలు, బందిపోటు రుద్రమ్మ, ఎదురులేని మొనగాడు, ఢాకూరాణి, ప్రచండ భైరవి, కనకదుర్గ వ్రత మహాత్మ్యం, అమ్మలేని పుట్టిల్లు' తదితర చిత్రాలను మిత్రులతో కలిసి ప్రొడ్యూస్ చేశారు.



## శ్రీనిధి ఖాతాలో మరో లక్కీ ఛాన్స్..?



తనకు కథ నచ్చి సినిమాలో తన పాత్ర నచ్చితే కానీ ప్రాజెక్ట్ ఓకే చేయని హీరోయిన్స్ చాలామంది ఉంటారు. అలాంటి సెలెక్టెడ్ సినిమాలు చేసే వారి లిస్ట్ లో కచ్చితంగా కె.జి.ఎఫ్ భామ శ్రీనిధి శెట్టి పేరు ఉంటుంది. యష్, ప్రశాంత్ నీల్ కాంబోలో వచ్చిన కె.జి.ఎఫ్ రెండు భాగాలతో పాన్ ఇండియా క్రేజ్ సంపాదించిన శ్రీనిధి శెట్టి ఆ సినిమా తర్వాత మాత్రం ఆ రేంజ్ దూకుడు చూపించలేదు. కె.జి.ఎఫ్ తర్వాత చియాన్ విక్రమ్ తో కలిసి కోబ్రా సినిమా చేసిన శ్రీనిధి అది ఫ్లాప్ అవ్వడంతో డీలా పడింది. %ూశ్రీంశీ =ము౦% - సింగిల్ స్క్రీన్ థియేటర్లు కనుమరుగవుతాయా? ఇక తెలుగులో సిద్ధు జొన్నలగడ్డతో తెలుసు కదా సైన్ చేశాక నాని హిట్ 3 ఆఫర్ రావడం అందులో నటించి ఆ సినిమా రిలీజై సూపర్ హిట్ అవ్వడం తెలిసిందే. నాని, శ్రీనిధి హిట్ 3 లో సూపర్ హిట్ జోడీ అనిపించుకున్నారు. ఐతే హిట్ 3 తర్వాత తెలుగులో తెలుసు కదా సినిమాతో వస్తుంది శ్రీనిధి శెట్టి. ఈ సినిమా అక్టోబర్ 17న రిలీజ్ అవుతుంది. సిద్ధు తో శ్రీనిధి మాత్రమే కాదు ఈ సినిమాలో రాశి ఖన్నా కూడా జత కడుతుంది. ఇదిలా ఉంటే శ్రీనిధి శెట్టికి లేటెస్ట్ గా ఒక పాన్ ఇండియా సినిమా ఆఫర్ వచ్చినట్టు తెలుస్తుంది. స్టార్ హీరో స్టార్ డైరెక్టర్ కలిసి చేయబోతున్న ఒక పాన్ ఇండియా ప్రాజెక్ట్ లో శ్రీనిధి హీరోయిన్ గా పర్ఫెక్ట్ అని భావిస్తున్నారట. ఆఫర్ రాగానే అమ్మడు ఏమాత్రం ఆలోచించకుండా ఓకే అనేసిందని తెలుస్తుంది. శ్రీనిధి చేయబోతున్న ఆ పాన్ ఇండియా సినిమా ఏంటన్నది త్వరలో తెలుస్తుంది. %ూశ్రీంశీ =ము౦% - ఘాజి దర్శకుడితో గోపిచంద్.. గోపీచంద్ నెవ్వర్ బిఫోర్ గ్లింప్స్! ఐతే తెలుగు ఎంట్రీ కోసం కాస్త టైం తీసుకున్న శ్రీనిధి శెట్టి ఇక్కడ ఆడియన్స్ చూపిస్తున్న ప్రేమకు ఫిదా అయ్యిందని తెలుస్తుంది. అందుకే తెలుగులో ఛాన్స్ వస్తే మాత్రం చేసేందుకే ప్రయత్నించేలా చూస్తుందట. ఇదివరకు తెలుగు ఆఫర్స్ వచ్చినా అంతగా ఆసక్తి చూపించని శ్రీనిధి శెట్టి హిట్ 3 టైం లో తెలుగు ప్రేక్షకులు తనపై చూపిస్తున్న ప్రేమను చూసి ఇక్కడ సినిమాలు కొనసాగించాలని ఫిక్స్ అయ్యింది. మరి శ్రీనిధి టాలీవుడ్ కెరీర్ ఎలా ఉంటుందో చూడాలి. కన్నడలో కూడా శ్రీనిధి ఇక మీదట వరుస సినిమాలు చేయాలని అనుకుంటుందట. కె.జి.ఎఫ్ తర్వాత సొంత భాషలో ఆఫర్లు లేక ఇబ్బంది పడిన శ్రీనిధి ఇక మీదట అన్ని భాషల్లో సినిమాలు చేయాలని ఫిక్స్ అయ్యిందట.

## మంగ్లీ బర్త్ డే పార్టీపై క్లారిటీ ఇచ్చిన దివి!



ఫోక్ సింగర్ మంగ్లీ పుట్టినరోజు వేడుకలు టాలీవుడ్ లో కలకలం సృష్టిస్తున్నాయి. గత రాత్రి చేవెళ్ల సమీపంలోని ఈర్లపల్లి త్రిపుర రిసార్ట్‌లో జరిగిన ఆమె బర్త్ డే వేడుకల్లో గంజాయి, విదేశీ మద్యం ఉపయోగించారని పోలీసులు నిర్ధారించారు. ఈ వేడుకలో ఇండస్ట్రీకి సంబంధించిన వారు 50 మంది పాల్గొనగా వారందరికీ డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా .. 9 మంది గంజాయి తీసుకున్నారని తేలింది. దీంతో వెంటనే మంగ్లీ మీద కేసు నమోదు చేశారు.ఇక ఈ వేడుకలో సినీ పరిశ్రమకు చెందిన దివి కాసర్ల శ్యామ్, రచ్చ రవి, సింగర్ ఇంద్రావతి వంటి పలువురు పాల్గొన్నారని తెలుస్తోంది. ఇక వీరు కూడా గంజాయి తీసుకున్నారంటూ ఫొటోలు పెట్టి సోషల్ మీడియాలో వార్తలు వినిపిస్తున్నా యి. తాజాగా ఈ వార్తలపై నటి దివి వైద్య స్పందించింది. బర్త్ డే పార్టీకి పిలిస్తే వెళ్లాను కానీ, ఆ గంజాయి కేసులో తనకు సంబంధం లేదని చెప్పుకొచ్చింది. తన ఫోటోలను మీడియా నుంచి తీసివేయాలని కోరింది. మీడియా మిత్రులందరికీ నమస్కారం. ఒక చిన్న రిక్వెస్ట్. ఫ్రెండ్ బర్త్ డే పార్టీ అని వెళితే.. అక్కడ ఏం జరుగుతుందో.. వాళ్లు ఏం తప్పు చేస్తున్నారో.. ఆ తప్పులను నాపై తోయడం కాదు కదా. నేను తప్పు చేశాను అని ప్రూఫ్స్ ఉంటే నా పేరు పెట్టినా బావుంటుంది. కానీ, ఎలాంటి ప్రూఫ్స్ లేకుండా నా ఫోటోలు పెట్టి నెగెటివ్ గా చేస్తే నా కెరీర్ కు ఎంత ఇబ్బంది అవుతుంది.

## 10ఏళ్ల గ్యాప్ గురించి జెనీలియా ఆందోళన!




కెరీర్ పీక్స్ లో ఉండగానే బాలీవుడ్ నటుడు రితేష్ దేశ్ ముఖ్‌ని పెళ్లాడింది జెనీలియా. బలమైన రాజకీయ నేపథ్యం పైగా మాజీ ముఖ్యమంత్రి కొడుకు అయిన రితేష్ ని పెళ్లాడటంతో అప్పట్లో జెనీలియా పేరు ప్రధానంగా మీడియా హెడ్ లైన్స్ లోకి వచ్చింది. ఈ జంట ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వారి అన్యోన్య దాంపత్యం ప్రధానంగా చర్చనీయాంశమైంది. అయితే రితేష్‌ను వివాహం చేసుకున్న తర్వాత 2012లో జెనీలియా నటన నుండి విరామం తీసుకుంది. చివరికి మరాఠీ చిత్రం వేద్‌తో తిరిగి నటనలోకి రీఎంట్రీ ఇచ్చింది. 2022లో విడుదలైన ఈ చిత్రానికి రితేష్ స్వయంగా దర్శకత్వం వహించగా మరాఠాలో విజయవంతమైంది. అయితే జెనీలియా నెమ్మదిగా సినిమాలు చేస్తోంది. సల్మాన్ - జై హెూ, జాన్ అబ్రహాం- ఫోర్స్ 2 వంటి చిత్రాలలో అతిధి పాత్రలలోను జెనీలియా కనిపించింది. పెళ్లి చేసుకుని పదేళ్ల గ్యాప్ తర్వాత సినిమాల్లోకి రీఎంట్రీ ఇవ్వడంపై జెనీలియా తాజా ఇంటర్వ్యూలో వెల్లడించింది. నేను పరిశ్రమ నుంచి వచ్చిన వ్యక్తిని కాబట్టి నాకు అంతగా ఆందోళన లేదు. అదే బయటి వ్యక్తి అయితే ఈ గ్యాప్ వచ్చినందుకు చాలా ఆందోళన చెందుతారు. నేను- నా భర్త వారి కంటే బాగా ఈ పరిస్థితిని అర్థం చేసుకోగలమని అనుకుంటున్నాను. అయినా నేను 10 ఏళ్లు విరామం తీసుకోవాలని అనుకున్నాను. అలా చేయడమే నాకు కరెక్ట్ అనిపించింది. అప్పుడు నాకు ఉన్న ఆప్షన్ అదొక్కటే. నేను అనుకున్నదే చేసాను. షూటింగులు చేయడం అంటే రేయింబవళ్లు కొన్ని షెడ్యూల్స్ ఉంటాయి. రాత్రి పూట షూట్ లతో కొన్ని సమస్యలు ఉన్నాయి. అందుకే ఈ గ్యాప్ తీసుకున్నాను. సరైన సమయంలో రీఎంట్రీ ఇచ్చి ఇప్పుడు ఆనందకరమైన స్థానంలో ఉన్నాను అని జెనీలియా వివరణ ఇచ్చింది. రితేష్-జెనీలియా ఇద్దరు అందమైన పిల్లలకు పేరెంట్. పిల్లల కోసం జెనీలియా తన కెరీర్ ని కొంత త్యాగం చేసింది. పరిస్థితుల వల్ల కొంత గ్యాప్ లు వచ్చినా జెనీలియా సినిమాలు చేస్తోంది. ప్రస్తుతం అమీర్ ఖాన్ తో కలిసి సీతారే జమీన్ పర్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తోంది. స్పానిష్ చిత్రం కాంపియోన్స్‌కి అధికారిక హిందీ రీమేక్ ఇది. ఒక టోర్నమెంట్ కోసం మానసిక వికలాంగురైన కొందరు పిల్లల టీమ్‌కు శిక్షణ ఇవ్వవలసి వచ్చే పరిస్థితిలో బాస్కెట్‌బాల్ కోచ్ (అమీర్) కథేమిటన్నది తెరపై చూడాలి. అతడి భార్యగా జెనీలియా నటించింది. ఈ చిత్రం అమీర్ ఖాన్ నటించిన 2007 డ్రామా చిత్రం తారే జమీన్

## చెడులోను మంచి.. బోల్డ్ బ్యూటీ రికార్డ్



బాలీవుడ్ యంగ్ బ్యూటీ సౌందర్య శర్మ పరిచయం అవసరం లేదు. ఈ భామ పలు బోల్డ్ వెబ్ సిరీస్ లతో య౦౩వత౦౦ హృదయాల్లో తిష్ఠ వేసింది. గ్లామరస్ [illegible] మత్తెక్కించడంలో సౌందర్య శర్మ ప్రత్యేకత గురించి చాలా చర్చ సాగుతోంది. ఇంతలోనే ఈ బ్యూటీ హౌస్ ఫుల్ 5లో కనిపించింది. ఈ సినిమాలో ముగ్గురు అందాల భామలు నటించగా, అందరిలో సౌందర్యనే ఎక్కువ మార్కులు కొట్టేసింది. థియేటర్ కి వెళ్లిన ప్రతి ఒక్క యువకుడు ఈ బ్యూటీ గురించే ముచ్చటించుకున్నారు. సౌందర్య ఎక్స్ పోజింగ్ - హావభావాలు మత్తెక్కించాయన్న చర్చా సాగింది. అయితే హద్దు మీరి ఎక్స్ పోజింగ్ చేసిందని.. వల్గర్ దృశ్యాల్లో జీవించిందని కూడా సౌందర్యపై విమర్శలొచ్చాయి. అయితే చెడు ప్రచారంతో కూడా ఈ అమ్మడికి మంచే జరిగింది. ఈ ప్రతికూలత సౌందర్యకు కొంత సానుకూలంగా మారింది. తాజా కథనాల ప్రకారం.. సౌందర్య వికీలో అత్యధికంగా శోధించబడిన నటిగా మారింది. నిజానికి ఈ పోటీలో అక్షయ్ కుమార్‌ను కూడా వెనక్కి నెట్టింది. తనతో పాటు నటించిన జాక్విలిన్, నర్గీస్ ఫక్రీ, సోనమ్ బజ్వా వంటి స్టార్లను కూడా సౌందర్య అధిగమించడం ఆసక్తికరం. సినిమాలో ప్రధాన పాత్రలను మించి సౌందర్య శర్మకు మంచో చెడో గుర్తింపు అయితే దక్కింది. కొన్నిసార్లు నెగెటివిటీ కూడా కెరీర్ ఎదుగుదలకు దారి తీయొచ్చు. సౌందర్యకు బాలీవుడ్ లో అవకాశాల పరంగా కొదవేమీ లేదు. వరుసగా వెబ్ సిరీస్ లు, సినిమాలు చేస్తోంది. గ్రాండ్ మస్తీ రేంజులో చెలరేగిపోవడమే నేటి యూత్ కి అవసరం. సౌందర్య శర్మ ఫాలో చేసింది అదే. ఇప్పుడు ఈ గ్లామర్ షో తన ఫాలోయింగ్ ని మరింత పెంచిందే కానీ తగ్గించలేదు. హౌస్ ఫుల్ 5 చిత్రంలో హద్దు మీరిన ఎక్స్ పోజింగులు, వల్గారిటీ విషయంలో విమర్శల్ని ఎదుర్కొంటున్నా కానీ, ప్రతిదీ సౌందర్య శర్మకు కలిసొస్తోంది. బాలీవుడ్ లో హద్దు మీరిన గ్లామర్ ట్రీట్ పై కొందరు వెటరన్ నటులు, సీనియర్ తారలు తీవ్రంగా విమర్శలు గుప్పిస్తున్నా, అందాల భామల్ని ఆరాధించే ప్రజలు పెరుగుతున్నారని నిరూపణ అవుతోంది.

## హరిహర వీరమల్లుపై క్రేజీ అప్‌డేట్.. క్లైమాక్స్ వీఎఫ్ఎక్స్ కోసం అన్ని కోట్లు ఖర్చు పెట్టారా..!



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ బ్రో చిత్రం తర్వాత మళ్లీ సినిమా చేయలేదు. ఆయన సినిమాల కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. హరిహర వీరమల్లు చిత్రం జూన్‌లో విడుదల అవుతుందని ఆశగా ఎదురు చూసారు. కాని పలు కారణాల వలన వాయిదా పడుతూ వస్తుంది. హరిహర వీరమల్లు సినిమా ప్రముఖ నిర్మాత ఏఎం రత్నం నిర్మాణ సారథ్యంలో రూపొందుతుంది. ఈ సినిమాకు ప్రముఖ దర్శకుడు క్రిష్ జాగర్లమూడితోపాటు జ్యోతికృష్ణ దర్శకత్వ పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తించారు. ఈ సినిమా వాస్తవంగా జూన్ 12వ తేదీన రిలీజ్ కావాల్సి ఉన్నప్పటికీ పోస్ట్ ప్రొడక్షన్ పనులు, కొన్ని వీఎఫ్ఎక్స్ వర్కులు పూర్తి కానందున మూవీ వాయిదా పడింది.హరిహర వీరమల్లు చిత్రం భారీ బడ్జెట్‌తో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతుంది. స్టోరీ డిమాండ్ చేయడం వల్ల ఎక్కువగా గ్రాఫిక్స్, వీఎఫ్ఎక్స్ వర్క్ అవసరం ఏర్పడింది. ఇరాన్ తో పాటు ఇతర దేశాల్లో టెక్నికల్ వర్క్ జరుగుతున్నది. అయితే ఇంకా పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి కాకపోవడం, హడావిడిగా చివరి నిమిషంలో విడుదల చేయడం ఎందుకనే ఉద్దేశంతో మేకర్స్ మరోసారి మూవీని వాయిదా వేసినట్టు తెలుస్తుంది. ఇంకా ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుంది అనే దానిపై క్లారిటీ లేదు. ఇక ఇదిలా ఉంటే ఈ సినిమా వీఎఫ్ఎక్స్ వర్క్ నెవర్ బిఫోర్ లెవెల్లో ఉంటుంది అని మేకర్స్ ప్రామిస్ చేశారు.తాజా సమాచారం ప్రకారం హరిహర వీరమల్లులో మొత్తం 6000 విఎఫ్ఎక్స్ షాట్స్ ఉన్నాయట. అలాగే ప్రతీ షాట్ లో 10 లేయర్స్ ఉంటాయని, మొత్తం వర్క్ అంతా ఒకెత్తు అయితే ఒక్క క్లైమాక్స్ పోర్షన్ విఎఫ్ఎక్స్ వేరే లేవల్‌లో ఉంటుందట. క్లైమాక్స్ కోసమే మేకర్స్ ఏకంగా 25 కోట్లు వెచ్చించినట్టుగా తెలుస్తుంది. సినిమా అద్భుతంగా వచ్చేందుకు మేకర్స్ ఎక్కడా కూడా కాంప్రమైజ్ కాకుండా సినిమాని ఆడియెన్స్ కి మంచి ఎక్స్ పీరియన్స్ ఇచ్చేలా సిద్ధం చేస్తున్నారట. జూన్ 12న రిలీజ్ కావల్సిన ఈ చిత్రం వాయిదా పడడంతో జులై 4న రిలీజ్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.. అయితే ఆ రోజు విజయ్ దేవరకొండ 'కింగ్‌డమ్' విడుదల కానున్నట్లు మేకర్స్ ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

## నిఖిల్ సినిమా షూటింగ్‌లో భారీ ప్రమాదం.. పలువురికి తీవ్ర గాయాలు



టాలీవుడ్ యువ హీరో నిఖిల్ వైవిధ్యమైన సినిమాలు చేస్తూ ప్రేక్షకులని అలరిస్తున్న విషయం తెలిసిందే. ఆయన నటించిన కొన్ని చిత్రాలు నార్త్ ప్రేక్షకులని కూడా ఎంతగానో అలరించాయి. ప్రస్తుతం నిఖిల్ పాన్ ఇండియా లెవెల్లో సత్తా చాటుతున్నాడు. కార్తికేయ 2 సినిమా తర్వాత నిఖిల్ రేంజ్ ఏ లెవల్‌కి వెళ్లిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

అయితే తాజాగా నిఖిల్ ది ఇండియన్ హౌస్ అనే చిత్రం చేస్తున్నాడు. ఈ చిత్ర షూటింగ్ హైదరాబాద్ లోని శంషాబాద్ సమీపంలో వేసిన సెట్లో జరుగుతుంది. అయితే అనుకోకుండా ఊహించని ప్రమాదం సంభవించింది. సినిమాలోని సముద్ర సన్నివేశాల కోసం ఏర్పాటు చేసిన భారీ వాటర్ ట్యాంక్ అకస్మాత్తుగా పగిలిపోవడంతో లొకేషన్ మొత్తం నీట మునిగింది. ఈ ప్రమాదంలో ఒక అసిస్టెంట్ కెమెరామెన్‌కు తీవ్ర గాయాలు కాగా, ఇంకా మరికొంత మంది సిబ్బంది గాయపడ్డట్లు తెలుస్తోంది. గాయపడిన వారిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై చిత్ర నిర్మాణ సంస్థ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.ప్రస్తుతం సెట్‌లో నెలకొన్న గందరగోళానికి సంబంధించిన విజువల్స్ ఇప్పుడు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. మరి ఆ సమయంలో హీరో నిఖిల్ సిద్ధార్థ్ సెట్‌లో ఉన్నారా లేదా అనే విషయంపై కూడా స్పష్టత లేదు. ఈ ఘటనతో సెటప్ మొత్తం ధ్వంసం అయినట్టు చెబుతున్నారు. తీవ్ర ఆర్థిక నష్టం కూడా సంభవించినట్లు టాక్ వినిపిస్తుంది.. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. అలానే పరిస్థితిని సమీక్షించిన యూనిట్ ప్రస్తుతం షూటింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేసినట్టు

## కోచ్‌కు షాక్ ఇచ్చిన బుమ్రా.. ఇది కదా కావాల్సింది!



**లండన్-నవభూమి:** ఇంగ్లండ్ టూర్‌లో ఉన్న భారత జట్టు 5 టెస్టుల సిరీస్ కోసం జోరుగా రెడీ అవుతోంది. టీమిండియా ప్లేయర్లు నెట్స్‌లో తీవ్రంగా చెమటోడ్చుతున్నారు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, రవిచంద్రన్ అశ్విన్ వంటి గొప్ప ఆటగాళ్ల నిష్క్రమణ తర్వాత జరుగుతున్న తొలి సిరీస్ కావడంతో ఎలాగైనా గెలిచి తీరాలని అనుకుంటున్నారు. దిగ్గజాలు లేకపోయినా టీమిండియాకు ఎదురులేదని చాటిచెప్పాలని భావిస్తున్నారు. సీనియర్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా కూడా తన బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇవ్వాలని అనుకుంటున్నాడు. అందుకోసం నెట్స్‌లో చెమటలు చిందిస్తున్నాడు. అయితే అతడి బౌలింగ్ చూసి కోచ్ బిత్తరపోయాడట. ఆ రిథమ్ ఏంటి బాస్ అంటూ షాక్ అయ్యాడట. అసలేం జరిగిందంటే.. సీన్ రివర్స్..భీకరమైన పేస్, నిలకడైన లైన్ అండ్ లెంగ్త్, చక్కటి రిథమ్‌తో బౌలింగ్ చేసే బుమ్రా అంటే ప్రత్యర్థులకు హడల్. అతడి రాకాసి స్వింగర్లు, అనూహ్యమైన బౌన్సర్లు, స్టన్నింగ్ యార్కర్లకు స్టార్ బ్యాటర్ల దగ్గర కూడా సమాధానం లేదు. అతడు బౌలింగ్‌కు దిగుతున్నాడంటేనే అంతా భయపడతారు. అయితే ఈసారి సీన్ రివర్స్ అయింది. బుమ్రా బంతుల్ని సంధిస్తున్న తీరు, అతడి రిథమ్ చూసి టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ షాక్ అయ్యాడు. ఈ విషయాన్ని స్వయంగా అతడే బయటపెట్టాడు. జస్‌ప్రీత్ ఫిట్‌గా ఉన్నాడని, అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నాడని అన్నాడు. వాటే ఎనర్జీ..'బుమ్రాకు ఎలా సన్నద్ధం అవ్వాలో తెలుసు. గత మూడ్రోజులుగా ట్రెయినింగ్ సెషన్స్‌లో అతడి బౌలింగ్‌ను గమనిస్తున్నాడు. సూపర్ ఎనర్జీతో బంతులు సంధిస్తున్నాడు. అతడి ఎనర్జీ చూసి షాక్ అయ్యా. అతడు ఫిట్‌గా ఉండటం సంతోషకరం. బుమ్రాను ఎలా వాడుకోవాలో మాకు తెలుసు. మా జట్టుకు అతడు చాలా కీలకం. కాబట్టి అవసరాన్ని బట్టి బుమ్రా చేతికి బంతులు ఇస్తూ పోతాం' అని మోర్కెల్ చెప్పుకొచ్చాడు. బౌలింగ్ కోచ్ వ్యాఖ్యలపై నెటిజన్స్ హర్షం వ్యక్తం చేస్తున్నారు. బుమ్రా వేటకు సిద్ధమవుతున్నాడని.. ఇంగ్లండ్‌కు దబిడిదిబిడేనని అంటున్నారు. కోచ్‌కే షాక్ ఇచ్చాడంటే ఏ రేంజ్‌లో సన్నద్ధమవుతున్నాడో అర్థం అవుతోందని, ఇది కదా బుమ్రా నుంచి కావాల్సింది అని కామెంట్స్ చేస్తున్నారు.

## టీమిండియాకు కొత్త టెన్షన్.. ఇది సెట్ చేస్తే తిరుగుండదు!



**లండన్-నవభూమి:** ఇంగ్లండ్‌తో 5 టెస్టుల సిరీస్ కోసం జోరుగా సన్నద్ధం అవుతోంది భారత జట్టు. మరో వారం రోజుల్లో ఈ సిరీస్ మొదలవనుంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ గైర్హాజరీలో భారత్ ఆడుతున్న ప్రధాన టెస్ట్ సిరీస్ కావడంతో అటు కొత్త కెప్టెన్ శుబ్‌మన్ గిల్‌తో పాటు ఇటు హెడ్ కోచ్ గౌతం గంభీర్ నేతృత్వంలోని టీమ్ మేనేజ్‌మెంట్‌కు ఇది కఠిన పరీక్షగా నిలవనుంది. కుర్రాళ్లతో నిండిన మెన్ ఇన్ బ్లూ ఎలా ఆడుతుంది? ఇంగ్లండ్ విసిరే సవాళ్లను తట్టుకొని ఎంతవరకు రాణిస్తుందనేది ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ తరుణంలో గంభీర్ అండ్ కోకు కొత్త టెన్షన్ పట్టుకుంది. అదేంటో ఇప్పుడు చూద్దాం..విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ రిటైర్‌మెంట్‌తో టీమిండియాలోకి కొత్త నీరు చేరింది. కరుణ్ నాయర్, సాయి సుదర్శన్ లాంటి బ్యాటర్లు జట్టులోకి ఎంట్రీ ఇస్తున్నారు. అయితే సుదర్శన్‌ను ఏ స్పాట్‌లో ఆడించాలనేది గిల్-గంభీర్‌కు అర్థం కావడం లేదని సమాచారం. సీనియర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ ఓపెనర్‌గా ఆడటం దాదాపుగా ఖాయమైంది. అతడికి తోడుగా మరో ఓపెనర్‌గా యశస్వి జైస్వాల్ ఆడటం కూడా పక్కాగా కనిపిస్తోంది. టెస్టుల్లో తన స్థానాన్ని పదిలం చేసుకున్న జైస్వాల్ మొదట్నుంచి ఓపెనర్‌గానే ఆడుతూ వస్తున్నాడు. కాబట్టి ఇక మీదటా అదే పొజిషన్‌లో ఆడించొచ్చు. అలాంటప్పుడు దేశవాళీలతో పాటు ఐపీఎల్‌లోనూ ఓపెనర్‌గా రాణించిన సాయి సుదర్శన్‌ను ఏ ప్లేస్‌లో

## ముమ్మర సాధన



**లండన్-నవభూమి:** యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్ కోసం భారత్ కఠోరంగా శ్రమిస్తోంది. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల రిటైర్మెంట్‌తో ప్రస్తుతం జట్టులో అనుభవలేమి బాగా కనిపిస్తోంది. కానీ, కోచ్ గౌతమ్ గంభీర్ వ్యూహాలు, సూచనలతో టీమిండియా సంచలనాలు నమోదు చేయాలనుకొంటోంది. కెప్టెన్‌గా గిల్‌కు కూడా ఇది తొలి సిరీస్ కావడంతో అతడిపై ఒత్తిడి నెలకొనే అవకాశం ఉంది. ప్రస్తుతం బెకెన్‌హామ్‌ను బేస్‌గా చేసుకొన్న టీమిండియా ఈ నెల 20 నుంచి జరిగే సిరీస కోసం ముమ్మరంగా సాధన చేస్తోంది. భారత్-ఎ తరఫున చాలా మంది ఆటగాళ్లు ఈపాటికే ఇంగ్లండ్ లయన్స్‌తో రెండు అనధికార టెస్టులు ఆడేశారు. శుక్రవారం భారత జట్ల మధ్యే మూడో ప్రాక్టీస్ మ్యాచ్ జరగనుంది. అయితే, గంభీర్ మాత్రం ప్రతి విషయాన్ని సీరియస్‌గా తీసుకొంటున్నట్లు తెలుస్తోంది. జట్టుకు బ్యాటింగ్ సాధనలా కాకుండా వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించే విధంగా ప్రాక్టీస్ వికెట్లను రూపొందించాలని క్యూరేటర్లకు సూచించాడట. సహజంగా ఇంగ్లిష్ పిచ్‌లు స్వింగ్‌కు ఎక్కువగా సహకరిస్తాయి. ఈ నేపథ్యంలో భారత కోచింగ్ సిబ్బంది మ్యాచ్ ప్రాక్టీస్ కోసం చక్కని వికెట్ కావాలని కోరినట్టు క్యూరేటర్ జోష్ మార్డెన్ తెలిపాడు. అందుకు అనుగుణంగా వికెట్‌ను రూపొందించినట్టు చెప్పాడు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**